అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 12 -3 -2018

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 73 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

డ్రెస్‌కోడ్ నిరసనలు



- సల్వార్ కమీజ్, చీరలు మాత్రమే ధరించాలి : రాజస్థాన్ ఉన్నత విద్యాశాఖ 'డ్రెస్‌కోడ్' ఉత్తర్వులు

వివరాలు 2లో

9 రాష్ట్రాల్లో తగ్గిన వర్షపాతం

తెలంగాణకు పొంచి ఉన్న నీటి ఎద్దడి..



- వాతావరణంపై మార్చిన కేంద్ర ఆర్థిక సర్వే పాట్రన్

వివరాలు 9లో

నేరచరిత నేతలు

1700మందిపై కేసులు..3,045 మంది క్రిమినల్స్

- ఎంపీలు, ఎమ్మెల్యేల కేసుల విచారణ నత్తనడకే..
- పెండింగ్ కేసుల్లో ఉత్తర్‌ప్రదేశ్ టాప్
- తెలుగురాష్ట్రాల్లోనూ పలువురు ప్రజాప్రతినిధులపై కేసులు



న్యూఢిల్లీ : దేశ రాజకీయాల్లో బాగా చదువుకున్న వారు,ప్రజా సేవ చేసే వారిని ఎంపిక చేసుకునే రోజులు పోయాయి.బీజేపీ,కాంగ్రెస్ పార్టీలే కాదు ప్రాంతీయపార్టీలు కూడా పోటీపడిమరీ నేరచరిత్ర కలిగిన వారిని ఎన్నికల బరిలో దింపటం సర్వసాధారణమైపోయింది. అలాంటి వారిని ఓటర్లు కూడా పట్టంకడుతున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతూనే ఉన్నది.అయితే ప్రస్తుతం చట్టసభల్లో ...9లో

ఇంటిగుట్టు

విద్యాశాఖలో రాంగ్‌రూట్లో హౌస్ బిల్డింగ్ అడ్వాన్సులు

- రెండో విడత అడ్వాన్సులు పొందినా కనిపించని నిర్మాణాలు
- స్థలాన్ని పరిశీలించకుండానే రూ.3.77కోట్లు విడుదల చేసిన అధికారులు
- హైదరాబాద్ డీఈఓ ఆఫీస్ నుంచే దందా!
- అక్రమాల్లో ఉన్నతాధికారుల చేతివాటం

9లో



పాఠశాల విద్యాశాఖలో మరో అవినీతి కుంభకోణం వెలుగుచూసింది. అన్నం పెడుతున్న సర్కారుకే...కొందరు ఉద్యోగులు కన్నం వేశారు. హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల పేరుతో నిధులు తీసుకున్నారు. కనీసం ఒక్కరూ నిర్మాణాలు చేపట్టలేదు. అయితే స్థలాన్ని, నిర్మాణాలను పరిశీలించకుండానే అధికారులు కోట్ల రూపాయలు విడుదల చేశారు. సర్కారు చెప్పిన స్థలంలో కాకుండా వేరే చోట స్థలాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. అయితే ఉద్యోగులు అడ్వాన్స్ తీసుకున్న నిధులతో వడ్డీ వ్యాపారం చేశారని తెలుస్తోంది. ఈ అవినీతి దందాకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం వేదికైంది. దీనిలో కిందిస్థాయి నుంచి సచివాలయం స్థాయి అధికారులందరి హస్తం ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బహుజనుల రాజ్యాధికారమే బీఎల్‌ఎఫ్ ధ్యేయం

బీఎల్‌ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్

- కాంగ్రెస్ బీసీ సీట్లను ప్రకటించాలి : తమ్మినేని వీరభద్రం



9లో



బంద్ వాయిదా

- 13న ఇంటర్ పరీక్షలను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం : మందకృష్ణ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కోరుతూ ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ నిర్వహించతలపెట్టిన బంద్‌ను వాయిదా వేస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చెప్పారు. ఆ రోజున ...9లో

కేంద్రానికి వర్గీకరణ చేసే ఉద్దేశం లేదు

లేఖ రాశాం, ప్రధాని అపాయింట్‌మెంట్ కోరాం



- పార్లమెంట్ సమావేశాల్లోపు ఢిల్లీలో ప్రజాప్రతినిధులతో ధర్నా
- ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నాం
- 13న ఇంటర్ పరీక్ష యథాతథం : ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

9లో



టీఆర్ఎస్ బీసీ మంత్రం!

ఆ సామాజికవర్గం నుంచే ఇద్దరు పెద్దల సభకు

- ఆఖరి బడ్జెట్‌లోనూ పెద్ద పీట
- కేంద్రంలోనూ మనమే చక్రం తిప్పాలి...సహకరించండి : ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం

9లో

ముంబయిలో కిసాన్ ర్యాలీ

నేడు 'మహా' అసెంబ్లీ ముట్టడి



వివరాలు 2లో

థర్డ్‌ఫ్రంట్ అవసరం లేదు

- రాజ్యసభ ఎన్నికలకు విప్ జారీ
- సాగర్ ఆయకట్టుకు ఏప్రిల్ 15 వరకూ సాగునీరివ్వాలి : జానారెడ్డి

వివరాలు 3లో



పిచ్చోడా.. వాళ్లకంటే మనమే ఎక్కువ పెరిగాంరా.. కానీ.. మీడియానే గుర్తించి రాయడంలేదు...!!

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్లుగా అంజనీ కుమార్, వి.సి. సజ్జనార్

6లో

కమలనాథుల ఫేక్ న్యూస్

- నకిలీ వార్తలకు కేరాఫ్ గా బీజేపీ

10లో

'డ్రెస్ కోడ్' నిరసనలు

- సల్వార్ కమీజ్, చీరలు మాత్రమే ధరించాలి : రాజస్థాన్ ఉన్నత విద్యాశాఖ 'డ్రెస్‌కోడ్' ఉత్తర్వులు

జైపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే అమ్మాయిలు 'డ్రెస్‌కోడ్' నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇకనుంచి ప్యాంటు షర్టులు వేసుకోకూడదని.. సల్వార్ కమీజ్‌లు, చీరలు మాత్రమే ధరించి కాలేజీకి రావాలని రాజస్థాన్ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. వరుసగా వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్న విద్యాశాఖ తాజాగా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా విద్యార్థినులు నిరసన గళం విప్పారు. రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఉత్తర్వులపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. దీనిపై విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ జ్యోత్స్న భరద్వాజ్ మాట్లాడుతూ... గతేడాది అల్వార్‌లో జరిగిన 'గురు శిష్యుల సమ్మేళనం'లో పాల్గొన్న కొంతమంది ఇంటర్ కళాశాల విద్యార్థులు తమకు ప్రయివేటు కళాశాలల్లో లాగా డ్రెస్ కోడ్‌లు కావాలని కోరారని.. వారి కోరికమేరకే డ్రెస్‌కోడ్ నిబంధనలు తీసుకొస్తున్నామని తెలిపారు.

ఈ అంశంపై విద్యార్థుల స్పందన కోరగా... అల్వార్ సదస్సులో అలాంటి విషయాలేమీ ప్రస్తావనకు రాలేదన్నారు. ల్యాబ్‌లలో పరికరాలు, ఇతర సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని, త్వరగా ఏర్పాటు చేయాలని కోరితే.. ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా డ్రెస్‌కోడ్‌ను తీసుకురావడం విడ్డూరమన్నారు. రాజస్థాన్ విద్యాశాఖ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం కొత్తేమీ కాదు. పాఠశాలల్లో విద్యార్థులు ఉదయం సాయంత్రం 'కచ్చితంగా' జాతీయ గీతం పాడాలని.. మాంసాహారం తింటే అనారోగ్యం పాలవుతారంటూ వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న విషయం తెలిసిందే.

నిధుల్ని ఖర్చు చేయని మైనార్టీ శాఖ

- నిధుల వ్యయంపై తప్పుపట్టిన పార్లమెంటరీ ప్యానెల్



న్యూఢిల్లీ: బడ్జెట్ కేటాయింపుల్లోని నిధులను తక్కువగా ఖర్చుచేయడంతో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మైనార్టీ శాఖకు కేటాయించిన 4,195.48 కోట్ల రూపాయల్లో ఫిబ్రవరి 20నాటికి కేవలం 66.58శాతమే వ్యయం చేసింది. ఈ నిధుల వ్యయంపై బీజేపీ ఎంపీ రమేశ్ బాయిస్ చైర్మెన్‌గా వ్యవహరిస్తున్న స్టాండింగ్ కమిటీ తన 53వ రిపోర్టును పార్లమెంటులో సమర్పించింది. ప్రతి ఏడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల కంటే మైనార్టీ శాఖ తక్కువగా వ్యయం చేస్తోందని ఈ నివేదిక పేర్కొంది. ఇలా తక్కువగా ఖర్చుపెట్టడంపై గతేడాది చెప్పిన కారణాలే నేడు వివరించిందని తెలిపింది. ఇది నిత్య సమస్యగా మారుతున్నదని పేర్కొన్నది. ఆర్థిక సంవత్సరం చివరి నెలలో నిధుల వినియోగం 30నుంచి 40శాతానికి పడిపోవడాన్ని అరికట్టడంలో మైనార్టీ శాఖ విఫలమవుతోందని తెలిపింది. కేటాయించిన నిధులు తక్కువగా ఖర్చుచేయడం.. భవిష్యత్తు బడ్జెట్ కేటాయింపులను ప్రభావితం చేయదా? అని మైనార్టీ శాఖను స్టాండింగ్ కమిటీ అడగ్గా..ఆర్థిక శాఖ నుంచి మినహాయింపు తీసుకుంటామని తెలిపింది. ఒకవేళ ఆర్థిక శాఖ ఈ మినహాయింపునివ్వకపోతే.. సంక్షేమ పథకాలకు ఇదివరకు చెల్లించాల్సిన నిధులు చెల్లించినట్టుగానే నమోదయ్యే ప్రమాదం ఉందని కమిటీ హెచ్చరించింది. ఆర్థిక నిబంధనలు పాటించాలని ఇన్నేండ్లు మైనార్టీ శాఖకు సూచిస్తున్నా నిధుల వినియోగంలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదని కమిటీ తెలిపింది. కేటాయించిన నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ సూచించిన మార్గదర్శకాలు పాటించడాన్ని మైనార్టీ శాఖ విచక్షణకే వదిలేస్తామని కమిటీ స్పష్టం చేసింది. అయితే కొన్నేండ్లుగా మైనార్టీ శాఖ ఖర్చుపెట్టిన వివరాలను కమిటీ వెల్లడించలేదు.

ముంబయిలో కిసాన్ ర్యాలీ

- నేడు 'మహా' అసెంబ్లీ ముట్టడి
- న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి: ఏచూరి



ముంబయికి చేరుకున్న రైతులు


రైతుల కాళ్లకు బొబ్బలు

ముంబయి: 'మహా' ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) రైతులు ఐదురోజుల క్రితం చేపట్టిన ర్యాలీ 50వేల మందితో ఆదివారం ముంబయికి చేరుకున్నది. రైతుల పూర్తి రుణ మాఫీ, విద్యుత్ బిల్లుల రద్దు, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల అమలు, ఆదివాసీల భూబదలాయింపు చేయాలనే డిమాండ్లతో నేడు రాష్ట్ర అసెంబ్లీని రైతులు ముట్టడించనున్నారు. గత మంగళవారం సాయంత్రం నాసిక్ నుంచి రైతులు చేపట్టిన ర్యాలీ.. 180 కిలోమీటర్ల మేర కాలినడకన సాగి ముంబయికి చేరింది. దీంతో పోలీసుల నగరంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటుచేసి ఎటువంటి అసంఘటనలు చోటు చేసుకోకుండా ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. అసెంబ్లీ ముట్టడికి రైతులు పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులను ప్రభుత్వం మళ్లీ మోసగించవద్దని, న్యాయమైన వారి డిమాండ్లను నెరవేర్చాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. ఫడ్నవీస్ ప్రభుత్వ వైఫల్యం పై రైతులు కొనసాగిస్తున్న ఆందోళనకు మిత్ర పక్షం శివసేనతో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ), మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన అధ్యక్షులు రాజ్‌థాక్రే మద్దతు పలికారు. ముంబయికి చేరిన వేలాది మంది రైతులను కలిసిన శివసేన పార్టీ చైర్‌పర్సన్ ఆదిత్య థాక్రే.. వారికి మద్దతునిచ్చారు. కాగా, ముంబయికి చేరిన రైతు నాయకులతో రాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ చర్చలు జరిపారు. అయితే చర్చలు విఫలమయ్యాయిని, అసెంబ్లీ ముట్టడి యథాతథంగా జరుగనున్నదని ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి అజిత్ నవాలే తెలిపారు. నగర ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరసనను తెలుపుతామని ఏఐకేఎస్ అధ్యక్షులు అశోక్ ధావ్లే చెప్పారు. రైతులు నిరసనలు ఎదుర్కోవడం మహా ప్రభుత్వానికి ఇది తొలిసారేం కాదు. ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ రైతులు ఆత్మహత్యలు గణనీయంగా పెరుగుతుండటం విశేషం.



త్రిపురలోని బలోనియా ప్రాంతంలో హిందూత్వ శక్తులు కూలగొట్టిన లెనిన్ విగ్రహ ప్రాంతాన్ని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ పరిశీలించారు.

దళితురాలిపై బీజేపీ ఎమ్మెల్యే దాడి



డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లో ఓ దళిత మహిళను బీజేపీ ఎమ్మెల్యే కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా కొట్టారు. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటికి రావడంతో బీజేపీ ఎమ్మెల్యే నిర్వాకం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..దంపతుల మధ్య వివాదాన్ని పరిష్కరింపజేసుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యే రాజ్‌కుమార్ నివాసానికి ఇరు కుటుంబాలు వెళ్లాయి. వివాదం మరింత పెరగడంతో అక్కడ ఉన్న దళిత మహిళను కులం పేరుతో దూషిస్తూ ఆ ఎమ్మెల్యే తీవ్రంగా కొట్టారు. బాధితుల తరపున రాం కిషోర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేసినట్టు పోలీసులు తెలిపారు. రుద్రాపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌కుమార్‌పై ఐపీసీ సెక్షన్ 323, 504తోపాటు ఎస్సీ మరియు ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసినట్టు వెల్లడించారు. ఘటనాస్థలంలోని మరో ఇద్దరు బీజేపీ నేతల పేర్లనూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నామని తెలిపారు.

సౌరవిప్లవం రావాలి

- 2022 నాటికి దేశంలో 175 గిగావాట్ల సౌరవిద్యుత్ : ఐఎస్ఏ సదస్సులో మోడీ



న్యూఢిల్లీ: పునరుత్పాదకత శక్తి కలిగిన సౌరశక్తిని వాడుకుని.. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రజల ఇందన అవసరాలను తీర్చేందుకు సౌరవిప్లవం రావాలని ప్రధాని మోడీ అన్నారు. న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ... అత్యంత సరసమైన ధరల్లో లభించే సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయ డానికి అవసరమైన నిధుల కోసం భారీగా రాయితీలు స్తున్నామ న్నారు. దేశంలో 2022 నాటికి 175 గిగావాట్ల సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేస్తామన్నారు. గడిచిన మూడేండ్లలో దేశంలో 28 కోట్ల ఎల్ఈడీ బల్బులను పంపిణీ చేశామన్నారు. దీనివల్ల నాలుగు గిగావాట్ల విద్యుత్తును ఆదా చేయగలిగామన్నారు. 2030 నాటికి ప్రపంచ దేశాలతో కలిపి 1000 గిగావాట్ల సౌరవిద్యుత్తును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఐఎస్ఏ ప్రకటించింది. ఐఎస్ఏ ప్రధాన కార్యాలయం గుర్గావ్‌లో ఉంది.

అడవిలో అగ్ని కీలలు

- యువతి మృతి, మంటల్లో చిక్కుకున్న మరో 20 మంది..
- తమిళనాడులో విజ్ఞానయాత్రకు వెళ్లిన విద్యార్థులు




చెన్నై: తమిళనాడులోని తెనీ జిల్లాలో ఉన్న అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఒక యువతి చనిపోగా.. దాదాపు 20 మంది విద్యార్థులు మంటల్లో చిక్కుకున్నారు. 100 మందితో కూడిన విపత్తు నిర్వహణా బృందం సహాయక చర్యలు ప్రారంభించింది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్(ఐఏఎఫ్) సిబ్బంది కూడా రంగంలోకి దిగారు. రాష్ట్రంలోని కోయంబత్తూర్, ఇరోడ్ ప్రాంతాలకు చెందిన దాదాపు 40 మంది విద్యార్థులు తెనీలోని కురంగిణి అటవీ ప్రాంతంలోకి ఆదివారం ట్రెక్కింగ్‌కు వెళ్లారు. ఇంతలో వారు ఉన్న ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు లేచాయి. మంటలు క్రమంగా వ్యాపించి చుట్టుముట్టడంతో విద్యార్థులు బయటకు రాలేకపోయారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి పలువురు విద్యార్థులను రక్షించారు. ప్రమాదంలో ఒక యువతి మృతి చెందగా, కొందరు తీవ్రంగా గాయపడినట్టు పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. మంటల్లోనే చిక్కుకొని ఉన్న మరో 20 మంది కోసం రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. తమిళనాడు సీఎం పళనీస్వామి అభ్యర్థన మేరకు.. ఘటనా స్థలికి వెళ్లి వెంటనే సహాయక చర్యలు చేపట్టాల్సిందిగా ఐఏఎఫ్ అధికారులను కేంద్ర రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశాలు జారీ చేశారు.

అంతర్జాతీయం

అధ్యక్ష పదవిపై పరిమితిని తొలగించిన చైనా

రాజ్యాంగ సవరణకు పార్లమెంట్ ఆమోదముద్ర



బీజింగ్: చైనా రాజ్యాంగంలో అధ్యక్ష పదవి నిర్వహణపై ఉన్న కాలపరిమితులను తొలగించే రాజ్యాంగ సవరణను చైనా పార్లమెంట్ ఆదివారం నాడు ఆమోదించింది. దీనితో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అధ్యక్ష పదవిలో మూడోసారి కూడా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. ఇక్కడి గ్రేట్ హాల్ ఆఫ్ అసెంబ్లీలో జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి హాజరైన మొత్తం 2,963 ప్రతినిధుల్లో రెండు ఓట్లు వ్యతిరేకంగా పడ్డాయి. ముగ్గురు సభ్యులు గైర్హాజరయ్యారు. ఈ ప్రతిపాదనకు పార్లమెంట్ ఆమోదముద్ర వేయటంతో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మూడోసారి పదవిలో కొనసాగేందుకు వీలు ఏర్పడింది. గతంలో ఆధునిక చైనా వ్యవస్థాపకుడు మావోజెడాంగ్ 1949 నుండి 1976లో మరణించే వరకూ చైనా అధ్యక్షుడిగా కొనసాగిన విషయం తెలిసిందే. గత అధ్యక్షుడు హు జింటావో వారసుడిగా 2012లో చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన సీ జిన్‌పింగ్ మరుసటి ఏడాది చైనా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవితో పాటు ఆయన చైనా సర్వ సైన్యాధిపతిగా (సెంట్రల్ మిలటరీ కమిషన్ ఛైర్మన్)కూడా వ్యవహరిస్తారు. వాస్తవానికి చైనా అధ్యక్ష పదవి కన్నా ప్రధానకార్యదర్శి పదవే అత్యంత శక్తివంతమైనదయినప్పటికీ ప్రపంచ దేశాలతో వ్యవహరించేటపుడు అధ్యక్షుడిగానే ముందుకొస్తున్న విషయం తెలిసిందే. చైనా తొలి అధ్యక్షుడిగా వ్యవహరించిన మావో జెడాంగ్ 1954లో అధికారిక బాధ్యతలు చేపట్టిన ఐదేళ్లకు తన వారసుడిగా లియు షావ్‌కీని నియమించారు. అయితే తరువాత మావో ప్రతిపాదించిన సాంస్కృతిక విప్లవంలో ఆయన పదవి నుండి తప్పుకున్నారు. ఆ తరువాత మరోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన మావో 1975 వరకూ ఆ పదవిలో కొనసాగారు. తరువాత అధ్యక్షుడిగా వ్యవహరించిన డెంగ్ జియావో పింగ్ 1982లో అధ్యక్ష పదవీకాలంపై పరిమితులు విధిస్తూ చట్ట సవరణ చేశారు. ఐదేళ్లకోసారి జరిగే పార్టీ మహాసభల్లో అప్పటికి పదవిలో కొనసాగే అధ్యక్షులు తమ వారసుల పేర్లను ప్రకటించే వారు. గతంలో అధ్యక్షులుగా వ్యవహరించిన హుజింటావో, జియాంగ్ జెమిన్‌లు ఇదే విధంగా వ్యవహరించారు. అయితే గత అక్టోబర్‌లో జరిగిన పార్టీ మహాసభల్లో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ తన వారసుడి ప్రస్తావనే తీసుకురాలేదు. దానితో 2023 తరువాత కూడా ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతారన్న ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. అక్టోబర్ పార్టీ మహాసభల తరువాత గత నెలలో ఈ ప్రతిపాదన అధికారికంగా తెరపైకి రావటంతో ప్రపంచ వ్యాప్తంగా సంచలనం చెలరేగింది. ఈ ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. సీ జిన్‌పింగ్ 'ఈ శతాబ్దంలోనే అత్యంత శక్తివంతమైన నేత' అని ఆయన అభివర్ణించారు. సీ జిన్‌పింగ్ హయాంలోనే చైనా ప్రతిష్ఠాత్మకమైన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ ప్రాజెక్టును ప్రారంభించింది. దేశ, విదేశాలలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం వందల కోట్ల డాలర్ల పెట్టుబడులను వెచ్చించింది. సీ పాలనలోనే చైనా ఆసియాలో అత్యంత ప్రభావ వంతమైన దేశంగా మారింది.

వాణిజ్య యుద్ధాలతో ప్రపంచ సంక్షోభం

వాణిజ్య యుద్ధాల కారణంగా ప్రపంచం సంక్షోభంలోకి వెళ్తుందని చైనా వాణిజ్యశాఖా మంత్రి జోంగ్ షాన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్ దిగుమతులపై అమెరికా పన్నులు పెంచడం ప్రపంచ పురోగతికి నష్టం చేస్తుందని అన్నారు. అయితే తాము అమెరికాతో వాణిజ్య యుద్ధాలకు దిగబో మని స్పష్టం చేశారు.

అమెరికా సైనిక ఆస్పత్రిలో కాల్పులు

- నలుగురు మృతి



వాషింగ్టన్ : అమెరికాలో కాలిఫోర్నియా రాష్ట్రంలోని వెటరన్ హోం సైనిక ఆస్పత్రిలో కాల్పులు జరిగాయి. ఓ ఆగంతకుడు ఆస్పత్రిలోకి చొరబడి కాల్పులకు తెగబడ్డాడు. ముగ్గురు మహిళలను తుపాకీతో కాల్చి చంపి ఆ తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...ఆల్‌బర్ట్ వాంగ్ (36) అనే మాజీ సైనికుడు వెటరన్ హోం సైనిక ఆస్పత్రిలో చొరబడి బీభత్సం సృష్టించాడు. తొలుత కొంతమంది మహిళలను బంధీలుగా మల్చుకుని వదిలేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ప్రత్యేక బలగాలు ఆస్పత్రి భవనాన్ని చుట్టుముట్టాయి. వాంగ్‌కు, పోలీసులకు మధ్య 10నిమిషాల పాటు ఎదురుకాల్పులు జరిగినట్టు ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. అనంతరం పోలీసులు ఆస్పత్రిలోకి ప్రవేశించి వాంగ్‌ను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. వాంగ్ దాచుకున్న గదిలోకి ప్రవేశించగా నాలుగు మృతదేహాలు గుర్తించారు. వాంగ్ కాల్పుల్లో సైనిక ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిస్టిన్ లోబర్ (48), క్లినికల్ డైరెక్టర్ జెన్నిఫర్ గోలిక్, సైకాలజిస్ట్ గోంజేల్స్ (29) మృతిచెందినట్టు ధ్రువీకరించారు. ఆస్పత్రి సిబ్బందిపై కాల్పులకు పాల్పడ్డ అనంతరం వాంగ్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీస్ అధికారులు తెలిపారు.

సిరియా సైన్యం ఆధీనంలో మెస్రబా నగరం

డమాస్కస్ : తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న మెస్రబా నగరాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు సిరియా సైన్యం ప్రకటించింది. గౌటా నగరానికి తూర్పు భాగంలో ఉన్న ప్రాంతాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపింది. కాగా, సిరియాలోని గౌటా నగరంలో గతనెల 18 నుంచి రక్తపుటేరులు ప్రవహి స్తున్న సంగతి తెలిసిందే. తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న నగ రాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అస్సద్ సర్కార్ ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్నది. భద్రతా బలగాలకు, తిరుగుబాటుదారులకు మధ్య జరుగుతున్న భీకర పోరులో మృతిచెందిన వారి సంఖ్య ఆదివారం నాటికి 1,002కు చేరుకుందని సిరియాలోని హక్కుల పర్యవేక్షణ సంస్థ పేర్కొ న్నది. మృతుల్లో 215 మంది చిన్నారులు, 145 మహిళలున్నారని తెలి పింది.

సిరియాలో హక్కుల ఉల్లంఘన ఘటనలు చోటుచేసుకోవడాన్ని అనేక దేశాలు విమర్శిస్తున్నాయి. దీంతో, సిరియాలో చెలరేగిన అంతర్యుద్ధాన్ని తెరదించేందుకు కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రతా మండలి తీర్మానించింది. సిరియా పౌరులకు ఆహారం, మందులు, దుస్తు లు అందజేయాలని సహాయక బృందాలను కోరింది. అయితే, సహాయక చర్యలకు అంతరాయం కల్పించాలనే దురుద్దేశంతో తిరుగుబాటుదారులు భారీ పేలుళ్లకు పాల్పడుతున్నారు. అమాయక పౌరుల లక్ష్యంగా వైమానిక దాడులకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో తిరుగుబాటుదారుల ఆధీనంలో ఉన్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకొని పౌర మరణాల సంఖ్యను నిర్మూలించాలని అస్సద్ సర్కార్ నిర్ణయించుకుంది. సిరియా బలగాలు తాజాగా తిరిగి స్వాధీనం చేసుకున్న మెస్రబా నగరం రాజధాని డమాస్కస్ నుంచి 10కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

వ్యాన్ బోల్తా : 19 మందికి గాయాలు

బాకు : అజర్‌బైజాన్‌లో ఎవ్లాక్ జిల్లాలో విద్యార్థులతో తరలివెళ్తున్న స్కూల్ వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 19 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ముగ్గురు విద్యార్థుల పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా వ్యాన్ నడపడంతో ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

అమెరికన్లను వణికిస్తున్న వింత వ్యాధి

- సీడీసీపీ అధ్యయనంలో వెల్లడి
- వ్యాధిబారిన పడి ఏడుగురు దంతవైద్యులు మృతి



వాషింగ్టన్: అమెరికన్లను ఓ వింత వ్యాధి వణికిస్తున్నది. ఈ వ్యాధి ఇక్కడి దంత వైద్యులను ఎక్కువగా పీడిస్తోందని యూఎస్ సీడీసీపీ (సెంటర్స్ ఫర్ డిసీజెస్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్) తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ జబ్బు పేరు ఐపీఎఫ్ (ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్) అని సీడీసీపీ నిర్ధారించింది. ఈ వ్యాధి బారినపడినవారి ఊపిరితిత్తులు చెడిపోయి ప్రాణహాని జరుగుతుందని తెలిపింది. ఐపీఎఫ్ వ్యాధిపై 20 ఏండ్ల నుంచి అధ్యయనం చేసినట్టు తెలిపింది. వర్జీనియా రాష్ట్రంలో ఐపీఎఫ్ వ్యాధికి సంబంధించి తాజాగా 984 కేసులు నమోదయ్యాయని తెలిపింది. ఈ వ్యాధి బారినపడి ఏడుగురు దంతవైద్యులు గతవారం మృతిచెందారని తెలిపింది. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని సీడీసీపీ తెలిపింది. ఈ వ్యాధి సోకి మృతిచెందిన వైద్యులంతా వర్జీనియా రాష్ట్రంలోని ఓ డెంటల్ క్లీనిక్‌కు చెందినవారు కావడం గమనార్హం. దీంతో, సీడీసీపీ ఈ వ్యాధిపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. అమెరికాలోని ఇతర జనాభాతో పోలిస్తే 23 రెట్లు ఎక్కువగా దంత వైద్యులే ఈ వ్యాధి బారిన పడుతున్నారని సీడీసీపీ తెలిపింది. వైద్యులు పనిచేస్తున్న వాతావరణంలోనే ఉండే క్రిములే ఈ వ్యాధికి కారణమని పలువురు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వ్యాధి సోకినప్పుడు ఊపిరి తీసుకోవడంలో సమస్యలు, పొడి దగ్గు, బరువు తగ్గడం, కీళ్ల నొప్పులు వస్తాయి. డెంటల్ క్లీనిక్‌లో సిలికా, పాలివిన్సిల్ సైలోక్సేన్, ఆల్గినేట్ వంటి విష పూరిత క్రిములు ఉంటాయి. అక్కడ పనిచేసే వైద్యులు దంత వైద్యానికి సంబంధించిన పరికరాలను శుభ్రం చేస్తున్నప్పుడు ఈ విష పూరిత క్రిముల బారిన పడుతున్నారు. అమెరికాలో ఆరున్నర లక్షల మంది దంత వైద్యులు ఉన్నారు. ముదురుతున్న ఐపీఎఫ్ కేసుల నేపథ్యంలో డెంటల్ క్లీనిక్‌లో పనిచేసేవారందరూ మాస్కులు ధరించాలని సీడీసీపీ హెచ్చరించింది. అయితే పాతకాలం నాటి చికిత్సా విధానాలు అనుసరించడం వల్ల ఈ వ్యాధి సోకే అవకాశం ఉందని అమెరికన్ అకాడమి ఆఫ్ పీడియాట్రిక్ డెంట్రిస్ట్రీ చీఫ్ పాలసీ అడ్వయిజర్, సీనియర్ డాక్టర్ పాల్ కసామసీమో అభిప్రాయపడ్డారు.

మారిన ట్రంప్ నినాదం...!

- మేక్ అమెరికా గ్రేట్ అగైన్ బదులుగా 'కీప్ అమెరికా గ్రేట్'



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన నినాదాన్ని మార్చారు. అధ్యక్ష ఎన్నికల్లో మేక్ అమెరికా గ్రేట్ అగైన్ నినాదంతో ప్రజల్లోకి వెళ్లారు. ఈ నినాదమే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన గెలుపునకు ప్రధాన కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అప్పటి నుంచి ట్రంప్ ఏ కార్యక్రమంలో పాల్గొన్నా, సోషల్‌మీడియాలో ఏ పోస్ట్ పెట్టినా..ఈ నినాదాన్ని కనీసం ఒక్కసారైనా వాడతారు. అయితే, తాజాగా ట్రంప్ నినాదం మారింది. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్'కి బదులుగా 'కీప్ అమెరికా గ్రేట్' అని మార్చారు. ఈ సందర్భంగా అమెరికా కొత్త నినాదాన్ని ట్రంప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదాన్ని వాడాను. ఆ నినాదాన్ని నిజం చేసి చూపించాను. కాబట్టి మళ్లీ దానిని వాడాలనుకోవడం లేదు. మరో రెండేండ్ల పాటు 'కీప్ అమెరికా గ్రేట్' అనే నినాదం చేస్తాను.' అని చెప్తూ ఆ నినాదంలో ఉన్న ఆశ్చర్యార్థకాన్ని గాల్లో గీస్తూ చూపించారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయింది. ఇప్పుడు అధ్యక్షుడిగా రెండో విడత మొదలైంది. 2020లో ట్రంప్‌ని ఎన్నుకోవాలో వద్దో అనేది ఈ రెండేండ్ల పాలన పైనే ఆధారపడి ఉంది. పెన్సిల్వేనియాలో ఉప ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ క్యాబినెట్‌కు చెందిన రిక్ సాక్కోన్ అనే రిపబ్లికన్ పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రంప్ కొత్త నినాదాన్ని ఆవిష్కరించారు.

పాక్ మాజీ ప్రధానిపై బూటు విసిరిన యువకుడు



ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌పై లాహోర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఓ యువకుడు బూటు విసిరిన ఘటన కలకలం రేపింది. వేదికపై షరీఫ్ మాట్లాడుతుండగా అనూహ్యంగా ఓ షూ ఆయనపైకి దూసుకొచ్చింది. లాహోర్‌కు సమీపంలోని గర్హి షాహులో జామియనీమియా సెమినరీకి మాజీ ప్రధాని హాజరైన క్రమంలో సెమినరీ మాజీ స్టూడెంట్ షరీఫ్‌పైకి బూటు విసిరారు. ప్రేక్షకుల నుంచి విసిరన షూ నేరుగా షరీఫ్ ఛాతీకి తగిలింది. షూ విసిరిన యువకుడు వేదికపైకి వచ్చి షరీఫ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశాడు. దీంతో, కార్యక్రమ నిర్వాహకులు అతన్ని నిర్బంధించి పోలీసులకు అప్పగించారు.

విదేశాంగ మంత్రిపై సిరా దాడి : పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖవాజా ముహ్మద్ ఆసిఫ్‌కు తన సొంత పార్టీ (పీఎంఎల్-ఎన్) కార్యకర్తల సమావేశంలో చేదు అనుభవం ఎదురైంది. పంజాబ్ ప్రావిన్స్‌లోని సియాల్‌కోట్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆయనపై ఫయాజ్ రసూల్ అనే వ్యక్తి సిరా జల్లాడు. దీంతో ఆయన అవాక్కయ్యారు.

వెంటనే తేరుకున్న కార్యకర్తలు ఆ నిందితుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మహమ్మద్ ప్రవక్త గురించి పీఎంఎల్-ఎన్ పార్టీ నేతలు చేసిన వ్యాఖ్యలు తన మనోభావాలను దెబ్బతీశాయని, అందుకే మంత్రిపై సిరా జల్లినట్టు నిందితుడు అంగీకరించాడు. మంత్రి ఆసిఫ్‌ను ఆయన అంగరక్షకులు సురక్షిత ప్రాంతానికి తీసుకెళ్లారు.

అనంతరం ఆయన ముఖం శుభ్రపరచుకుని, మళ్లీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సంఘటన ప్రభావం తన రాజకీయాలపై ఉండదని ఆసిఫ్ స్పష్టం చేశారు. తనపై సిరా జల్లిన వ్యక్తి ఎవరో తనకు తెలియదని, అతను చేసిన తప్పును క్షమిస్తున్నట్టు ఆసిఫ్ తెలిపారు.

సర్కారు వైఫల్యాలను ఎండగడతాం

బీఎల్ఎఫ్ ప్రత్యామ్నాయ విధానాలను వినిపిస్తాం : సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సున్నం రాజయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని సీపీఐ(ఎం) శాసనసభ్యులు సున్నం రాజయ్య తెలిపారు. మూడున్నరేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరాయన్న దానిపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 93 శాతంగా ఉన్న శ్రామిక బహుజనులకు అవసరమైన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రత్యామ్నాయ విధానాలను అసెంబ్లీలో వినిపిస్తామని తెలిపారు. టీఆర్ఎస్ పాలనలో ప్రజాస్వామ్యం మంటగలిచిందని విమర్శించారు. ప్రజల ఉద్యమ గొంతుక వినిపించే ధర్నాచౌక్‌ను ఎత్తేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే నాయకులను గృహనిర్బంధం చేస్తున్నారని, అరెస్టు చేస్తున్నారని తెలిపారు. పార్టీ కార్యాలయాలను దిగ్బంధనం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు జరగకుండా అనుమతులు నిరాకరిస్తున్నారని తెలిపారు. అసెంబ్లీని కూడా పోలీసు ఇనుపకంచెల మధ్య బంధించి నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తకుండా అణచివేస్తున్నారని విమర్శించారు. సభ్యుల హక్కులను, సభా నిబంధనలను కాలరాస్తున్నారని తెలిపారు. ధర్నాచౌక్‌ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, శాసనసభ నియమనిబంధనల ప్రకారం సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతిపక్షాల సూచనలు, సలహాలు తీసుకునేలా సభను నడపాలని సూచించారు.

ఎకరాకు రూ.8 వేలు ఎన్నికల కార్యక్రమంగా ప్రచారం

రైతు ఆత్మహత్యలు, మద్దతు ధర, మార్కెట్ దోపిడీ, రుణమాఫీ, విత్తనం, కరువు ప్రత్యామ్నాయ చర్యలను విస్మరించి కౌలురైతులను లెక్కచేయకుండా ఎకరాకు రూ.8 వేలు ఇస్తామని ఎన్నికల కార్యక్రమంగా ప్రచారం చేస్తోందని సున్నం రాజయ్య తెలిపారు. వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ పథకం, మేట్ల తొలగింపు, వేతన బకాయిల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమలకు భూసేకరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం, ఎస్సీ వర్గీకరణ, సబ్‌ప్లాన్ నిధులు, సామాజిక దాడులు, అభద్రత, దళితులకు మూడెకరాల భూపంపిణీ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, కార్పొరేషన్ రుణాల సమస్యలు పరిష్కారం కాక దళితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీసీలను గొర్రెల పంపిణీకి పరిమితం చేసి కార్పొరేషన్లు, ఫెడరేషన్లను నిర్వీర్యం చేస్తోందని పేర్కొన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు కేటాయించిన రూ.వెయ్యి కోట్లలో ఒక్క పైసా ఖర్చు చేయలేదని తెలిపారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు, తండాలు పంచాయతీలు, గిరిజన విశ్వవిద్యాలయం, ఐటీడీఏల్లో సిబ్బంది నియామకం, పోడు భూములకు పట్టాలు, పాత పోడు సాగుదారుల పట్టాలు చెల్లవని, స్పెషల్ డీఎస్సీ, విద్యావైద్యం, మైదాన, ఏజెన్సీ ప్రాంతాలను విస్మరించడం వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యావైద్యరంగాల్లో కార్పొరేట్ దోపిడీ కొనసాగుతోందని విమర్శించారు. కేజీటు పీజీ హామీ అమలు జరగడం లేదని తెలిపారు. కార్పొరేట్ దోపిడీని నియంత్రించాలని, ప్రభుత్వరంగాన్ని పటిష్టం చేయాలని కోరారు.



(ఫైల్)

సీపీఎస్‌ను రద్దు చేయాలి

సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సున్నం రాజయ్య డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. పెండింగ్ వేతనాలు ఇచ్చి, ప్రతినెలా చెల్లించాలని తెలిపారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని కోరారు.

సమగ్ర యువజన విధానం ప్రకటించాలని, ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖాళీ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని కోరారు. మహిళా సంక్షేమం, భద్రత సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. వికలాంగులకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

బ్యాగ్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, వికలాంగులకు 3 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక చట్టం చేయాలని సూచించారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు, అన్యాక్రాంతమైన వక్ఫ్‌భూముల సేకరణ, జ్యుడీషియల్ అధికారాలు వంటి హామీలు అమలు కావడం లేదని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, బ్రోకరిజం విచ్చలవిడిగా సాగుతోందని విమర్శించారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వ అజమాయిషీ లేదని పేర్కొన్నారు.

టీడీపీ విధానాలే కొనసాగిస్తున్న టీఆర్ఎస్

తెలంగాణలో టీడీపీ డీఎన్ఏ అయిన టీఆర్ఎస్ పాత విధానాలనే కొనసాగిస్తోందని సున్నం రాజయ్య తెలిపారు. గత పాలకులకు, టీఆర్ఎస్ పాలకులకు తేడా లేదని పేర్కొన్నారు. మాటల గారడీ తప్ప కొత్తదనం లేదని తెలిపారు. జీఎస్టీ, నోట్ల రద్దు సందర్భంగా కేంద్రానికి మద్దతు పలికి రాష్ట్ర ఆదాయానికి గండికొట్టారని పేర్కొన్నారు. ప్రజాతంత్ర హక్కులను కాలరాసి రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించేందుకు టీఆర్ఎస్ సహకరించిందని విమర్శించారు.

2017-18 బడ్జెట్‌లో కేటాయించిన నిధులు పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా సామాజిక వర్గాలకు, శ్రామిక ప్రజలకు, రైతాంగానికి తీరని అన్యాయం చేసిందని తెలిపారు. ప్రాజెక్టుల వ్యయం మరింత పెరగడానికి కారణమైందని పేర్కొన్నారు. ఈ ఏడాది గొప్పల కోసం రూ.2 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించాలని చూస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌కు, అప్పులు దాదాపు సమానంగా పెరగడానికి కారణమౌతోందని పేర్కొన్నారు. దీంతో తలసరి ఆదాయం పెరగకపోగా, తలసరి భారానికి కారణమైందని తెలిపారు. టీఆర్ఎస్ పాలన రాష్ట్రంలో సామాజిక వర్గాలకు, శ్రామిక ప్రజల అభివృద్ధికి తోడ్పడలేదని పేర్కొన్నారు. ప్రజల సామాజిక, ఆర్థికాభివృద్ధికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో బీఎల్ఎఫ్ ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, బీఎల్ఎఫ్ ప్రత్యామ్నాయ విధానాలను సభలో వినిపిస్తామని పేర్కొన్నారు.

థర్డ్ ఫ్రంట్ అవసరం లేదు : జానారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ టౌన్

రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేస్తామని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. దేశానికి యూపీఏ, ఎన్డీఏ కూటములు తప్ప థర్డ్ ఫ్రంట్ అవసరం లేదన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ నుంచి గెలుపొందిన ఏడుగురు ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారని, పార్టీ ఫిరాయింపు కేసు ప్రస్తుతం సుప్రీంకోర్టులో నడుస్తున్నదని అన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీకి బలం లేకపోయినప్పటికీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటువైపు మొగ్గు చూపుతారో తెలుస్తుందన్నారు. ఒక పార్టీ నుంచి గెలిచాక ఆ పార్టీ విప్ జారీ చేస్తే చెప్పినట్టుగానే ఓటు వేయాలని, అది కూడా ఎన్నికల అధికారికి ఓటు చూపించి వేయాలని నిబంధన ఉందన్నారు.

అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలకు విప్ జారీ చేస్తున్నామన్నారు. ఒకవేళ ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌కు ఓటేస్తే దాని ఆధారంగా సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సులభంగా ఉంటుందన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల నిజ స్వరూపం బయటపడుతుందన్నారు. సాగర్ ఆయకట్టు రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఏప్రిల్ 15 వరకూ సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర సర్దుబాటు చేసైనా సాగర్ నీరు విడుదల చేయాలని కోరారు. ఈ విషయంపై అసెంబ్లీలో ప్రస్తావించి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు శంకర్‌నాయక్, ఎంఏ.కరీం, చిరుమర్రి కృష్ణయ్య, స్కైలాబ్‌నాయక్ పాల్గొన్నారు.

'జమిలిఎన్నికలపై మరింత చర్చ జరగాలి'

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారతదేశంలో జమిలి ఎన్నికల నిర్వహణపై మరింత లోతైన విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉన్నదని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జాగృతి, సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ సైన్సెస్ (సెస్) ఆడిటోరియంలో 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అంశంపై సదస్సు జరిగింది. జాగృతి పత్రిక సంపాదకులు వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు స్వపన్‌దాస్ గుప్తా, హోంశాఖ మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాజీ వైస్ చైర్మెన్ మర్రి శశిధర్‌రెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయపార్టీలు అధికారమే పరమావధిగా వ్యవహరించినన్నాళ్లు ప్రజలకు ఎలాంటి ప్రత్యేక ప్రయోజనాలు చేకూరవని అభిప్రాయపడ్డారు. అధికారం అంటే ఆదాయాన్ని పెంచుకొనే మార్గమనే దుర్లక్షణం నుంచి పార్టీలు, ప్రజాప్రతినిధులు బయటపడాల్సి ఉందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నికలు నినాదం వినడానికి బాగున్నా...ఆచరణలో అనేక ఇబ్బందులు ఉన్నాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణ పేరుతో నెలల తరబడి 'కోడ్ ఆఫ్ కండక్ట్'ను అమలు చేస్తున్నారని, దీనివల్ల పాలనా వ్యవస్థ స్తంభిస్తున్నదని తెలిపారు. ఎన్నికల వ్యయంపై పరిమితులు ఉన్నా...అవి ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా దాచేపల్లి పంచాయతీ ఎన్నికల్లో ఒకే అభ్యర్థి రూ.5 కోట్లకు పైగా ఖర్చు చేశారంటే ఎన్నికల వ్యయ పరిమితుల అమల్లో ఎన్నికల సంఘం ఎలా విఫలమౌతుందో స్పష్టమౌతుందని అన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నికలు అంశం ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చాకే మరింత చర్చనీయాంశమైందన్నారు. అమెరికాలో అధ్యక్ష తరహా పరిపాలన వల్ల ఏర్పడుతున్న ఇబ్బందుల్ని ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామని, అక్కడి ఎన్నికల విధానంపై కూడా చర్చ జరుగుతుందని తెలిపారు. స్థానిక సంస్థల అధికారాల్ని రాష్ట్ర ప్రభుత్వాలు గుప్పిట్లో పెట్టుకుంటున్నాయని, కనీసం వాటికి సకాలంలో ఎన్నికలు నిర్వహించకుండా పూర్తిగా రాజకీయ కోణంలోనే చూస్తుండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 2013 జులైలో కోర్టు తీర్పు మేరకు అప్పటికప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించారని, ఆ వెంటనే సాధారణ ఎన్నికలు కూడా జరిగాయని విశ్లేషించారు. ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ లోపాలు...వాటి సవరణలు, అమలుపై చర్చ పూర్తికాకుండా...జమిలి ఎన్నికలవైపు దృష్టి పెట్టడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ డైరెక్టర్ అనుగుల రాకేష్‌రెడ్డి కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

నవజాత శిశువు మృతి

- రెండు ఆస్పత్రులు తిరిగినా కానరాని వైద్యులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గర్భిణి ప్రసవం కోసం పీహెచ్‌సీకి వెళ్తే వైద్యులులేరు. ఆమెను మరో ఆస్పత్రికి తీసుకెళ్తుండగానే మార్గమధ్యలోనే పాపకు జన్మనిచ్చింది. తల్లీ,బిడ్డని తీసుకుని ఆ పీహెచ్‌సీకి వెళ్లగా అక్కడా డాక్టర్లు లేరు. దీంతో సకాలంలో వైద్యం అందక నవజాత శిశువు చనిపోయింది. ఈ విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఈ ఘటన సర్కారు ఆస్పత్రుల్లో డాక్టర్లను నియమించని సర్కారు వైఫల్యాన్ని ఓ వైపు ఎత్తిచూపుతుండగా... మరోవైపు ప్రభుత్వ డాక్టర్లలో కొందరు ప్రయివేటు ప్రాక్టీసు చేస్తున్న వైనాన్ని కండ్లకు కట్టినట్టు చూపుతున్నది. ఇంద్రవెల్లి మండలంలోని మారుతిగూడకు చెందిన గర్భిణి రూపవెట్టికి శనివారం రాత్రి పురిటినొప్పులు వచ్చాయి. దీంతో కుటుంబీకులు ఆమెకు పిట్టబొంగరం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. అక్కడ ఉన్న ఏఎన్ఎం సూచన మేర ఇంద్రవెల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్తుండగా ప్రసవవేదనతో రూపవెట్టి మార్గమధ్యలోనే ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే ఇంద్రవెల్లి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ కూడా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నవజాత శిశువు మృతి చెందింది. ఇంద్రవెల్లి పీహెచ్‌సీలో వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో ఏఎన్ఎంలే విధులు నిర్వర్తిస్తున్నారు. డాక్టర్లు ఉంటే తమ పాప బతికేదని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రూపవెట్టి కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఏజెన్సీ డిప్యూటీ డైరెక్టర్ వసంత్‌రావును వివరణ కోరగా డాక్టర్లకు ఫోన్ చేసి మాట్లాడతానని తెలిపారు. ఉట్నూర్‌లో ప్రయివేటు ప్రాక్టీస్ చేస్తున్న వైద్యుల విషయంపై సమాధానం దాటవేయడం గమనార్హం.

బీసీలకు రాజ్యసభ సీట్లు కేటాయించడం హర్షణీయం

- తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభకు బీసీ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరికి అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటన విడుదల చేశారు. టీఆర్ఎస్ పార్టీలో సామాన్య కార్యకర్తలుగా ఉన్న లింగయ్య యాదవ్, ప్రకాశ్ ముదిరాజ్‌లకు రాజ్యసభకు ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. బీసీ అభ్యర్థులపై ఇతర పార్టీలు పోటీకి నిలపకుండా ఏకగ్రీవంగా ఎన్నుకునేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యమాలు :ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉద్యోగ భర్తీల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు విద్యార్థి సంఘాలు, యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, నిరుద్యోగ సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివారం బీసీ భవన్‌లో నిరుద్యోగ జాక్, తెలంగాణ నిరుద్యోగ సంఘర్షణ సమితి, తెలంగాణ నిరుద్యోగ సంఘాలతో చర్చించారు. ఉద్యోగాల భర్తీపై ఇటు రాష్ట్రం.. అటు కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో గ్రూప్ 1 కింద 1200, గ్రూప్ 2 కింద 3వేలు, గ్రూప్ 3 కింద 8వేలు, గ్రూప్ 4 కింద 36వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయయని చెప్పారు. వీటికి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఇంజనీరింగ్, జూనియర్, డిగ్రీ, ఎయిడెడ్, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన 8600 ఉపాధ్యాయ పోస్టులతో పాటు ఆదర్శ పాఠశాలల్లో 8వేల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వరంగం నిర్వీర్యానికే బ్యాంకుల లూటీ

- నిధులను 'స్టాక్‌మార్కెట్ గద్ద'లకు పెట్టే కుట్ర: ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై అవగాహనా సదస్సులో ప్రొఫెసర్ నాగేశ్వర్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

నవతెలంగాణ-మంకమ్మతోట

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, బ్యాంకులను దెబ్బతీసి ఆ నిధులను స్టాక్‌మార్కెట్ కాకులకు, గద్దలకు పెట్టే కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ విమర్శించారు. కరీంనగర్‌లోని ఎల్ఐసీ యూనియన్ (సుగుణాకర్) భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండారి శేఖర్ అధ్యక్షతన ఎఫ్ఆర్‌డీఐ బిల్లుపై ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ..చరిత్రలో ప్రయివేటురంగ బ్యాంకులు దివాలా తీశాయని, పబ్లిక్ బ్యాంకులు ఏ ఒక్కటీ దెబ్బతిలేదని చెప్పారు. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని కేవలం భారతీయ బ్యాంకులు తట్టుకుని నిలబడ్డాయని వివరించారు. అమెరికా సహా పలు దేశాల ప్రభుత్వాలు ప్రయివేటు కార్పొరేట్ సంస్థలను కాపాడేందుకు బెయిల్‌అవుట్ విధానాన్ని అవలంబించాయన్నారు. దీంతో ఆర్థిక నేరాలు హద్దు మీరాయని, ఎఫ్ఆర్‌డీఐ బిల్లులో భాగంగా కేంద్రం ఏర్పాటు చేసే రిజల్యూషన్ కమిటీ ఆర్‌బీఐ పరిధిలోకి రాదని, దానికి సర్వాధికారాలు కట్టబెట్టనున్నారని తెలిపారు. నిరర్ధక ఆస్తులను ప్రభుత్వ రంగ బ్యాంకుల ఖాతాదారులు, డిపాజిటర్ల అనుమతి లేకుండా వాడుకునే అధికారాన్ని కల్పిస్తున్నారని చెప్పారు. దీనివల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో పెనుప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. దేశంలోని 70 శాతం పొదుపు మొత్తం ప్రభుత్వ రంగంలోనే ఉందని, దీనిపై కన్నేసిన నీరవ్‌మోడీ, విజయ్‌మాల్యా లాంటి బడా వ్యాపారవేత్తలు బ్యాంకులకు నేతల సహకారంతో ఎగనామం పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. 5 కోట్ల కంటే ఎక్కువ మొత్తం అప్పులు బడా కార్పొరేట్ సంస్థలు మాత్రమే తీసుకున్నాయని, సామాన్యులకు ముద్ర రుణాల కింద రూ.50వేలకు మించడం లేదన్నారు. సామాన్యుడికిచ్చే రుణమొత్తం మోడీ చెప్పినట్టు కేవలం పకోడీలకు మాత్రమే పనికొస్తుందని ఎద్దేవా చేశారు. నీరవ్‌మోదీ లాంటి వారు ప్రధాని వెంటే దావోస్‌లో, దుబాయ్‌లో కనిపించినా ప్రధాని తనకు ఆ విషయమే తెలియని బుకాయించడం దారుణమన్నారు. పారిశ్రామిక వేత్తలకు బ్యాంకులు స్థాపించే అధికారం ఏ దేశంలోనూ ఇవ్వలేదని, మొదటిసారిగా మోదీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ప్రభుత్వ బ్యాంకులను కాపాడడం దేశభక్తిపోరాటంలో భాగమేనన్నారు. ప్రజాచైతన్యంలో భాగంగా సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కోరారు. సదస్సులో ఎస్సీజెడ్ఐఈఎఫ్ ఇన్సూరెన్స్ జోనల్ అధ్యక్షులు కే.వేణుగోపాల్‌రావు, టీఎస్ఎంఆర్‌యూ అధ్యక్షులు పి.మురళి, ఐసీఈవో అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్, ఏ.రాంమోహన్‌రావు, యూఎఫ్‌బీఐ నాయకులు ప్రదీప్‌కుమార్, ఇన్సూరెన్స్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి రూ.18వేల కోట్లు కేటాయించాలి

తెలంగాణ రైతు సంఘం రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో రూ.18వేల కోట్లు కేటాయించాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.'వ్యవసాయ రంగం- బడ్జెట్' అనే అంశంపై ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి. జంగారెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ కింద రూ.17వేల కోట్లు చెల్లించినప్పటికీ ఇంకా రైతులు రూ.37వేల కోట్ల అప్పుల్లో ఉన్నారని చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ రంగానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.24,804 కోట్లు మాత్రమేనని, ఇందులో రుణమాఫీ కింద రూ.15,452 కోట్లు పోగా వాస్తవంగా వ్యవసాయానికి ఖర్చు చేసింది రూ. 9,352 కోట్లు మాత్రమేనని వివరించారు. ఇందులో విత్తన సబ్సిడీ, ఎరువులు సబ్సిడీ, పత్తి గింజలు, నూనెగింజలు, మొక్కజొన్నల పరిశోధన, ఉద్యోగుల వేతనాలకు మిళితమై ఉన్నాయన్నారు. పరిశోధనా సంస్థలు పని చేయకపోవడం వల్ల కొత్త వంగడాల ఊసేలేదన్నారు. అనుమతిలేని బిజి3 పత్తి విత్తనాలు విక్రయించడం వల్ల 18 లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని చెప్పారు. ఆహారధాన్యాల ఉత్పత్తి క్రమంగా తగ్గుతుందన్నారు.110 లక్షల టన్నుల ఆహారధాన్యాల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంటే 50 లక్షల టన్నులు కూడా రాలేదన్నారు. వ్యవసాయ శాఖకు ప్రత్యామ్నాయ ప్రణాళిక లేదు, శాశ్వత ప్రణాళిక లేదని విమర్శించారు. రైతు సమన్వయ సమితి చైర్మెన్ జిల్లాలకు హంగామాతో వెళ్లడం తప్పా రైతులకు ఒరిగేదేమీ ఉండబోదన్నారు. ఏఐకెఎమ్ఎస్ నేత చలపతిరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగం నుంచి వేల కోట్ల ఆదాయం వస్తున్నా ఈ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. 1.63 కోట్ల ఎకరాలకు గాను



మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

1.13కోట్ల ఎకరాలు మాత్రమే సాగవుతుందన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ రైతు సంకోభం నుంచి బయటపడే మార్గాలను ప్రభుత్వం అన్వేషించడం లేదన్నారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను అధిగమించగలిగితే రైతులకు కొంత ఉపశమనం కలుగుతుందని సూచించారు. మార్కెట్ ధరల స్థిరికరణ కోసం నిధి ఏర్పాటు చేయాలని కోరారు. బడ్జెట్ ప్రవేశపెట్టక ముందే కొన్ని సలహాలు, సూచనలతో కూడిన నివేదికను వ్యవసాయ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేస్తామన్నారు. సంఘం ఉపాధ్యక్షులు బొంతల చంద్రారెడ్డి మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు అరిబండి ప్రసాద్‌రావు, పండ్ల తోటల రైతు సంఘం నాయకులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణకు టెండర్లు పిలవాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

తునుకాకు సేకరణకు వెంటనే టెండర్లు పిలవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ప్రసాద్, ఆర్. వెంకట్రాములు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.48 కళ్లాల్లో తుని కాకు సేకరణపై నిషేదం విధిస్తూ తీసుకున్న నిర్ణయం ఆదివాసీ గిరిజనుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ముఖ్యంగా భద్రాచలం, ఇల్లెందు, భూపాలపల్లి, ఏటూరు నాగారం, ఉట్నూరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీ గిరిజ నులకు తునికాకు సేకరణే జీవనాధారమని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిషేదం ఎత్తివేయాలని, కట్ట ధరను ప్రభుత్వమే నిర్ణయించాలని కోరారు.

కోళ్ల ఫారాలపై బాదుడు!

- లెక్కలేస్తున్న మున్సిపల్ శాఖ
- పన్నులు పెంచేందుకు కసరత్తు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మున్సిపాల్టీలు, నగర పంచాయతీల పరిధిలో ఉన్న కోళ్ల ఫారాలపై మున్సిపల్ శాఖ దృష్టి సారించింది. ఎన్ని ఫారాలు ఉన్నాయి. వాటిలో ఎన్ని షెడ్లు ఉన్నాయి. ఎన్ని కోళ్లు పెంచుతున్నారు. షెడ్లను నిబంధనల ప్రకారం నిర్మించారా? ప్రస్తుతం ఎంత పన్ను చెల్లిస్తున్నారు? తదితర అంశాలను సేకరిస్తున్నది. అందుకు నమూనా సిద్ధం చేసుకుని మున్సిపల్ శాఖ అధికారులు లెక్కలేస్తున్నారు. కోళ్ల ఫారాల వివరాలు సేకరించిన తర్వాత పన్నులపై అంచనా వేసి పన్నులను నిర్ణయించాలని భావిస్తోంది. ఇప్పటికే వివిధ మార్గాల ద్వారా ఆదాయ వనరులు సేకరిస్తున్న మున్సిపల్ శాఖ తాజాగా కోళ్ల ఫారాలపై మీద దృష్టి సారించింది. కోళ్ల ఫారాలు, షెడ్లకు సంబంధించిన పన్నుల వసూళ్ళలలో అనుసరిస్తున్న పద్ధతులు ఏమిటని ఇప్పటికే బడంగ్‌పేట నగర పంచాయతీ కమిషనర్‌ను ఆదేశించినట్టు తెలిసింది. ఇదే విధానాన్ని మిగతా మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు అనుసరించాలని కోరింది. గతేడాది ఆర్థిక సంవత్సరంలో ఉన్న పన్నుల లక్ష్యం, వసూలు చేసిన మొత్తం, ప్రస్తుతం ఉన్న బకాయిల వివరాలను సేకరిస్తున్నది. కోళ్ల ఫారాలకు సంబంధించిన వివరాలు సేకరించిన తర్వాత ఆదాయం పెంచుకోవాలని భావిస్తోంది. ఇప్పటికే మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు పేదలపై పన్నుల భారం మోపాయి. కనీసం సౌకర్యాలు కల్పించకుండా ప్రజల నుంచి పన్నులు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న వనరులతోపాటు అదనంగా మరింత ఆదాయం పెంచుకునేందుకు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు కోళ్ల ఫారాలపై దృష్టి పెట్టినట్టు అధికార వర్గాలు చెప్పాయి. కోళ్ల ఫారాలకు సంబంధించి సమగ్ర సమాచారం సేకరించి వెంటనే నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. కోళ్ల ఫారాల అస్సెస్‌మెంట్, క్షేత్రస్థాయిలోని సమాచారానికి మధ్య ఉన్న వ్యత్యాసానాన్ని అంచనా వేసి తద్వారా పన్నులు వసూలు చేయనుంది. ఇప్పటి వరకు కోళ్ల ఫారాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో లేకపోకపోవడంతో వాటిపై మున్సిపల్ శాఖ పెద్దగా దృష్టి సారించలేదు. గతంలో కోళ్ల ఫారాల నుంచి వసూలైన మొత్తంతోపాటు, ఉన్న కోళ్ల ఫారాల సంఖ్యను అధికారులు బేరిజు వేయనున్నారు. వీటి ఆధారంగా భవిష్యతులో కోళ్లపారాల నుంచి ఎంత ఆదాయం రాబట్టవచ్చనే అంచనాకు వచ్చే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కోళ్ల ఫారాలు ప్రస్తుతం పశుసంవర్థక శాఖ పర్యవేక్షణలో ఉ ఉండి వాణిజ్యపరంగా కొనసాగుతున్నాయి. దీంతో వాటినిపై పన్నుల భారం అధికంగా ఉన్నది. అందువల్ల కోళ్ల ఫారాలకు వ్యవసాయ హోదా కావాలని వాటి యాజమాన్యాలు కోరుతున్నాయి. వ్యవసాయ హోదా వస్తే పవర్ సబ్సిడీతోపాటు పన్నుల భారం కూడా తగ్గుతుందని చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో మున్సిపల్ శాఖ కోళ్లఫారాల లెక్కలు తీయడం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి.



తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు. అనంతర కాలంలో వెల్లివిరిసిన రాడికల్ విద్యార్థి విప్లవోద్యమంలో ఎగిసిపడిన పోరు కెరటం. రైతుకూలీ సంఘాలతో జంగ్ నడిపిన ధీరుడు. ప్రజాహక్కుల ఉద్యమకారుడు. అసలైన పీడితుల పక్షాన పాలకులపై పోరు సల్పిన యోధుడు. ఇది నాణేనికి ఒక పార్శ్వం మాత్రమే. మరోవైపు పటార్లపై (ఆదిలాబాద్ అడవుల్లోని ఎత్తయిన కొండల గుట్టల మీద గోండులు నివాస ప్రాంతం) గోండులు పడుతున్న వెతలను చూసి చలించిన మానవతావాది. వారి ఆరాటాలను, పోరాటాలను, ఆశలను అక్షరీకరించిన సాహితీమూర్తి. గోండుల వెతలనే కథలుగా, గాయాలనే గేయాలుగా, వారి జీవితాల్లోని ఆటుపోటులనే పాటలుగా అశువుగా అల్లిన సృజనశీలుడు. ఆదివాసీ జీవన సౌందర్యాన్ని, వారి సంస్కృతిని, వారి తండ్లాటని వారి భాషలో, యాసలో తెలుగు సాహిత్యానికి పరిచయం చేసిన సాహిత్యకారుడు. మౌఖిక సాహిత్యంలో మరుగుపడి ఉన్న ఆదివాసీల ఆరాధ్యదైవం కుమ్రంభీం జీవితచరిత్రను అల్లం రాజయ్యతో కలిసి ప్రపంచానికి అందించిన పరిశోధకుడు. విలక్షణ బెంగాలీ రచయిత్రి మహాశ్వేతాదేవి సరసన నిలవగలిగిన భావుకుడు. ఆదర్శప్రాయుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయనే శనిగరం వెంకటేశ్వర్లు. అలియాస్ సాహు.

పోరు కెరటం.. పటార్లపై సాహితీ కిరణం

హుస్నాబాద్ తాలుకా భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్లో శనిగరం స్వామి, అయోధ్య దంపతులకు 1955 అక్టోబర్ 2న శనిగరం వెంకటేశ్వర్లు జన్మించారు. ఉన్నత విద్యను హుజూరాబాద్‌లో పూర్తిచేశాడు. డిగ్రీ విద్యనభ్యసించేందుకు జమ్మికుంట ఆదర్శ కళాశాలకు వెళ్లాడు. అక్కడ చదువుకుంటున్న రోజుల్లోనే ఉవ్వెత్తున ఎగిసిన 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలకు విడమరిచి చెప్పారు. వారిని చైతన్యవంతులను చేసేందుకు నిర్వహించిన అనేక సమావేశాలను, సభల్లో పాల్గొని ప్రసంగించారు. అనుకోని పరిణామాల అనంతరం తెలంగాణ ఉద్యమం నీరుగారిపోవడంతో తీవ్ర నిరాశకులోనైన సాహు వేలాది యువకుల్లాగానే విప్లవోద్యమ బాటపట్టారు. ఆ ఉద్యమంలోనూ గజ్జెల గంగారం, నల్లా ఆదిరెడ్డితో కలిసి కేంద్ర కమిటీ స్థాయి కమిటీ వరకు ఎదిగారు.

విప్లవోద్యమం విస్తరణలో భాగంగా సాహు ఆదిలాబాద్ ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలోనే అక్కడి గోండుల జీవన విధానాన్ని చాలా దగ్గరి నుంచి నిశితంగా అధ్యయనం చేశారు. గోండులలో ఒకడు అన్నంతగా మమేకమయ్యాడు. వారి భాషను నేర్చుకోవడమేగాక ఆ భాషకు లిపిని సైతం రూపొందించడం విశేషం. గోండులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయుధంతో పోరాడుతూనే అందులో వారిని భాగస్వాములను చేసేందుకు సాహు తన కలానికి పని చెప్పాడు. సాహితీ సృజనకు పూనుకున్నాడు. గోండుల జీవన సౌందర్యాన్ని, వారి జీవితాల్లోని వెతలను, వారి దీనత్వాన్నే ఇతివృత్తంగా చేసుకుని ఆర్తిగా అనేక కవితలు, కథలు రాశాడు. వారి ఆక్రందనలకు, వ్యథాభరిత గాథలకు అక్షరరూపమిచ్చాడు. ఆదివాసీల జీవనసౌందర్యాన్ని తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. అప్పటి వరకు ఆదివాసీలను పట్టించుకున్న వారుకానీ, వారి యాసలో, భాషలో వారి జీవితాలపై సాహిత్య రచన చేసిన తెలుగు సాహితీవేత్తలు లేరంటే అతిశయోక్తి కాదేమో.

ఒకానొక గోండు గూడెంలో కూర్చుని జొన్నరొట్టె తింటున్న సమయంలో తననే దీనంగా, తీక్షణంగా చూస్తున్న బాలికను గమనించిన సాహు ఆమెను దగ్గరకు పిలుచుకుంటాడు. ఒక రొట్టె ఇచ్చి పేరు అడగగా ఆ బాలిక 'సాహు' అని సమాధానమిస్తుంది. అనంతరం కాలంలో ఆ బాలిక పేరునే కలం పేరుగా మార్చుకుని తుదిశ్వాస వరకు వెంకటేశ్వర్లు తన రచన ప్రక్రియను కొనసాగించారు. అవన్నీ కూడా ఆదివాసీల ఇతివృత్తాంతంగా సాగడమే ఇక్కడ విశేషం. అందులో కన్నీటి కథ - నీటి కథ, పెళ్లికావాలి, కాయిదా(సంప్రదాయం) ఐదురూపాయాల కథ, భూమికొరకు, జెండాకథ, ఆకలి, నిర్ణయం, కిసింగార్ వెంతా(అడవంటుకుంది), అమరుల రక్తం వృథాకాదు, నాడె, రక్తపింజెర, మరట్ తుడుం పాయానా (మనం తుడుంగొట్టాలె), మనుషుల్ని తినేవాళ్లకోసం, ఒక తల్లి, పిల్లరక్కసులు, ఓ సత్యం, హరిచే జనించిన వారని చెప్పబడిన గాంధీగారి బిడ్డలు, అమరవీరులు, ఊరేగింపు, రగల్జెండా వంటివున్నాయి. ఈ కథల్లో ఆదివాసీలపై నాటి చౌకిదారులు, ఇతర జంగ్లాత్ అధికారులు చేసిన దౌర్జన్యాలు, షావుకార్ల మోసాలను సాహు సమాజం కళ్లకు కట్టాడు.

అందులో 'ఐదు రూపాయాల కథ' ప్రముఖ రచయిత ప్రేమ్‌చంద్ రాసిన 'సవాశేర్ గోధుమలు' కథతో సరిసమానమైనదని ఎందరో తెలుగు రచయితలు కితాబివ్వడం విశేషం. కొన్ని కథలు 'అడవిలో వెన్నెల' కథా సంకలనంలో ప్రచురితమయ్యాయి.

విహంగ వీక్షణం, ఇక్కడే, ఉదయమేది, వ్యాఘ్రాలు, ఎవరుకారకులు, విన్నపం, జాగీరిగాళ్లు, విప్లవాల పాట, రన్నింగ్ కామెంటూరీస్, రాజకీయాల్లో తిట్లు, ఫిలిం సెన్సార్ బోర్డు, పోస్టర్ చట్టం వాళ్ళు, వీళ్లు, ఉత్తరాలు పంచబడవు, కోపమా, జ్ఞానీ జానిష్టములో, కొంపలు కూల్చే పథకం, సందేశం కాదు సత్యం కూడా, అక్షర లక్ష్యాలు, సూర్యుని ఆకాంక్ష, కాలం చెల్లిన గీతం, జాగ్రత్త, దీక్ష, ఇది సత్యం, నరకం స్వర్గం, ఓనా చెల్లి, ఓ స్త్రీ, జ్వలిత జ్వాల, నూతనాధ్యయనం కోసం వంటి అనేకమున్నాయి. ఇందులో 'ఎవరుకారకులు' అనే కవితలో నాటి భోపాల్ గ్యాస్ ఉదంతాన్ని వర్ణించిన తీరు గుండెలను పిండేస్తుంది. పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన తీరు అమోఘం.

"నాదేశపు దేహంపై
భోపాల్ ఒక మృత్యుమడుగు
ఎన్ని అందమైన జీవితాలు
బహుళజాతి కళింగుని వాతపడ్డాయో"

"సాహు అశువుగా అల్లిన పాటలు నేటికీ ప్రజానాల్కలపై దొర్లుతుండడం విశేషం. పొదల పొదల గట్ల నడుమ పొడిచెనొక్క సందమామ, శ్రామికధ్వజం, ప్రతిమలు, వెంకటరమణ వీరు దండాలు, లోకానికి రారాజు, గోగుల తండా వీరుడు, ఎర్రగోగులెవ్వరో, ఖుర్బానీ, సందేశం, కరువుపాట వంటివి ఎంతో ప్రజాదరణ పొందాయి. అన్నింటికీ మించి బాలకార్మికుల వ్యథాభరిత గాథను ఇతివృత్తంగా చేసుకుని అల్లిన
"నీ కన్నీరు నా కన్నీరు కలిగినోడికి పన్నీరాయె
ఒంటిగా శోకం బెట్టే చిన్ని తమ్మయ్యా
నీ జంటగా నేనుంటరారా చిన్ని తమ్మయ్యా
నీళ్ల పంపే తల్లయి సాకేనా చిన్ని తమ్మయ్యా" అనే పాట సాహుకు ఎనలేని కీర్తిని తెచ్చి పెట్టింది."

అని సాహు ఆవేదన చెందుతాడు. ఎవరు కారకులని ప్రశ్నిస్తాడు. బహుళజాతి సంస్థలను, వాళ్ల అడుగులకు మడుగులొత్తుతున్న నేతలను దునుమాడుతాడు. 'ఇక్కడే' కవితలో "ఇక్కడే ఆకలి ఉంది/శోకం ఉంది/ శిథిలమైన లోకం ఉంది/వెలుగును మింగే చీకటి ఉంది" అని ఆదివాసీల జీవితాలను వర్ణిస్తాడు. అంతలోనే "చేయి చేయి కలుపుదాం/ ఆకలి అంతుచూద్దాం" అంటూ వారికి దిశానిర్దేశం చేస్తారు. విన్నపం కవితలో ఆదివాసీ స్త్రీలపై ఉన్న పురుషాధిక్యాన్ని నిలదీస్తారు. ఇలా గోండులకు సంబంధించిన అనేక అంశాలపై సాహు కవితలు రాశారు.

సాహు అశువుగా అల్లిన పాటలు నేటికీ ప్రజానాల్కలపై దొర్లుతుండడం విశేషం. పొదల పొదల గట్ల నడుమ పొడిచెనొక్క సందమామ, శ్రామికధ్వజం, ప్రతిమలు, వెంకటరమణ వీరు దండాలు, లోకానికి రారాజు, గోగుల తండా వీరుడు, ఎర్రగోగులెవ్వరో, ఖుర్బానీ, సందేశం, కరువుపాట వంటివి ఎంతో ప్రజాదరణ పొందాయి. అన్నింటికీ మించి బాలకార్మికుల వ్యథాభరిత గాథను ఇతివృత్తంగా చేసుకుని అల్లిన

"నీ కన్నీరు నా కన్నీరు కలిగినోడికి పన్నీరాయె
ఒంటిగా శోకం బెట్టే చిన్ని తమ్మయ్యా
నీ జంటగా నేనుంటరారా చిన్నితమ్మయ్యా
నీళ్ల పంపే తల్లయి సాకేనా చిన్నితమ్మయ్యా" అనే పాట సాహుకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టింది. ఆ పాట ఆ నాటి కాలంలో చిన్నా పెద్ద నాల్కలపై ఉందంటే ఎంతగా ప్రభావితం చేసిందో అర్థం చేసుకోవచ్చు.

ఆదివాసీల మౌఖిక సాహిత్యంలో నిక్షిప్తమై ఉన్న కుమ్రంభీం జీవిత చరిత్రను సహ రచయిత అల్లం రాజయ్యతో కలిసి సాహు వెలికితీశారు. వారిద్దరూ కలిసి నిజాం కాలంనాటి దస్తావేజులను శోధించారు. భీం సమకాలీనులను, నాటి పోరాట యోధులను ఎంతో శ్రమకోర్చి వెతికి పట్టుకుని వివరాలను సేకరించారు. గోండుల మౌఖిక సాహిత్యాన్ని అధ్యయనం చేసి అన్ని అంశాలను బేరీజు వేసుకుని ఒక రూపానికి తీసుకొచ్చి నవలను రాసి ప్రపంచానికి అందించడంలో కీలక భూమికను పోషించారు. ఇది తెలుగు నాట వెలువడిన మొట్టమొదటి చారిత్రక నవలని పలువురు లబ్ధప్రతిష్టులైన సాహితీవేత్తలు కీర్తించడం విశేషం. అదీగాక 1983లో ఇంద్రవెల్లి స్తూపంతో పాటే అదే వేదికమీద నుంచే కుమ్రంభీం నవల ఆవిష్కృతమవడం మరో విశేషం. ఈ మాత్రం సాహిత్యమైనా వెలుగులోకి వచ్చిందంటే సాహు మిత్రుల కృషియే కారణం. ఇంకా వెలుగుచూడని, సాహు డైరీకే పరిమితమైన ఒగ్గుకథ, కవితలు ఇతర రచనలు అనేకమున్నాయి.

విప్లవోద్యమం చీలిన సందర్భంలో మహారాష్ట్రలో పోలీసులు సాహును అరెస్టు చేశారు. ఆయన విడుదలకు ఆ సమయంలో ఏ ఒక్క పార్టీ ముందుకురాకపోవడం ఆయనను తీవ్రంగా కలిచివేసింది. దీంతో జైలు నుంచి విడుదలై వచ్చిన అనంతరం తిరిగి పార్టీలోకి వెళ్లకుండా ఆయన ఇంటికే పరిమితమయ్యారు. అనంతర కాలంలో బీఎస్ రాములు ఆధ్వర్యంలో నాడు ఏర్పడిన దళిత రచయిత కళాకారుల మేధావులు ఐక్య వేదిక (దరకమే)లో ఆయన చేరి జిల్లా కన్వీనర్‌గా, రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగారు. ఈ క్రమంలో తిరిగి తన సాహిత్యానికి పదును పెట్టాలనుకున్నాడు. మన్యం అడవుల్లో కిడ్నాపయిన బాలరాజును ఇతివృత్తంగా చేసుకుని నవల రాయాలని తలిచాడు. అంతలోనే మార్చి 16, 1993లో అకాల మరణం పొందడం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటు.

పశ్చిమబెంగాల్‌కు చెందిన విలక్షణ రచయిత్రి మహాశ్వేతాదేవి కోవలోనే సాహు సైతం ఆదివాసీల జీవితాలను ఆధారంగా చేసుకునే తన రచనలను కొనసాగించారు. గిరిజన పోరాట యోధుడు బిర్సాముండా చరిత్రను ఆమె వెలికి తీసినట్లుగానే కుమ్రంభీం చరిత్రను మౌఖిక సాహిత్యం నుంచి సాహు వెలికితీయడం గమనార్హం. తెలుగు సాహిత్య రంగానికి ఇంతటి విశేష కృషి చేసినా ఆయనకు తగిన గుర్తింపు లభించకపోవడం శోచనీయం. ప్రపంచ తెలుగు మహాసభల్లో మాటమాత్రంగానైనా ఆయన పేరును ఉల్లేఖించకపోవడం విచారకరం. ప్రభుత్వాలు నాటి నుంచి నేటి వరకూ సాహుపై విప్లవకారుడనే ముద్రవేసి వివక్ష చూపుతూ సాహిత్య రంగానికి ఆయన చేసిన సేవలను విస్మరిస్తున్నాయి. వెలుగుచూడకుండా కావాలనే తొక్కిపెడుతున్నాయి. ఇప్పటికీ ఆయన స్వగ్రామమైన మాణిక్యాపూర్లో ఆవిష్కృతమవకుండా మూలపడి, దుమ్ము కొట్టుకుపోతున్న సాహు విగ్రహమే అందుకు నిదర్శనం. ఇకనైనా ప్రభుత్వం ఈ వివక్షను వీడాలి. అముద్రితాలుగా ఉన్న సాహు సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చి ప్రచురించాలి. సముచిత స్థానం కల్పించాలి. విగ్రహాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. దర్జీ వృత్తితోనే కాలం వెళ్లదీస్తున్న ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలి. అదే సాహుకు ఇచ్చే నివాళి.

(ఈ నెల 16న సాహు వర్ధంతిని పురస్కరించుకుని..)

- ఆర్కే ప్రావ్ద, 79815 74841

దుఃఖ వాస్తవికత

దోసిటిలోని గింజలు
గాలికెగిరిపోయినట్టొక కల.
నడుస్తూ వెళుతున్న పుస్తకం
మధ్యలో ఆగి ఖాళీగా మిగిలిపోయినట్టు
ఒకానొక గగుర్పాటు.
నగరపు జీవితాన్ని గీస్తుంటే వెన్నులో ఏదో వణుకు.

మొక్కలకు నీళ్ళులేవు
కాపాడటమెందుకు నాటడమే ముఖ్యం
నువ్వునిండు గర్భిణివే
నీ మరణం నా సంతాపానికి నోచుకోదు
2
ఆలయాలు నిల్చుంటాయి
ఆగమశాస్త్రాల గంటలుమోగుతాయి.
అయువుపట్టుమాత్రం
జీవితాలనుంచి గంటలు నిముషాలు
క్షణాల్లోకి తర్జుమా అవుతాయి.

నెత్తిపై నిఘంటువుల్ని మోసిన నదులు
నిట్టనిలువునా ఒక మృత సుషుప్తిలో.
కనురెప్పల బరువుమోసే దుఃఖ వాస్తవికత జీవితం.
ఇప్పుడు బొమ్మలు వేయకు
గాలికూడా ఏవగించుకునే మహాశూన్యం
దిక్కుల్ని కప్పేస్తున్న ప్లాస్టిక్ వెలుగు
సువాసన మాత్రం కుర్చీలది
3
అన్నానికి నోటికి మధ్య ఉండే మీమాంస
బహుశః ఆకలికి సంబంధించింది కాదు
పండుగలు మాత్రమే దేశమైనప్పుడు
పరవశం మాత్రమే దేహమైనప్పుడు
కాలం ఒక అశీరః దుఃఖం


ఉబుకుతున్న కన్నీటిచుక్కకొక సంజాయిషీ కావాలి
తాకట్టుపడ్డ మానాలప్రశ్నలకొక జవాబు కావాలి
నేను ధర్మవిజితనా? అధర్మ విజితనా?

- ఎం.నారాయణశర్మ, 9848348502

వాడంతే...!

వాడంతే.....
అబద్ధాల గూటిలో పురుడు పోసుకున్న వాడు
విద్వేష ఉగ్గుపాలతో ఎదిగిన వాడు
మోసపు మాయమాటలతో అడుగులేస్తూ లేచినవాడు
నిజాయితీ కనపడగానే నిలువెల్లా విషమైపోతాడు

వాడంతే......
కుళ్ళిన కుళ్ళంతా కనపడకుండా
కాషాయాన్ని ముసుగేసుకున్నవాడు
అనాగరిక బానిస యుగానికి నిత్య ప్రేమికుడు
నియంతృత్వ ఉన్మాదానికి తోడబుట్టినోడు
ప్రజాస్వామ్యమంటే రక్తం కక్కుకుంటాడు




వాడంతే.......
యోగినంటాడు
భోగాలన్నీ అనుభవిస్తాడు
మనిషితనంపై శూలాన్నిదింపి
పశువులపై మమకారాన్ని పులుముకుంటాడు

వాడంతే......
వికృత భావాలపై వికసించినవాడు
నేరాల ఘోరాల చరితకు వారసుడు
స్వేచ్ఛపై తూటాలు పేల్చి స్వచ్ఛ పాఠాలు వల్లిస్తుంటాడు
సత్యం ఎదురైందంటే పాములా కోరలు చాస్తాడు

వాడంతే.....
విగ్రహం పడగొట్టి విజయమనుకుంటాడు
ఉదయకిరణం అరుణమని తెలిసి
ఉరివేసేందుకు వెర్రిగా లేస్తాడు
కానీ వాడికి తెలియదు...
పడగొట్టిన ప్రతిమలు చైతన్య ప్రతిచర్యలౌతాయని

- ఆనందాచారి, 9948787660

కోయల వీరగాథా చక్రం



కోయ ఆదివాసీ సంస్కృతిపై జరిగిన కొన్ని పరిశోధనలు కోయ గీతాలు, సాహిత్యానికే పరిమితమైనాయి. అంతేగాని కోయల వీర గాథాచక్రంపై అధ్యయనం జరగలేదు. ఎందుకంటే ఈ వీరగాథలు వున్నాయని లోకానికి పెద్దగా తెలియదు.

కోయల చరిత్రని, వివరాలను గోత్రాలు, గాథల కథాగానం, లోతైన సమాచారం కోయలు తమకు తాము ఇవ్వలేదు. వారి ఉపకులం వారైన డోలీలు, పట్టెడలు మాత్రమే వివరాలు చెప్పగలరు. ఇప్పుడు పట్టెడవారు పూర్తిగా కనుమరుగయ్యారు. వయసు పై బడినవారు మరణించగా డోలీ యువకులు ఈ సమాచారం చెప్పలేకపోతున్నారు. డోలీలు కూడా చాలా వరకు అంతరించిపోయారు. వరంగల్ కేంద్రంగా గత దశాబ్దంగా చేసిన డోలీల అన్వేషణ, పరిశోధనా ఫలితంగా - తెలుగులో, కోయ భాషలో కథాగానం చేయగల ఏకైక పండితుడు రామచంద్రం గారిని - మణుగూరు పక్కన వున్న కూనవరం వూర్లో పట్టుకోగలిగారు.

డోలీలు కోయదొరల అధికారిక చరిత్ర కారులు. వీరు ప్రతి గోత్రం వివరాలు, ప్రతి జాతి నాయకుడి పోరాటం, మలుపు తిప్పిన మహానుభావుల చరిత్రను రికార్డు కెక్కించారు. ఈ డోలీలు 'పగిడె' అనే డాలు గుడ్డ మీద గోత్రాల చరిత్ర, సంఘటన వివరాలు, వీరుల జనన మరణాలు, సంఘర్షణలను చిత్రించారు. వీటిని చాలా జాగ్రత్తగా వీరుల, నరుల కంట పడకుండా ఒక కోయదొర ఇంటిలో అతి జాగ్రత్తగా దాస్తారు. ఆ 'పగిడె'నిబయటకు తీయడానికి జరిగే తంతు కూడా పెద్దదే. ఆ సందర్భంలో చిన్నపాటి బలి ఇస్తారు. కోయదేవతలని సంతృప్తి పరుస్తారు. అనేక రకాల పూజలు నిర్వహిస్తారు. ఆ ఇంటి నుండి కథ చెప్పే ప్రదేశానికి ఆ పగిడెని గొప్ప ప్రదర్శనతో, ఆటపాటలతో ఊరేగింపుగా తీసుకుపోతారు. ఇదంతా డోలీలే చేస్తారు. ఈ తంతు, క్రతువు వేరేవారు నిర్వహించలేరు. ఆ సమయం నుండి డోలీల జ్ఞాపకాలలోకి కోయవీరులు, కోయ శక్తులు ఆవహించడం ఆరంభమవుతుంది. ఆ తరువాత వివిధ దశలలో తంతు ముగిశాక కథా ప్రదర్శన మొదలవుతుంది. వీరు ఆనాటి అనేక వీరగాథలను ఈనాటికీ పాడుతున్నారు. అలా డోలీవారు చెప్పే సమ్మక్క సారలమ్మ వీరగాథను సేకరించడమే కాకుండా, దానిని విపులమైన ముందుమాటతో అందజేయడం బాగుంది. 'సమ్మక్క ఎలా, ఎక్కడ పుట్టింది. అది పర్వంలోకి ఎలా వచ్చింది" అని ప్రశ్న వేసుకుని దానికి జవాబు చెబుతూ కథని వివరించడం ఈ కథన శైలి. ఆ కథా పాఠ్యాన్ని పాడుతూ ప్రదర్శించడం, శ్రోతల తరపున ప్రశ్న, అనుమానం లేవనెత్తించి, దానికి వివరణ ఇస్తూ కథ చెప్పే నెరేషన్ పద్ధతి ఈ ప్రదర్శనలో, వినూత్న విధానంలో సాగుతూ వుంటుంది. ఈ వీరగాథకు తోడుగా ఇచ్చిన వివిధ ముందుమాటలు - అనుబంధాలు సమాచారాత్మకంగా, విజ్ఞాన దాయకంగా వున్నాయి.

వీరుల పోరు గద్దె 'మేడారం' (సమ్మక్క, సారలమ్మలపై కోయ డోలీల గాథ),
సంపాదకులు :జయధీర్ తిరుమలరావు, పేజీలు:136, వెల:80/-,
ప్రతులకు:ప్రముఖ పుస్తక కేంద్రాలు

- కె.పి.

నాగరాజు రామస్వామి గ్రంథాల ఆవిష్కరణ

నాగరాజు రామస్వామి రచనలైన 'సూర్యశిల, ఎద పదనిసలు, అనుస్వనం' గ్రంథాల ఆవిష్కరణ ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. డా॥తిరునగరి, కె.శివారెడ్డి, మామిడి హరికృష్ణ, డా॥ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా॥అమ్మంగి వేణుగోపాల్, డా॥పి.లక్ష్మీనారాయణ, డా॥తిరునగరి దేవకిదేవి పాల్గొంటారు.

17 న 'అగ్నిశిఖ' ఆవిష్కరణ సభ

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కటుకోర్షుల రమేష్ కవితా సంపుటి 'అగ్నిశిఖ' ఆవిష్కరణ సభ ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు ఇల్లందులో జరుగుతుంది. ఇందులో కె.శివారెడ్డి, ప్రొ.జయధీర్ తిరుమలరావు, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, ఆనందాచారి, మువ్వా శ్రీనివాసరావు, యాకుబ్, జ్వలిత, డా॥వి.వీరాచారి పాల్గొంటారు


- కటుకోర్షుల రమేష్(తెలంగాణ సాహితి)

'జ్ఞాపకాల్లో ఇంద్రవెల్లి' కవితా సంపుటి కోసం

ఆదిలాబాద్‌లోని ఇంద్రవెల్లి సంఘటన జరిగి 37 ఏళ్ళు కావస్తున్నది. ఈ సందర్భంగా "జ్ఞాపకాల్లో ఇంద్రవెల్లి" కవితా సంపుటి తీసుకువస్తున్నారు. ఇంద్రవెల్లి స్మారక స్థూపం వద్ద విడుదల అయ్యే ఈ సంపుటానికి కదిలించే కవితలు, జ్ఞాపకాల పంక్తులు, బలమైన అనుభవ వాక్యాలు రాసి ఇరవై రోజుల్లోగా పంపాలి. చిరునామా : జయధీర్, ప్లాట్ నెం.81, తిరుమల హిల్స్, నియర్ గోల్డెన్ టెంపుల్, పుప్పాలగూడ, మణికొండ, హైదరాబాద్ - 500089. email - gyapakalloindravelli@gmail.com

- కన్వీనర్ : ఎస్. సుధాకర్, 9246216234

కథా'విహారం'



విమర్శా వ్యాసాలు, సమీక్షలు, ముందుమాటలతో కథా విమర్శ విస్తృతమవుతూ వస్తున్నది. కథా విమర్శ పట్ల ఆసక్తి వుండి విమర్శా వ్యాసాలు రాసి, అవి వేసుకునే పత్రికల కోసం వెతికి వేసారి విరమించుకున్నవారు ఎందరో వున్నారు. అలా కాకుండా కథా విమర్శకు సంబంధించి ఎవరైనా పత్రికల వాళ్ళు ఒక రెగ్యులర్ కాలమ్ ఏర్పాటు చేస్తే, ఎన్నో మంచి విషయాలు వెలుగులోకి వస్తాయి. అలా రెగ్యులర్ కాలం దొరికించుకున్నవారిలో విహారి, కోడూరి శ్రీరామమూర్తి, వేదగిరి రాంబాబు, విరించి లాంటి వారు వున్నారు. వీరు తమకు దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారనే చెప్పాలి.

రెగ్యులర్‌గా మాసపత్రికలలో రాయడానికి కొంత సమయం దొరుకుతుంది. అదే వారపత్రికలోనయితే వెంటవెంటనే రాస్తూ పోవాలి. అలాంటప్పుడు ఒక కథకుడి గురించి కానీ, అతని అన్ని కథల గురించి కాని పూర్తి సమాచారం ఇవ్వడానికి వీలుపడదు. విమర్శనాత్మకంగా రాస్తే రచయితలు భరించే స్థితి లేదు. పత్రికల వాళ్ళు అందర్నీ కలుపుకుపోయే ధోరణుల్లో వుంటారు కాబట్టి 'నొప్పింపక తానొవ్వక' పద్ధతిలో రాసుకుంటూ పోవాలి. అలాంటప్పుడు చాలామంది కాలమిస్టులు తాము మెచ్చిన, తనకు నచ్చిన కథలు - కథకుల గురించి రాసుకుంటూ పోతారు. దానికి భిన్నంగా విహారి గారు తెలుగులో వున్న కథారచయితలందర్నీ వరుసగా పరిచయం చేస్తూ వ్యాసాలు రాసుకుంటూ పోవడం వారి ప్రత్యేకతగా భావించాలి. గురజాడ మొదలుకుని అరిపిరాల సత్యప్రసాద్ వరకు అన్ని తరాల కథకులను, వారి కథలను పరిచయం చేయడం గమనించవచ్చు. కుల, మత, ప్రాంత, లింగ భేదాలు లేకుండా అన్ని వాదాలు, అన్ని ధోరణులకు సంబంధించిన వారిని, వారి గొప్పదనాన్ని వారి కథల ద్వారా విశ్లేషించడం అభినందించదగ్గ విషయం. ఒక కథకుడు రాసిన రెండు కథలను తీసుకుని వాటిని విశ్లేషించడం ఎక్కువ వ్యాసాలలో కనిపిస్తుంది. అన్నం ఉడికిందని తెలుసుకోవడానికి రెండు మెతుకులు చాలు కదా! కొన్ని సార్లు తమకు నచ్చిన ఒకే కథను తీసుకుని దాన్ని పూర్తిగా విశ్లేషించి, దాని గొప్పదనాన్ని తెలియజేస్తారు. ఒక కథకుడి పూర్తి పరిచయాన్ని అనగా అతని పూర్తి కథలను తీసుకుని వివరించడం అతి కొద్ది వ్యాసాలలో కనిపిస్తుంది. ఇవి విమర్శా వ్యాసాలు కావు. కేవలం 'పరిచయాలు - ప్రస్తావనలు' మాత్రమే అని విహారి గారు వినయంగా చెప్పుకోవడాన్ని మనం గమనించాలి. ఈ వ్యాసాలలో రచయిత పరిచయం, రచయిత ఉద్దేశాలు - అవి వారి కథల్లో ప్రతిఫలించిన తీరును వివరిస్తారు. రాసిన అంశాల గురించిన ప్రస్తావనే వుంటుంది తప్ప రాయనివాటిని అన్వేషించి ప్రశ్నించడం వుండదు. ఎక్కడా రచయితను నొప్పించే ప్రసక్తి వుండదు. ఎంతసేపూ రచయితలో, ఆయన రచనలో వున్న మంచిని చూడటానికే ఇష్టపడతారు. సహృదయుడు, మృదు స్వభావియైన విహారి రచనలు కూడా ఆయనలాగే సహృదయతను సంతరించుకోవడంలో ఆశ్చర్యమేమున్నది? వస్తుపరంగా, శిల్పపరంగా, భాషాపరంగా ఆయా రచయితల ప్రత్యేకతను మనకు వివరిస్తారు. ప్రఖ్యాత కథకుల నుండి ఔత్సాహికుల వరకు అందర్నీ సమభావంతో ఆదరిస్తారు. యాచకో యాచక శత్రు: అన్నట్లుగా ఒక రచయిత ఇంకో రచయిత ఉనికిని భరించలేని పరిస్థితులను మనం చూస్తున్నాం. అలాంటిది విహారి ఒక కథారచయిత అయివుండి మిగతా కథకుల గొప్పదనాన్ని వివరించడానికి పూనుకోవడం ఒక ఆశ్చర్యం, ఒక అద్భుతం. ఈ అద్భుతాన్ని ఆయన సాధించగలిగారు. వారు 250 మంది కథకులను పరిచయం చేసిన వ్యాసాలు 'కథాకృతి' పేరిట మూడు భాగాలుగా వచ్చాయి. ఈ సంకలనాలు సామాన్య పాఠకుడికి తెలుగు కథా రచయితల గురించి పరిచయం చేస్తూ, వారిని కథాపఠనం వైపుకు మళ్ళిస్తాయి. పరిశోధనాంశాలు తోచక తలలు బద్దలు కొట్టుకునే యూనివర్శిటీ వాళ్ళకు, విమర్శకులకు, పరిశోధకులకు ఇవి రెడీ రిఫరెన్స్‌గా పనికివస్తాయి. ఎంతో విలువైన సమాచారాన్ని అందజేస్తాయి.

- అశోక్‌కుమార్, 9700000948



కొందరు సాధారణంగా ఉంటారు. కానీ అద్భుతాలు సాధించి అబ్బురపరుస్తారు. అనునిత్యం స్ఫూర్తిని కలిగిస్తూ ఉంటారు. అలాంటివారిలో ముందుంటారు టీనాదాబి. 2015 సివిల్స్‌లో టాపర్‌గా నిలిచి దేశం దృష్టిని ఆకర్షించిన ఆ దళితబిడ్డ ఇప్పుడు ఎందరో మహిళలకు ప్రేరణ. ఈ దేశంలో వేల సంవత్సరాలుగా మహిళలకు హక్కులు నిరాకరింపబడ్డాయి. నేటికీ మహిళల పట్ల అనేక విధాలుగా అణచివేత కొనసాగుతూనే ఉంది. వేల సంవత్సరాల అణచివేతను, అవమానాలను, అంటరానితనంలాంటి అనేక దుర్మార్గాలను బద్దలుకొట్టిమహిళలు ఏ విషయంలో తక్కువ కాదు అని నిరూపించింది భీమ్ పుత్రిక టీనాదాబి.

భీమ్ పుత్రిక టీనా దాబి

అతితిచన్న వయసులో, అది మొదటి ప్రయత్నంలో ఐఏఎస్ టాపర్ కావడం చాలా కష్టం. అలాంటిది ఒక దళిత కుటుంబంలో జన్మించి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని అఖండ విజయం సాధించింది. ఈ దేశంలో మహిళలకు హక్కులు కల్పించింది అంబేద్కర్. చరిత్రలో అది అంతగా నమోదు కాలేదు. మహిళలు సైతం అంతగా స్మరించలేదు. కానీ టినా అలా కాదు... తనకు జన్మనిచ్చింది తల్లిదండ్రులైతే.. జీవితాన్ని ఇచ్చింది బాబాసాహెబ్ అంబేద్కర్ అని చెబుతున్నది.

యూనివర్సిటీ టాపర్...

టీనా తల్లిది మహారాష్ట్ర... తండ్రిది రాజస్థాన్. కానీ ఆమె పెరిగిందంతా ఢిల్లీలోనే. భోపాల్‌లో పుట్టిన టీనా... తాను ఏడో తరగతిలో ఉన్నప్పుడే కుటుంబం ఢిల్లీకి షిఫ్ట్ అయ్యింది. తల్లి హిమాలీ దాబి ఇంజనీర్. తండ్రి జశ్వంత్ దాబి టెలికామ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగి. ఇద్దరూ ఇంజనీరింగ్ చదివినవారే అయినా కూతురిని మాత్రం సోషల్‌సైన్సెస్ వైపు ప్రోత్సహించారు. జీసస్ అండ్ మేరీ కాన్వెంట్‌లో టెంత్ వరకు చదువుకుంది. 2011లో లేడీ శ్రీరామ్ కాలేజీలో చేరిన టీనా బికామ్ డిగ్రీ చేసింది. అక్కడ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది. ఆ తరువాత అదే కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేసింది. స్కూల్ డేస్ నుంచే భారత రాజ్యాంగం, రాజకీయాలు అంటే ఆసక్తిని పెంచుకుంది. ఆ ఆసక్తి... పీజీ ప్రథమ సంవత్సర పరీక్షా ఫలితాల్లోనే తేలిపోయింది. ఆ సంవత్సరం పొలిటికల్ సైన్స్‌లో ఢిల్లీ యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది టీనా. యూపీఎస్సీ పరీక్షల కోసం ఒక ఏడాది పాటు సాధన చేసింది. అయితే అప్పటికే ఆమెకు అందుకు సరిపడా వయసు లేకపోవడంతో 21దాటేవరకు వేచి చూసింది.

తల్లే ఆదర్శంగా...

సివిల్ సర్వీసెస్‌చదివించాలన్నది తల్లిదండ్రుల నిర్ణయం. అందులో రాణించగలదని వాళ్ల నమ్మకం. అందుకే చిన్ననాటినుంచే వాళ్లు ఆమెను ఆవైపు ప్రోత్సహించారు. కొంత రీసెర్చ్ చేసిన తరువాత... తల్లిదండ్రుల ఆశయం కోసమే కాదు... తనకేం కావాలన్నది ఆమెకూ తెలిసొచ్చింది. దాంతో రోజుకు ఎనిమిది నుంచి 10 గంటలు చదివేది. వ్యూహాత్మకంగా, పథకం ప్రకారం చదవడం, ప్రణాళిక వేసుకోవడం, వారానికో టార్గెట్ పెట్టుకుని క్రమశిక్షణతో ఫోకస్‌డ్‌గా చదవడం వల్లే ఇది సాధ్యమయ్యింది. అలాగని యువతిగా ఏ ఆనందాన్ని వదులుకోలేదు. స్నేహితులతో సంతోషాన్ని పంచుకునేది. సినిమాలు కూడా బాగా చూసేది. ఇంగ్లీష్ సీరియల్స్ అంటే బాగా ఇష్టపడేది. ఆమెలో ఓ కళాకారిణికూడాఉంది. మధుబని ఆర్టును అద్భుతంగా వేస్తుంది. ఇంగ్లిష్ నావలిస్ట్ జేన్ ఆస్టిన్‌ని విపరీతంగా అభిమానిస్తుంది. తల్లే తన రోల్‌మోడల్ అని ఎప్పుడూ చెప్పే టీనా ఇప్పుడెంతోమందికి రోల్‌మోడల్‌గా మారిపోయింది.



కొంతైనా మార్పు...

'పితృస్వామిక మనస్తత్వం, లింగవివక్ష. ప్రగతిశీల భావాలున్న కుటుంబం నుంచి వ్యక్తిగా, ప్రతిష్టాత్మక లేడీ శ్రీరామ్ కాలేజీ విద్యార్థినిగా బాలికలు, మహిళలకోసం పనిచేస్తాను. మనుధర్మ శాస్త్రం తరతరాలుగా ఈ దేశ స్త్రీలను బానిసలుగా మార్చింది. స్త్రీని వంటింటికి పరిమితం చేసి, స్వేచ్ఛ, సమానత్వాన్ని దూరం చేసి ఆడవారిని బానిసలుగా బతకమని చెప్పింది. బాబా సాహెబ్ అంబేద్కర్ మనువాదనికి వ్యతిరేకంగా స్వేచ్ఛ, సమానత్వం కోసం నిరంతరం కృషి చేశారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి స్త్రీకి సమానంగా స్వేచ్ఛ, సమానత్వంతో పాటు ఈ దేశాన్ని పాలించే హక్కు కల్పించాడు. ఆయన కృషి ఫలితంగానే ఈ రోజు గొప్ప చదువులు చదవగలుగుతున్నాం. గౌరవంగా బతకగలుగుతున్నాం. అయితే మార్పు ఇప్పుడే మొదలైంది. ఇంకా చాలా రావాల్సి ఉంది. పరిస్థితుల్లో కొంతైనా మార్పు తీసుకురాగలిగితే చాలు' అని చెబుతుంది.

ఈ దేశంలో మహిళల వేల సంవత్సరాల అణచివేతకు, సతీసహగమనం లాంటి ఎన్నో భయంకరమైన దురాచారాలకు కారణం బ్రాహ్మణిజం/మనువాదం. అలాంటి దురాచారాలను అంతం చేసి, ఈ దేశ యువతకు ముఖ్యంగా మహిళా లోకానికి ఒక సందేశం ఇవ్వాలనుకుంది. అందుకే 2015 సివిల్స్ రెండో ర్యాంకర్ అమీర్ ఉల్ షఫీఖాన్‌ను పెండ్లి చేసుకోబోతోంది. వాళ్లిద్దరి అనుబంధం గురించి సోషల్‌మీడియాలో వెల్లడి చేసిన దగ్గరనుంచి చాలా చర్చ జరిగింది. 'ఒక్కోసారి మా గురించి చేస్తున్న చర్చ చూస్తే బాధేస్తుంది. కానీ సివిల్స్ టాపర్స్ అయినందుకు, ప్రజల మధ్యలోనే ఉండాలని నిర్ణయించుకున్నందుకు ఈ మూల్యం చెల్లించుకోకతప్పదేమో అనిపిస్తుంది. ప్రేమించుకోవడం నేరమా? ఒకే కులం, ఒకే మతం కాని వ్యక్తిని ప్రేమించడం నేరమెలా అవుతుంది?' అని ప్రశ్నించిందామె.

ఏ విమర్శలను, వివాదాలను లెక్క చేయకుండా ఎప్రిల్ 14న బుద్ధిస్ట్ పద్ధతిలో వివాహం జరుపుకోవడానికి వారిద్దరూ నిర్ణయించుకున్నారు. దేశంలోని అట్టడుగు వర్గాలకు సేవ చేయాలన్న ఆశయంతో ఉన్న ఆ ఇద్దరికీ... మతాంతర వివాహం చేసుకుంటూ ఈ దేశ యువతకు మార్గ దర్శకంగా నిలవాలనుకుంటున్న ఆ ఇద్దరూ మరింత ముందుకు సాగాలని కోరుకుంటూ..

- ఎం. శ్రీహరి

వేడినీళ్లు చేసే మేలు..





సాధారణంగా ఉదయం లేవగానే ... బ్రష్ చేసుకోగానే... కాఫీనో, టీనో తాగే అలవాటు మనలో చాలా మందికి ఉంటుంది. బ్రష్ చేయనిదే మంచినీరు కూడా ముట్టరు. కానీ ఉదయం లేవగానే వేడినీరు తాగితే కలిగే లాభాలేంటో తెలిస్తే... తప్పకుండా రేపటి నుండే... పరగడుపున గోరువెచ్చని నీరు తాగడం అలవాటు చేసుకుంటారు. ఈ అలవాటు వల్ల మంచి ఆరోగ్యంతోపాటు.... శారీరక రుగ్మతల నుంచి కూడా బయటపడవచ్చు. ఇంకా ఎలాంటి లాభాలు కలుగుతాయో చూద్దాం...!

\+ ఉదయం లేవగానే గోరువెచ్చని నీరు తాగేవారిలో... జీర్ణ సంబంధ సమస్యలు తొలగిపోతాయి. మలబద్ధకం, పైల్స్ లాంటి సమస్యలు కూడా దూరమవుతాయి. శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగిపోయి, త్వరగా బరువు తగ్గుతారు.

\+ శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉండి, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి. శరీర అవయవాలన్నీ కూడా ఆరోగ్యంగా ఉంటాయి. దీనివల్ల జీవ ప్రక్రియలన్నీ... సజావుగా సాగుతాయి.

దగ్గు, జలుబు, గొంతు నొప్పి వంటి శ్వాసకోశ సమస్యలతో బాధపడేవారు వేడినీరు తాగడం వల్ల మంచి ఉపశమనం పొందుతారు. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

\+ వేడినీరు తాగడం వల్ల 'కేంద్ర నాడీ వ్యవస్థ' పనితీరు మెరుగుపడుతుంది. దీనివల్ల ఒత్తిడి, ఆందోళన దూరమవుతాయి. చర్మానికి, వెంట్రుకలకు కూడా చాలా మంచిది.

\+ అర గ్లాసు గోరు వెచ్చని నీటిలో ఒక స్పూను తేనె, సగం నిమ్మ రసం కలిపి రోజూ... పరగడపునే తాగడం వల్ల మలబద్ధకం, హైపర్ ఎసిడిటీకి చక్కటి పరిష్కారంగా పనిచేస్తుంది. ❄

ఎండకు రంగుమారితే...



రోజుకో అరగంట బయట తిరిగినా చాలు ముఖంపై నల్లగా టాన్ పేరుకుపోతుంది. దానిని తొలగించుకోవడానికి ప్రతివారం పార్లర్ కి వెళ్లాలంటే కష్టమే. అందులోనూ బ్లీచ్ తరచుగా పెట్టడం వల్ల చర్మం కూడా గరకుగా, మందంగా మారుతుంది. కనుక ఇంట్లోనే దొరికే వస్తువులతో టాన్ ను వదిలించుకోవచ్చు.

నిమ్మ : నిమ్మరసంలో సహజసిద్ధంగానే బ్లీచింగ్ గుణాలు ఎక్కువ. టాన్ వల్ల నల్ల బడ్డ చోట నేరుగా నిమ్మరసాన్ని రాసి ఆరాక, కాసేపటికి చల్లని నీళ్లతో కడిగేసుకోవాలి. టాన్ ఇంకా ఉందనిపిస్తే నిమ్మరసం, తేనె కలిపిన మిశ్రమాన్ని వాడితే మంచి ఫలితం ఉంటుంది.

కీరా దోస: చర్మానికి హాయిని, చల్లదనాన్ని అందివ్వడంలో కీరాదోస ముందుంటుంది. కీరాదోసని గుజ్జులా మెత్తగా చేసి, దానికి కొద్దిగా రోజ్ వాటర్, నిమ్మరసాన్ని కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తరవాత కడిగేసుకుంటే టాన్ వదిలిపోతుంది. కీరాదోసలో విటమిన్ సి కూడా అధికంగా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమవంతంగా ఉంచుతుంది.

టొమాటో: ఆంటీయాక్సిడెంట్లు, ఖనిజాలు, విటమిన్లు పుష్కలంగా ఉన్న టొమాటో చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచేందుకు సహకరిస్తుంది. టొమాటో గుజ్జుకి, చెంచాడు పెరుగు, కాస్త ఓట్సు కలిపి మెత్తగా చేయాలి. ఆ మిశ్రమాన్ని రాసుకుని పదినిమిషాల తరవాత కడిగేసుకుంటే టాన్ పోవడమే కాదు, మెరిసే చర్మం మీ సొంతమవుతుంది.

ఆలుగడ్డ: విటమిన్ సి అధికంగా ఉన్న వాటిలో ఆలుగడ్డ కూడా ఒకటి. ఆలుగడ్డ ముక్కని మిక్సీలో వేసి మెత్తగా చేసుకోవాలి. ఆ పేస్టుకి కొద్దిగా నిమ్మరసం కలిపి ముఖానికి రాయాలి. అరగంట తరవాత కడిగేసుకోవాలి. నల్లదనం పోవడమే కాదు, మంచి పోషణని అందిస్తుంది. ❄

ఉప్పు అదుపు...



సరైన ఆహార నియమాలతోనే రక్తపోటు (బీపీ) నియంత్రణలో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అధికంగా ఉప్పు, కొవ్వు ఉండే పదార్థాలను తినేవారిని గమనించినప్పుడు... వారి బీపీలో హెచ్చుతగ్గులు ఉన్నాయని అంటున్నారు. వీరితో పోల్చితే, తక్కువ మోతాదులో... ఉప్పు, కొవ్వు ఉండే పదార్థాలను తినేవారిలో రక్తపోటు సాధారణ స్థితిలో ఉండటం గమనించినట్లు వారు వెల్లడించారు. కారం, మసాలాలు కూడా తక్కువగా ఉండే ఆహారాన్నే తీసుకోవాలని సూచిస్తున్నారు. రక్తపోటు పెరగటానికి ప్రధానంగా ఉప్పు దోహదం చేస్తుంది. అందువల్ల ఆహారంలో రోజుకు 3-4 గ్రాములకు మించకుండా ఉప్పు ఉండేలా చూసుకోవాలి. పచ్చళ్లు, వడియాలు వంటి నిల్వ పదార్థాల్లో ఉప్పు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రక్తపోటుతో బాధపడేవారు వీటికి దూరంగా ఉండటమే మంచిది. ఉప్పుకు బదులుగా రాళ్ల ఉప్పు(రాక్‌సాల్ట్) వాడటం ఉత్తమం. తక్కువ కొవ్వులు ఉండే... పప్పుదినుసులు, గింజలు, చేపలు వంటి ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ సార్లు టీ, కాఫీలు తీసుకోవడం మానేయాలి. ధూమపానం, మద్యపానం, గుట్కాలకు దూరంగా ఉండటం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది.

హత్యాయత్నం నుంచి తప్పించుకునేలా..!

మహిళలను అబలలుగా భావించి వారిపై ఎన్నో రకాల దాడులకు పాల్పడుతుంటారు మగవారు. మద్యానికి బానిసలుగా మారి ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితుల్లో మహిళలపై హింసకు పాల్పడుతారు. ఇలాంటి సందర్భాంలో క్షణికావేశంతో చేసే పనులు కూడా మహిళల ప్రాణాలను బలితీసుకుంటాయి. మగవారి అరాచకాల నుంచి, హత్యాయత్నాల నుంచి ఎలా తప్పించుకోవాలో ఈ వారం చూద్దాం..!



ఆడవారంటే అబలలు అన్న భావం సమాజంలో ఉంది. మగవారు ఏం చెప్పినా.. ఏం చేసినా ఎదురుమాట్లాడకుండా తలవంచుకోవాలని ప్రతి మగవాడు భావిస్తాడు. ఎదురుతిరిగారో.. ప్రాణాలకే ముప్పు. ఇక్కడ ఒక యువతిపై హత్యాయత్నం చేస్తున్నాడు. భయంతో ఆమె కేకలు వేయలేదు.. చాకచక్యంగా ఆ వ్యక్తిని ఎదుర్కొన్నది.



ఆ వ్యక్తి తనను చంపడానికి వచ్చాడని గ్రహించిన ఆమె తన రెండుచేతులతో అతని చేతిని గట్టిగా పట్టుకోవడంతో పాటు అతని అరచేతిని తన బలమంతా ఉపయోగించి వెనక్కి వంచింది. బాధతో అతడు కొద్దిగా తన పట్టు సడలించడంతోపాటు కిందికి వంగాడు.

ఆడపిల్లలంటే అబలలు కాదు ఆడపులులు.. వారిని వేధించాలని ప్రయత్నిస్తే.. ప్రతిదాడి తప్పదని మగవారు అర్థం చేసుకునే రోజు వచ్చినప్పుడు మహిళలను గౌరవించడం నేర్చుకుంటారు. మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగి తమ శక్తి తాము తెలుసుకుని.. దాడులను తిప్పికొట్టినప్పుడే స్వేచ్ఛగా మహిళలు తిరగ గలుగుతారు.



ఇదే అదనుగా ఆమె ఒక చేత్తో అతడి చేతిని గట్టిగా పట్టుకుని మరోచేత్తో అతడి జుట్టును పట్టుకుని గట్టిగా లాగింది. బాధతో అతడు అశక్తుడిగా మారుతాడు.



అతడి జుట్టు పట్టుకుని గట్టిగా వెనక్కి లాగడంతో పాటు తన కుడికాలితో అతడి మోకాలు మడతలో కిక్ ఇవ్వడంతో అతడు కింద పడిపోతాడు.



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

పిప్పళ్ల వెంకటేశ్

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి


- ఐదుగురికి తీవ్రగాయాలు
- మృతులంతా కేరళవాసులే..

బంగారుపాళ్యం : రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చెన్నయ్- బెంగళూరు నాలుగో నెంబర్ జాతీయ రహదారి మాధవనగర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు చోటు చేసుకుంది. డిఎస్పి చౌడేశ్వరి కథనం మేరకు.. కేరళ రాష్ట్రం కాసర్ జిల్లా నంగేరి తాలుకా కుంబ్లే గ్రామానికి చెందిన తొమ్మిది మంది యాత్రికులు శనివారం మధ్యాహ్నం తిరుమలకు శ్రీవారి దర్శనార్థం మిని ట్రావెల్స్‌లో బయల్దేరారు.

ఆదివారం ఉదయం మండలంలోని మాధవనగర్ వద్ద ఎస్ఆర్ఎస్ ప్రయివేటు ట్రావెల్స్ (పివై.01ఆర్‌హెచ్1825) బస్సు ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించబోయి చిత్తూరు వైపు వస్తున్న మిని వ్యాను(కెఎల్.14 కె7468)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిజ(47), మంజప్పగట్టే(55), సదాశివగట్టే(50) శ్రీకర్‌గట్టే(75)లు అక్కడికక్కడే మృతి చెందారు. నాగవేణి, హరిష్, లక్ష్మీ, రాజగట్టే, డ్రైవర్ ఉమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన స్థానికులు క్షతగాత్రులను బంగారుపాళం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అందించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సిఐ మధుసూదన్‌రావు., ఎస్ఐ నెట్టికంఠయ్య పరిశీలించారు. మృతదేహాలకు బంగారుపాళ్యం ప్రభుత్వాసుపత్రిలో పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజారోగ్య రక్షణకు బలమైన ఉద్యమం

ఎఫ్ఎంఆర్ఎఐ జాతీయ అధ్యక్షులు ఆర్ విశ్వనాథన్ పిలుపు



కర్నూలు : పాలకులు ప్రజారోగ్యాన్ని కార్పొరేట్ శక్తులకు వదిలేశారని, దీంతో ఫార్మా రంగంలో కార్మిక హక్కులు నిర్వీర్యమవుతున్నాయని ప్రజారోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు కార్మిక హక్కులను కాపాడుకునేందుకు మెడికల్ రెప్రజెంటేటివ్‌లు బలమైన ఉద్యమాలను నిర్మించాలని ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ) అధ్యక్షులు ఆర్.విశ్వనాథన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రెప్రజెంటే టేవ్ యూనియన్(ఎపిఎంఎస్ఆర్‌యు) స్వర్ణోత్సవాలు కర్నూలు నగరంలో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో విశ్వనాథన్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా వ్యవహరి స్తోందన్నారు. మెడికల్ రెప్రజెంటేటివ్‌లు కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఇతర అన్ని కార్మిక సంఘాలతో కలిసి పోరాటాలను నిర్మించాలని అప్పుడే ఉద్యమ ఉధృతి పాలకులకు బోధపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర నాయకులు టి .కామేశ్వరరావు మాట్లాడారు. ఫార్మా రంగంలో బహుళ జాతి కంపెనీల దోపిడీని అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. లాభాల కోసం బహుళజాతి కంపెనీలు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోకపోగా ఇందుకు వ్యతిరేకంగా ఉద్యమించే కార్మిక వర్గంపై దాడికి పాల్పడడం శోచనీయ మన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అన్నారు. ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పిఎస్.శేఖర్‌రెడ్డి, యువి. క్రిష్ణయ్య మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడే మందులపై ప్రభుత్వాలు పన్నులు విధించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. వైద్యం ఖరీదైపోయిందని, ధనవంతులకే వైద్యం దొరుకు తోందని అన్నారు. సామాన్యులకు జబ్బులొస్తే ఆస్తులు అమ్ముకునేలా వైద్యం ఖర్చులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల మందులపై జిఎస్‌టిని రద్దు చేసి ధరలను సామాన్యులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఎస్ ఆర్‌యు నాయకులు ఎజి.రాజ్‌మోహన్, ఎవి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రసాద్‌శర్మ, వెంకట్, శ్రీకాంత్, రవీంద్రారెడ్డి, రాఘవేంద్ర, పెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

రమేష్, రవీంద్ర

- టిడిపి రాజ్యసభ అభ్యర్థులు ఖరారు

అమరావతి : రాజ్యసభ అభ్యర్థు లుగా సిఎం రమేష్, కనక మేడల రవీంద్ర కుమార్‌ను తెలుగుదేశం పార్టీ ఎంపిక చేసింది. ఆదివారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఇప్పటికే రాజ్యసభ సభ్యుడిగా ఉన్న రమేష్‌ను చంద్రబాబు స్వయంగా ఎంపిక చేశారు. అయితే రెండో అభ్యర్థిగా వర్ల రామయ్య, బీదా మస్తానరావు పేర్లు వినిపించాయి. చివరికి టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు కనకమేడల రవీంద్రకుమార్‌ను ప్రకటించడంతో మస్తానరావు, రామయ్య తీవ్ర నిరాశకు గురయ్యారు. కుటుంబసభ్యులతో చంద్రబాబు ఇంటికి బయలుదేరిన వర్ల రామయ్య ప్రకాశం బ్యారేజీ మీద నుండి తిరిగి ఇంటికి వెళ్లిపోయారని వార్తలొచ్చాయి. ఎంతోకాలంగా పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న బీదా మస్తానరావు కూడా తీవ్ర నిరాశలోకి వెళ్లిపోయారు. రెండు రోజులుగా దీనిపై కుస్తీ పడుతూ వచ్చిన టిడిపి, ఆదివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తనకూ సీటు ఇవ్వాలని యనమల రామకృష్ణుడు ఎప్పటి నుండో కోరుతున్నారు. అయనకు కూడా ఈసారి నిరాశే మిగిలింది. అభ్యర్థుల ప్రకటన అనంతరం ఆయన కూడా అసంతృప్తిగానే బయటకు వెళ్లారని తెలిసింది. అయితే సిఎం రమేష్ రాయలసీమలోనూ, చంద్రబాబు కోటరీలోనూ కీలకంగా ఉండటంతో ఆయన ఎంపిక ఏకగ్రీవమైంది. ప్రత్యేక హోదా విషయంలోనూ ఆయన పోరాడాడని మీడియాకు లీకులిచ్చినప్పటికీ ఆయన ఆర్థికంగానూ, వ్యాపారపరంగానూ కీలక నేతకు బినామీగా ఉండటమే కారణమని టిడిపి సీనియర్ నాయకుడొకరు తెలిపారు. టిడిపిలో ఎప్పటి నుండో పనిచేస్తూ ఎంతోమంది రాజ్యసభ కోసం ఎదురు చూస్తున్నారని, వారికెవరికీ సీటు ఇవ్వకుండా సిఎం రమేష్‌నే మరోసారి కొనసాగించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

పెంచిన వేతనాలు అమలు చేయండి

- మున్సిపల్ కమిషనర్‌కు కార్మిక సంఘాల జేఏసీ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మున్సిపల్ కార్మికులకు జీవో నెం 14లో పేర్కొన్నట్టు పెంచిన వేతనాలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ కోరింది. వేతనాల పెంపుదల కోసం వెంటనే జీవో 14ను విడుదల చేస్తామని ఐదు నెలల క్రితం మంత్రి కె తారకరామారావు కార్మిక సంఘాలకు హామీ ఇచ్చారని పేర్కొంది. ఇప్పటి వరకు ఆ జీవో విడుదల కాలేదని తెలిపింది. ఇదే అంశంపై జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), వనమాల కృష్ణ(ఐఎఫ్‌టీయూ), ఏసురత్నం(ఏఐటీయూసీ) ఈమేరకు ఆదివారం మున్సిపల్ కమిషనర్‌ను జీవో 14 విడుదల చేయాలని కోరారు. పెంచిన వేతనాల అమలు కోసం ఐదు నెలలుగా ఎదురు చూసిన కార్మికులు ఎంతో నిరాశతో ఉన్నారని పేర్కొన్నారు. అనివార్య పరిస్థితుల్లో తిరిగి పోరాటంలోకి వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల పెంపుదల కోసం సమ్మెతో సహా అన్ని రకాల ఆందోళనలకు పూనుకోవాలని జేఏసీ నిర్ణయించిందని గుర్తు చేశారు. అందులో భాగంగా మార్చి 12న జిల్లా కలెక్టర్ కార్యాలయాలవద్ద ధర్నాలు, మార్చి 15, 16,17 తేదీల్లో సమ్మె చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ, స్వచ్ఛ సర్వేక్ష్ కోసం పని గంటలతో నిమిత్తం లేకుండా నగరాలను శుభ్రపరుస్తున్నారని తెలిపారు.

క్యాన్సర్ అవగాహనకు 3కె రన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జేఎన్టీయూ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు, అధ్యాపకులు క్యాన్సర్‌పై అవగాహన, నిర్మూలన కోసం 3కె రన్ నిర్వహించారు. ఈ రన్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్క్ ప్రధాన గేటు వద్ద మంత్రి హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందు దశలో గుర్తించడం వల్ల ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. క్యాన్సర్ మీద ప్రజలకు అవగాహన కల్పించడం కోసం జేఎన్టీయూ హైదరాబాద్ విద్యార్థులు, అధ్యాపకులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లోనూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ ఎ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలను ప్రారంభదశలోనే గుర్తిస్తే నిర్మూలన సులభతరం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆర్ శ్రీదేవి, కెస్ట్-2018 కోఆర్డినేటర్ ఈ హేమలత తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరు రైతులు..

- ఖమ్మం జిల్లాలో పోడు రైతు ఆత్మహత్య
- మహబూబాబాద్ జిల్లాలో మహిళా రైతు..

నవతెలంగాణ-ఖానాపురంహవేలీ/కే సముద్రం

ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అప్పుల బాధతో ఆదివారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల్లో పోడు రైతు, మహిళా రైతు ఉన్నారు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం కైకొండాయిగూడెం గ్రామానికి చెందిన గిరిజన రైతు నాగేశ్వరరావు(40) గణేశ్వరంలో తన నాలుగెకరాల పోడు భూమితో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి, కూరగాయలు సాగుచేస్తున్నాడు. సాగునీటి కోసం గతేడాది రెండు బోర్లు వేశాడు. నీళ్లు పడకపోవడంతో ఈ ఏడాది మరో రెండుసార్లు బోర్లు వేసినా అదే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు పంటకు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఎక్కువయ్యాయి. అవి తీర్చే దారిలేక తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందగా పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహాన్ని గ్రామానికి తరలించారు.

గిరిజన రైతు మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

రైతు తేజావత్ నాగేశ్వరరావు ఆత్మహత్యకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ గిరిజన, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి రమేశ్, మాదినేని రమేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల లెనిన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కరరావు సందర్శించి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత రైతు కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళా రైతు

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇనుగుర్తికి చెందిన నద్దునూరి మహేంద్ర(36)కు ఎకరంన్నర భూముంది. దానికి తోడు మరో మూడెకరాలను కౌలుకు తీసుకుని భర్తతో కలిసి వరి, పసుపు, పత్తి పంటలు సాగు చేసింది. దిగుబడి సరిగా రాక పోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధర రాక పోవడంతో వడ్డీ, అసలు కలిపి రూ. నాలుగు లక్షల మేరకు అప్పులు అయ్యాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనకు గురై ఆదివారం తెల్లవారుజామున పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గ మధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందింది.

ప్రశాంతంగా స్టాఫ్ నర్సు పరీక్ష

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్, ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమ శాఖలో ప్రకటించిన స్టాఫ్ నర్సు పోస్టులకు ఆదివారం నిర్వహించిన రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 3,311 స్టాఫ్ నర్సు పోస్టులకు ఆదివారం ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహించామని తెలిపారు. 26,412 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, వారిలో 21,400 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుంటే, 21,391 (99.9 శాతం) మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు.


భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ఐపీఎస్ అధికారులు ఎదురు చూస్తున్న పోస్టింగ్‌ల వ్యవహారం ఆదివారంరాత్రి ఓ కొలిక్కి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నెలరోజులుగా నాన్చుతూ వచ్చిన ఐపీఎస్‌ల బదిలీలపై అర్ధరాత్రి నిర్ణయం తీసుకుంది. ఈమేరకు నగర పోలీస్ కమిషనర్‌గా అంజనీ కుమార్, సైబరాబాద్ కమిషనర్ గా వి.సి.సజ్జనార్, రాష్ట్ర రోడ్డు సేఫ్టీ అథారిటీ డీజీపీగా టీ.కృష్ణ ప్రసాద్‌ను నియమించడంతో పాటు మొత్తం 38 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అధికారి పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
టి. కృష్ణ ప్రసాద్	డీజీపీ, రైల్వే, రోడ్ సేఫ్టీ	డీజీపీ రోడ్‌సేఫ్టీ అథారిటీ
సంతోష్ మెహరా	అదనపు డీజీ వెయిటింగ్	పోలీస్ అకాడమీ డైరెక్టర్
అంజనీ కుమార్	అదనపుడీజీ లాఅండ్‌ఆర్డర్	హైదరాబాద్ పోలీస్ కమిషనర్
యం. గోపీకృష్ణ	అదనపు డీజీ ఆర్గనైజేషన్	డైరెక్టర్ జనరల్ ఫైర్ సర్వీస్
రాజీవ్ రతన్	డైరెక్టర్ ఫైర్ సర్వీస్	అదనపు డీజీ ఆర్గనైజేషన్
జితేందర్	డైరెక్టర్ పోలీస్ అకాడమీ	అదనపు డీజీ లా అండ్ ఆర్డర్
సందీప్ శాండిలియా	సైబరాబాద్ కమిషనర్	అదనపు డీజీ రైల్వే,రోడ్ సేఫ్టీ
సౌమ్యా మిశ్రా	ఐజీపీ, డబ్ల్యూసీసీ	ఐజీపీ, పోలీస్ వెల్ఫేర్
శికా ఘోయల్	ఐజీపీ సీఐడీ	అడిషనల్ కమిషనర్ హైదరాబాద్ సిటీ (క్రైమ్, సిట్)
స్వాతి లక్రా	అదనపు సీపీ సిటీ క్రైం అండ్ సిట్	ఐజీపీ లా అండ్ ఆర్డర్ వుమెన్ సేఫ్టీ, షీ టీం
వి.వి. శ్రీనివాస రావు	సిటీ ఇన్‌చార్జ్ కమిషనర్	చైర్మన్ పీఎస్ఎల్‌పీఆర్‌బీ
అనిల్ కుమార్	ఐజీపీ వేయిటింగ్	అదనపు సీపీ, ట్రాఫిక్ సిటీ
వి.సి. సజ్జనార్	ఐజీ, ఎస్ఐజీ	సైబరాబాద్ కమిషనర్
దేవేంద్రసింగ్ చౌహన్	ఐజీపీ వేయిటింగ్	అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ సిటీ
టి.వి. శశిధర్ రెడ	డైరెక్టర్ వీ అండ్ ఈ	అదనపు డైరెక్టర్ ఆర్‌బీవీఆర్ అకాడమీ
సుధీర్ బాబు	వరంగల్ కమిషనర్	జాయింట్ కమిషనర్, రాచకొండ
సి.రవివర్మ	ఐజీపీ, వేయిటింగ్	ఐజీపీ, సీఐడీ
టి. ప్రభాకర్ రావు	ఐజీ, ఇంటలిజెన్స్	ఐజీ, ఎస్ఐజీ
వీ.రవిందర్	జాయింట్ కమిషనర్, ట్రాఫిక్ సిటీ	వరంగల్ కమిషనర్
తరుణ్ జోషి	జాయింట్ కమిషనర్, రాచకొండ	జాయింట్ కమిషనర్ స్పెషల్ బ్రాంచ్ సిటీ
శివకుమార్	కమిషనర్, సిద్దిపేట	ఎస్పీ, ఇంటలిజెన్స్
ఎ.వెంకటేశ్వరరావు	వెస్ట్‌జోన్, డీసీపీ	డీసీపీ, మాధాపూర్
విశ్వప్రసాద్	డీసీపీ, మాధాపూర్	డీసీపీ, సెంట్రల్ జోన్
ఏ.ఆర్. శ్రీనివాస్	సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ	వెస్ట్‌జోన్ డీసీపీ
ఎం. రమేష్	గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్	ఈస్ట్‌జోన్, డీసీపీ
శశిధర్ రాజు	ఈస్ట్‌జోన్ డీసీపీ	డీజీపీ ఆఫీస్
ఎం.శ్రీనివాసులు	ఎస్పీ, వేయిటింగ్	ఎస్పీ. సీఐడీ
రమా రాజేశ్వరి	ఎస్పీ, వేయిటింగ్	ఎస్పీ జోగులాంబ గద్వాల జిల్లా
జోయల్ డేవీస్	సెంట్రల్ జోన్ డీసీపీ	సిద్దిపేట కమిషనర్
ఎస్.ఎం. విజయ్ కుమార్	ఎస్పీ గద్వాల్	ఎస్పీ గ్రేహౌండ్స్
అనంత శర్మ	ఎస్పీ జగిత్యాల	ఎస్పీ పోలీస్ అకాడమీ
విశ్వజీత్ కంపాటి	ఎస్పీ రాజన్న సిరిసిల్ల	డైరెక్టర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (జీహెచ్ఎంసీ)
బీకే రాహుల్ హెగ్డే	ఏఎస్పీ ఏటూరు నాగారం	ఏఎస్పీ రాజన్న సిరిసిల్ల
సునీల్ థత్	ఏఎస్పీ భద్రాచలం	ఏఎస్పీ జగిత్యాల జిల్లా
అపూర్వ రావ్	ఏఎస్పీ గోదావరిఖని	ఏఎస్పీ సీఐడీ
చేతన	ఏఎస్పీ వేయిటింగ్	ఏసీపీ సుల్తాన్ బజార్
రక్షిత కే మూర్తి	ఏఎస్పీ వేయిటింగ్	ఏఎస్పీ గోదావరిఖని
పాటిల్ సంగ్రామ్ సింగ్	ఏఎస్పీ వెయిటింగ్	ఏఎస్పీ భద్రాచలం

ఉత్తరప్రదేశ్‌లో కీలక ఉప సమరం

- 43 శాతం దాటని పోలింగ్
- ఈనెల 14న ఫలితాలు



లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో ఆదివారం రెండు లోక్‌సభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలు యోగీ పాలనకు పెద్ద పరీక్షగా నిలవనున్నాయి. సిఎం యోగీ రాజీనామాతో గోరఖ్‌పూర్‌లోనూ, ఉప ముఖ్యమంత్రి మౌర్య రాజీనామాతో ఫూల్‌పూర్‌లోనూ ఉప ఎన్నికలు జరిగాయి. గోరఖ్‌పూర్‌లో 43 శాతం పోలింగ్ అవ్వగా ఫూల్‌పూర్ లో 40 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది. ఈ ఉప ఎన్నికల్లో చాలా ఏళ్ల తర్వాత బిఎస్‌పి అధినేత మాయావతి సమాజ్‌వాది పార్టీకి మద్దతు తెలపడంతో ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. గోరక్‌పూర్‌లో బిజెపి తన అభ్యర్థిగా బ్రహ్మణ కులానికి చెందిన స్థానిక నేత ఉపేంద్ర శుక్లాను రంగంలోకి దింపింది. సమాజ్‌వాది పార్టీ ఓబిసి కులమైన నిషాద్‌కు చెందిన ప్రవీణ్ నిషాద్‌ను నిలబెట్టింది. గోరఖ్‌పూర్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో నిషాద్ కులానికి మంచి ప్రాతినిధ్యమే ఉంది. యాదవ్‌లకు కాకుండా నిషాద్ కులానికి సీటు ఇవ్వడంతో అఖిలేష్ తమ పార్టీపై ఇతర ఓబిసి కులాలకు ఉన్న వ్యతిరేకతను తగ్గించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఇక్కడ జాతవ్ దళితులు, ముస్లీమ్‌లు కూడా అధికంగా ఉన్నారు. బిఎస్‌సి మద్దతుదారులైన వీరు ఎప్పటి నుండో ఎస్‌పితో ఉన్న వైరం కారణంగా ఇప్పుడు మాయవతి మద్దతు పలికినప్పటికీ ఓటు వేస్తారా అనేది కాస్త ప్రశ్నార్థకంగానే ఉంది. అయితే సామాజిక పొందికల రీత్యా ఇక్కడ రెండు పార్టీల మధ్య పోటాపోటీగా పరిస్థితి ఉంది. ఇక ఫూల్‌పూర్‌లోనూ పరిస్థితి ఈవిధంగానే ఉంది. బిజెపి, ఎస్‌సి రెండు పార్టీలూ కుర్మీ కులానికి చెందిన అభ్యర్థులనే పోటీలో నిలిపాయి. 2014లో ఈ నియోజకవర్గంలో మోడీ హవాతో బిజెపి మూడు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. గోరక్‌పూర్‌లోనూ 2014లో యోగీ మూడు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలిచారు. యోగీ సిఎం అయిన తర్వాత మొదటిసారి ఈ ఉప ఎన్నికల ద్వారా పెద్ద పరీక్షను ఎదుర్కొంటున్నారు. ఈనెల 14న తేదీన ప్రజల తీర్పు ఏంటో తెలియనుంది.

బీహార్‌లోనూ ఉప ఎన్నికలు

బీహార్‌లో కూడా ఆదివారం ఒక లోక్‌సభకు, రెండు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగాయి. ఆర్జేడి ఎంపీ మరణంతో ఆరారియాలో జరిగిన ఉప ఎన్నికలో 57 శాతం పోలింగ్ నమోదయ్యింది. జెహనాబాద్ అసెంబ్లీ స్థానంలోనూ ఆర్జేడి ఎమ్మెల్యే మరణంతో ఉప ఎన్నికలు జరిగాయి. ఇక్కడ 50 శాతం ఓటింగ్ నమోదయింది. బిజెపి ఎమ్మెల్యే మరణంతో భభువా స్థానంలో ఉప ఎన్నిక జరగగా 54 శాతం పోలింగ్ నమోదయింది. మహాకూటమి నుంచి నితీష్ కుమార్ బయటకు వచ్చిన తర్వాత మొదటిసారి జరుగుతున్న ఈ ఉప ఎన్నికలు బీహార్ సిఎంకు ప్రతిష్ఠాత్మకంగా మారాయి. బిజెపి,జెడి యు కలిసి పోటీచేస్తుండగా ఆర్జేడి, కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నాయి. అరారియాలో బిజెపితోనూ, జెహనాబాద్‌లో జెడి యుతోనూ ఆర్జేడి పోటీ పడుతోంది. భభువాలో బిజెపి, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీపడుతున్నారు.

ఎన్ఎస్ఎఫ్ తెరిపించేందుకు కేంద్రం సిద్ధం

- ప్రభుత్వ పరిశ్రమలను మూసేసి ప్రయివేటు ఫ్యాక్టరీలకు అనుమతి సరిగాదు : కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ గంగారాం

నవతెలంగాణ - బోధన్ రూరల్

ప్రభుత్వ పరిశ్రమలను మూసేసి ప్రయివేటు ఫ్యాక్టరీలకు అనుమతి ఇవ్వడం సరిగాదని, నిజాంషుగర్ ఫ్యాక్టరీ(ఎన్ఎస్ఎఫ్)ని తెరిపించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్సరాజ్ గంగారాం అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయన్నారు. నిజామాబాద్‌జిల్లా బోధన్‌లో ఆదివారం జరిగిన చెరుకు రైతుల చర్నాకోల్ పాదయాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ..నరేంద్ర మోడీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పన కోసం, రైతుల సంక్షేమం కోసం పనిచేస్తూ కోట్ల రూపాయల నిధులను వెచ్చిస్తున్నదన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి తొమ్మిది రోజులపాటు 140 కి.మీ. పాదయాత్ర చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. తెలంగాణలో ఇప్పటికే నాలుగు ప్రాజెక్టులకు లక్షల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశామని పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో రామగుండం పరిశ్రమ మూతపడితే ఐదు వేల కోట్లు వెచ్చించి నడిపిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీ తెరిపించే విధంగా ఆలోచించాలని, ప్రధాని మోడీని కలిసి చర్చిస్తే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాంచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి రఘునందన్ రావు, రాష్ట్ర నాయకులు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షులు పల్లె గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి అడ్లూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల నినాదాలు..
పోలీసులపై మంత్రి అసహనం

కేంద్ర మంత్రి హన్సరాజ్ గంగారాం సభలో ప్రసంగిస్తున్న సమయంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు వర్గీకరణ చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఆయన పోలీసులపై అసహనం వ్యక్తం చేశారు. వారిని అదుపుచేయడం పోలీసుల పనికాదా? చేతులు కట్టుకుని ఉంటారా? అంటూ ఒకింత అసహనం ప్రదర్శించారు. దీంతో సీఐ గోవర్ధనగిరి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు అక్కడ నుంచి పంపించేశారు.

17న కలెక్టర్లు, ప్రజాప్రతినిధులకు వినతులు

- ఇండ్లు, స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జర్నలిస్టులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 17న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లకు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. హైదరాబాద్‌లోని టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం బసవపున్నయ్య మాట్లాడుతూ....జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించి, అద్భుతమైన ఇండ్లు నిర్మించి ఇస్తామని ముఖ్యమంత్రి పలుమార్లు హామీనిచ్చారని తెలిపారు. కానీ నాలుగేండ్లు కాలంలో ఆ హామీని అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ జర్నలిస్టు హౌసింగ్ సొసైటీల్లో సభ్యులుగా ఉన్నవారు, ఏ సొసైటీలో లేని సభ్యులు ఇండ్ల స్థలాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూసి చనిపోతున్నారని తెలిపారు. చనిపోయిన జర్నలిస్టుల సహాయాన్ని రూ.రెండు లక్షలకు పెంచాలని కోరారు. తెలంగాణ ఉద్యమానికి చేయుతనిచ్చిన చిన్న పత్రికలపై ఆంక్షలు విధించడంతో, చాలా పత్రికలు నడవలేనిస్థితిలో ఉన్నాయని చెప్పారు. చిన్నపత్రికలను కాపాడాల్సిన బాధ్యత తెలంగాణ ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి ఆనందం, పిల్లి రాంచందర్, తాటికొండ కృష్ణ, జగన్, ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి ఏ నర్సింగరావు, కోశాధికారి ఆర్ వెంకటేశ్వర్లు, హెచ్‌యూజే అధ్యక్షులు చంద్రశేఖర్, నాయకులు విజయానంద్, సలీమా, నాగవాణి పాల్గొన్నారు.

అమానవీయంగానే దళితుల స్థితి: డిఎస్ఎంఎమ్

న్యూఢిల్లీ : దేశంలో దళితుల పరిస్థితి ఇంకా అమానవీయంగానే ఉందని డిఎస్ఎంఎమ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని బలియా జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడు 40ఏండ్ల దళిత మహిళను సజీవంగా దహనం చేయడానికి ప్రయత్నించిన సంఘటన పట్ల తీవ్ర నిరసనను వ్యక్తం చేసింది. ప్రయివేటు వ్యాపారస్తుల నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించకపోవడంతో దళిత మహిళపై దుండగులు దాడికి పాల్పడ్డారని పేర్కొంది. వార్తా పత్రికల కథనం మేరకు ఆ మహిళకు 80 శాతం గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. నిందితు లు సుద్దు సింగ్, సోను సింగ్‌లను కఠినంగా శిక్షించాలని డిఎస్ఎమ్ఎమ్ డిమాండ్ చేసింది. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాల నిరోధక చట్టం కింది నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరింది. ఆమె వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని తెలిపింది. ఆమె కుటుంబానికి తగిన నష్ట పరిహారం కూడా చెల్లించాలని డిమాండ్ చేసింది.


ఏసీబీకి చిక్కిన మహబూబాబాద్ టౌన్‌ఎస్ఐ

రూ. 8వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ టౌన్ ఎస్ఐ రూ.8వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ఆదివారం అడ్డంగా దొరికిపోయాడు. ఏసీబీ సీఐ సతీష్ వివరాల ప్రకారం...మహబూబాబాద్ పట్టణం వేల్పుల సత్యనారాయణ కాలనీలోని రాసరి సంధ్య, శ్రీనివాస్ మధ్య ఇంటి ప్రహరీ విషయంలో వారం రోజుల కింద గొడవ జరిగింది. ఈ కేసు పట్టణ ఎస్ఐ కమలాకర్ వద్దకు వచ్చింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఉండేందుకు ఎస్ఐ రూ. 8వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో శ్రీనివాస్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆదివారం మధ్యాహ్నం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రూ.8వేలను ఎస్ఐ కమలాకర్‌కు శ్రీనివాస్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎస్ఐ కమలాకర్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ సీఐ తెలిపారు.

విమర్శలు పట్టించుకోకు నీల్ లాల్ జెండా...




మాస్టార్ జీ

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన పిదప అది ఏ నినాదంతో ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాటం చేసి సాధించుకుందో, ఆ సాధనకు పునాదులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర మైనారిటీ వర్గాల ప్రజల ఆశయాలు, ఆకాంక్షలు ఆశించిన మేరకు సాకారం కావడం లేదు. ఈ విషయాలను ఆయా వర్గాల వారు వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్న అసంతృప్తిని గమనించిన వారిలో ముఖ్యంగా వామపక్ష భావాలతో రాజకీయాలు నడుపుతున్న సీపీఐ(ఎం) నిర్వహించిన మహా పాదయాత్రతో ప్రజల అసంతృప్తులు ఏ రంగాలలో ఎలా ఉన్నాయో బయట పడ్డాయి. ప్రజలలో అంతర్గతంగా గూడుకట్టుకొని ఉన్న అసంతృప్తులను టీ-మాస్ పేర ఇటు వీరితోపాటు అటు సామాజిక న్యాయమే లక్ష్యంగా పోరాడుతున్న అంబేద్కర్ వాదులను, పూలే వాదులను ఇతర సామాజిక ఉద్యమ సంస్థలను కలుపుకొని సంవత్సరంపాటు వివిధ ప్రాంతాలలో నిర్వహించిన సభలు, సమావేశాలు కలిగించిన స్ఫూర్తితో గత నెలలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అనే రాజకీయ ఫ్రంట్ ఏర్పాటుకు కారణమైంది. దాదాపు 29 రాజకీయ పార్టీల ఐక్య సంఘటనతో ఏర్పడిన బీఎల్ఎఫ్ ఇటు రాజకీయ రంగంలో, అటు మనువాదుల గుండెల్లో ప్రకంపనలు పుట్టించిందనడంలో ఎలాంటి వివాదాలకు తావులేదు. దీని పర్యవసానంగా కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఆర్ఎస్ వంటి ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు ఇతర చిన్నాచితక పార్టీలలో అంతర్గత చర్చలతోపాటు చిన్న ఆందోళన కూడా మొదలైనట్టు వారి వారి ప్రవర్తన, ప్రకటనలతోపాటు కొందరు పరోక్షంగా, మరికొందరు ప్రత్యక్షంగా తమ అక్కసు వెళ్లగక్కడం గమనార్హం. ఇందుకు ఉదాహరణ గత ఫిబ్రవరి 9నాడు రాత్రి 9గంటలకు ఒక టీవీలో ప్రసారమైన ప్రత్యేక కథనం "ఎర్ర సైన్యం దారి ఎటు వైపు" అంటూ ఆ పార్టీ పుట్టి దాదాపుగా 100 సం॥లు దగ్గర పడుతున్న విషయాన్ని ప్రస్తావిస్తూ అది మన దేశంలో నిర్వహించిన పోరాటాల పాత్రని ఫ్లాష్‌బ్యాక్‌లో మరోవైపు ఆ ఛానల్ భుజానికెత్తుకుని మోస్తున్న మనువాద విష కలశాన్ని ఈ కథనంలో కుమ్మరించింది.

ఇంతకీ ఆ టీవీలో ప్రసారమైన మొత్తం కార్యక్రమ అంశాలని బేరీజు వేస్తే ఒకప్పుడు అది గొప్ప పార్టీ అనీ, ఎక్కడా ఏ అన్యాయం, శ్రమ దోపిడీ జరిగినా దానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసిన ప్రజల పక్షాన నిలబడిన పార్టీ అనీ చెబుతూనే ఇప్పుడది క్రమక్రమంగా తన అస్తిత్వాన్ని కోల్పోతున్నదనీ, ఆ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఒక్క ఓటు కూడా సంపాదించే స్థితి లేదనీ ప్రేమపూర్వకమైన ఏడ్పేదో చేసింది. ఇందుకు కారణాన్ని హేతుబద్ధంగా వివరించలేని ఆ ఛానెల్ అంబేద్కర్ వాదులు ఒక వైపు, మార్క్స్ వాదులు మరో వైపు ఎవరికి వారుగా తమ పోరాటాలే అసలైనవని విడివిడిగా ఎవరి దారిలో వారు వెళ్లటం వల్ల ఏ ప్రజలకైతే నిజమైన విముక్తి కావాలో అది జరగలేకపోయింది. ఇందుకు ఇరు వామపక్షాలవాళ్లు బాధ్యులే అన్న సత్యాన్ని నిజాయితీగా గమనించిన ఇప్పుడే నీల్ లాల్ జెండాలు ఒకే గుప్పిట్లోకి రావడానికి విజయకేతనం ఎగరేసే సమయానికే విదేశీ మనువాద వారసులైన ఇలాంటి టీవీ, ప్రింటు మీడియాలకు కంటగింపుగా ఉంటుంది. ఈ బహుజన వామపక్షాల ఐక్య ఉద్యమాలు విచ్ఛిన్నం చేయడానికి తమ కుహనా వాద కథనాలను ప్రసారం చేయడం మెల్లమెల్లగా మొదలు పెట్టి ప్రజలలో అపనమ్మకాన్ని కలిగించే ప్రయత్నాలు చేస్తారన్న వాస్తవాన్ని గ్రహించి చారిత్రకంగా ఏర్పడిన ఈ బహుజన లెఫ్ట్ ఐక్య సంఘటన బాధ్యులు అలాంటి ప్రసారాల చీడపీడల బారిన తమ ఉద్యమం పడకుండా తమ సంఘటనను అనునిత్యం గమనిస్తూ అవకాశాన్ని తమకు తాముగా ఇవ్వకూడదని ప్రేమపూర్వక హెచ్చరిక చేస్తూ నేను 80వ దశకంలో రాసిన 'నీలి లాల్ జెండా' పాట సారాంశం సాకారమైనందుకు సంతోషిస్తూ ఈ సంతోషాన్ని భవిష్యత్ వేల తరాల వారు నిరంతరం పొందుతూ ఉండాలని ఆకాంక్షిస్తూ....

సెల్: 9391137654

మొట్టమొదటి వైతాళికురాలు



తోకల రాజేశం

దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనంతు దైవతం
తన్మంత్రం బ్రాహ్మణాధీనం
బ్రాహ్మణో మహదేవతా!

ఈ జగత్తు మొత్తం దైవాధీనంలో ఉంది. ఆ దైవం మంత్రం (శ్లోకం) ఆధీనంలో ఉంది. ఆ మంత్రం బ్రాహ్మణుడి ఆధీనంలో ఉంది. కాబట్టి మన దేవుడు బ్రాహ్మణుడే. ఇలాంటి శ్లోకాలు రాసుకొని కొన్ని వందల ఏండ్లపాటు మెజార్టీ ప్రజలను దేవుని పేరు మీద మోసం చేశారు. కుల విధానం వర్ణ వ్యవస్థ అంత్యంత పవిత్రమైవని మనువుతో చెప్పించారు.

శూద్రులు అతి శూద్రులకు ఆకాశంలో సగభాగమైన స్త్రీలకు చదువుకునే హక్కును నిరాకరించారు. పొరపాటున ఎవరైనా నాలుగు అక్షరం ముక్కలు నేర్చుకుంటే వాళ్లను కఠినాతి కఠినంగా శిక్షించే అన్యాయ సూత్రాలను వాళ్ల సొంత గ్రంథాలనిండా పొందుపర్చుకున్నారు. మొత్తానికి బ్రాహ్మణే తరులైన ప్రజలందరూ ఏ విధంగా కూడా సంఘటితం కావడానికి వీలులేని, చైతన్యవం తులు కావటానికి అవకాశం లేని ఒక దుర్మార్గమైన వ్యవస్థను నిర్మించి దీనికి మద్దతుగా అనేక గ్రంథాలను రాసి మనచేత బలవం తంగా దేవుని పేరు చెప్పి ఆమోదింపజేసుకున్నారు. వీళ్ల కుట్రలను సంపూర్ణంగా అర్థం చేసుకున్నది మన దేశ చరిత్రకు సంబంధిం చినంత వరకు ప్రాచీన కాలంలో బుద్ధుడు, ఆధునిక కాలంలో జ్యోతిబాపూలే దంపతులు. ఈ నేపథ్యంలోనే జ్యోతిరావు పూలే తన 'గులాంగిరి' పుస్తకంలో "శాశ్వతంగా ఈ దేశ ప్రజలను బానిసత్వం లో ఉంచే తమ పథకం నెరవేర్చుకోవటానికి, తాము సుఖంగా జీవించడానికి బ్రాహ్మణులు కులాల విభజన సృష్టించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ అంశంపై అనేక పుస్తకాలు కూడా వారు రచించారు" అని అన్నాడు. ఈ కుట్రలో భాగంగానే ఉత్పత్తి కులాల ప్రజలకు చదువును నిరాకరించటం జరిగిందన్న స్పష్టమైన అవగాహన ఆ కాలంలోనే (1840-50 ప్రాంతంలో) పూలేకు ఉండటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించే విషయం. నిమ్న కులాల ప్రజలను ఒక పథకం ప్రకారమే విద్య నుంచి బహిష్కరించటం జరుగుతోందని వివరిస్తూ తాను రాసిన ఒక విజ్ఞాపన పత్రాన్ని అప్పుడు విద్యారంగ సంస్కరణల కోసం ఏర్పాటైన హంటర్ కమిషన్‌కు 1883లో సమర్పించారు. జ్యోతిబాపూలే ముఖ్యంగా రెండు రంగాలను ప్రధానం చేసుకొని తన ఉద్యమ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఒకటి ప్రజలను తరతరాలుగా వంచిస్తున్న బ్రాహ్మణీయ భావజాలం అసలు స్వరూపాన్ని బహిర్గతం చేయడం. దీని కోసం ఆయన అనేక కార్యక్రమాలను రూపొందించటమే కాకుండా అద్భుతమైన రచనలు చేశాడు. రెండవది తరతరాలుగా చదువుకు దూరమైన ప్రజలకు ముఖ్యంగా స్త్రీలకు విద్యనందిం చటం. ఈ ఆశయం కోసం తన భార్య సావిత్రీబాయి పూలేను ముందు నిలబెట్టాడు. స్త్రీలు విద్యావంతులైతే పరాయి వాళ్లకు ఉత్తరాలు రాసే ప్రమాదం ఏర్పడుతుందనీ, స్త్రీ చదువుకోవటం వల్ల వచ్చే పాపం ఫలితంగా ఆమె భర్త తినే అన్నం పురుగులుగా మారిపోతుందనీ, అతడు రోగగ్రస్తుడై అకాల మరణం చెందుతా డన్న మూఢ నమ్మకాలు ప్రచారంలో ఉన్న కాలంలో ఎంతో ధైర్యంతో తన భార్యకు చదువు చెప్పాడు పూలే. ఆనాటి కాలానికి శూద్రుడైన పూలే చదువుకోవటమే ఒక వింత. ఒక ముస్లిం ఉపా ధ్యాయుడు, మరొక క్రైస్తవ ఉపాధ్యాయుడు పూలే తండ్రిని ప్రోత్స హించటం వల్ల ఆ వింతకు అంకురార్పణ జరిగింది. అయితే బాలిక లకు చదువు చెప్పటానికి ఉపాధ్యాయురాళ్లు ఎవ్వరూ లేకపోవటం వల్లనే ఆ లక్ష్యం కోసం చదువురాని సావిత్రీబాయిని ఉపాధ్యాయినిగా మలిచాడు పూలే. సావిత్రీబాయి ప్రధానోపాధ్యాయినిగా 1848లో పూనెలో మొట్టమొదటి బాలికా పాఠశాలను ప్రారంభించారు. మొట్టమొదట 9మంది విద్యార్థినులు మాత్రమే అందులో చేరారు. అయితే బ్రాహ్మణుల కుట్రల ఫలితంగా స్త్రీ విద్య కోసం కృషి చేస్తున్న సావిత్రి మీద సమాజం నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు వచ్చేవి. చెప్పరాని మాటలతో ఆమెను నిందించేవాళ్లు. ఇంటి నుంచి బడికి వెళ్తున్న ఆమె మీద రాళ్లూ, మట్టి, బురద చల్లేవారు. అందుకే ఆమె బడికి వెళ్లేటప్పుడు పాత చీర ధరించి, ఇంకొక చీరను తన వెంట తీసుకెళ్లేది. తనను ఎన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా సావిత్రి భయపడేది కాదు. ఈ రకంగా భారతదేశ చరిత్రలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా సావిత్రీ బాయి పూలే బడుగు బలహీన వర్గాల విద్య కోసం తన జీవిత పర్యంతం కృషి చేసింది.

బలహీనులారా! బాధితులారా! సోదరులారా! లేవండి
బానిసత్వ బంధనాలు తెంచుకొని కదలండి
మనువాదులూ, పీష్వాలు కాలగర్భంలో కలిశారు
ఆ మనువే మనల్ని విద్యకు దూరం చేశాడు

అంటూ ప్రజలను చైతన్యవంతం చేసే కవిత్వం కూడా రాసింది సావిత్రి. ఈమె రాసిన కవితలు 1854లో 'కావ్య పూలే' పేరుతో సంకలనం అయ్యాయి. భారత సాహిత్య చరిత్రలో ఆధునిక భావాలతో కవిత్వం రాసిన మొట్టమొదటి కవయిత్రి కూడా సావిత్రిబాయే కావొచ్చు. ఆనాటి బాల్య వివాహాల సంప్రదాయం వల్ల ఎందరో స్త్రీమూర్తుల జీవితాలు బలవుతూ ఉండేవి. ముసలి మొగుళ్లు చనిపోతే వితంతువులైన ఆడవాళ్ల మీద ఇంటిలో బయటా అనేక దుర్మార్గాలు జరుగుతూ ఉండేవి. నిర్బంధ లైంగిక సంబంధాల వల్ల గర్భవతులయ్యే వితంతు స్త్రీల కోసం 1853లో ఒక శరణాలయాన్ని స్థాపించారు పూలే దంపతులు. ఆ శరణాలయంలో పిల్లలను చూసుకునే విధానం గురించి ధనుం జయ్‌కర్ ఇలా అంటారు. సావిత్రీబాయి స్వంత తల్లిలా శరణాల యంలోని పిల్లలపై ఎనలేని శ్రద్ధ చూపేది. ఆమెకు సంతానం కలగలేదు కానీ పసి పాపల మీద ఆమె చూపే ప్రేమ కరుణ అపారమైనది. పూలే దంపతులు ఒక బ్రాహ్మణ వితంతువుకు పుట్టిన పిల్లాడిని 1874లో దత్త పుత్రునిగా స్వీకరించారు. ఆయన పేరు యశ్వంత్. పూలే 1873 సెప్టెంబర్ 24న సత్యశోధక సమాజ్ అనే సామాజిక, ఆధ్యాత్మిక కేంద్రాన్ని ప్రారంభించారు. సత్యశోధక సమాజ్ సభ్యులకు అనేక సామాజికోద్యమాల్లోకి నడిపం చటంలో సావిత్రి కృషి ఎంతో ఉంది. 1896-97 కాలంలో కరువు, ప్లేగు వ్యాధి వ్యాపించిన సందర్భాల్లో సావిత్రీబాయి నాయకత్వంలో ఈ సమాజం చేసిన కృషి చాలా గొప్పది. సత్యశోధక సమాజపు మహిళా విభాగం సావిత్రీబాయి నేతృత్వంలో నడిచేది. భారతదే శంలో మొట్టమొదటి సారిగా పు రోహితుడు లేకుండా పెండ్లి వం టి శుభకార్యాలను జరిపించే పద్ధతిని కూడా ఈ సమాజం ద్వారా పూలే దంపతులే ప్రవేశపెట్టారు. ఆనాటి కాలానికి ఎదురీది విప్లవ స్ఫూర్తితో సావిత్రిబాయి పూలే చేసిన సామాజిక, సాంస్కృతిక సేవల వల్ల భారతదేశంలోనే మొట్టమొదటి వైతాళికురాలిగా గుర్తింపు పొందింది.


సెల్: 9676761415

సాయుధ పోరాట యోధులు తొట్ల మల్సూరు



యం.వి.రమణ

తొట్ల మల్సూర్ ఉమ్మడి నల్లగొండ ప్రస్తుత సూర్యాపేట జిల్లా తుంగతుర్తి తాలూక నూతన కల్లు మండలం చిల్పకుంట్ల గ్రామంలో 1924 సం॥లో మల్ల య్య కనకమ్మల తొలి సంతానం. నిరుపేదకు టుంబంలో జన్మించారు. పాలేరుగా తన జీవితాన్ని ప్రారంభించి ప్రజా ఉద్యమ నాయకుడిగా ఎదిగాడు. తన 17 ఏట నిజాం సర్కారు ఏలుబడిలో విస్నూరి దొరల కుటుంబాలు ఎర్రబాడు, జానారెడ్డి భూస్వాముల పెత్తందారీ విధానం కింద గ్రామాలు నలుగుతున్న కాలంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఏర్పడిన గుత్ప సంఘంలో సభ్యుడిగా చేరాడు. అనాటి సూర్యాపేట ప్రాంత కమ్యూనిస్టు నాయకులు మద్దికాయల ఓం కార్, భీంరెడ్డి నర్సింహారెడ్డి శిక్షణలో కమ్యూనిస్టు గెరిల్లాగా మారి దళసభ్యులుగా పనిచేశారు. మొదట భీంరెడ్డి నర్సింహారెడ్డి దళంలో వున్న మల్సూర్ దళనాయకుడి స్థాయికి ఎదిగాడు. ఆనాడు ఆయుధాలలో ప్రధానమైన స్టెన్‌గన్‌ను ఇతనికి కేటాయించారు. దాంతో స్టెన్‌గన్ మల్సూర్‌గా గుర్తింపు పొందారు.



నిజాం వ్యతిరేక పోరాటాలలో సూర్యాపేట, జనగామ తాలూ కాలలో ప్రధానమైన ప్రాంతాలలోకి వెళ్లి ప్రజ ల పక్షాన నిలిచిన గెరిల్లా దళం నాయకుడిగా మూడు సంవత్సరాలపాటు పనిచేశాడు. ఆత్మకూరు మండలం పాతర్లపాడు ఎన్‌కౌంటర్‌లో గొట్టిముక్కల గోపాల్‌రెడ్డి అశువులు బాయగా మల్సూరుతోపాటు మరో ఇద్దరు కార్యకర్తలు అరెస్టయ్యారు. సూర్యాపేట పోలీసు క్యాంపులో అనేక చిత్రహింసలకు గురైన తర్వాత ఖమ్మం ఓపెన్ జైలుకు తరలించారు. అక్కడినుండి కర్నాటకలోని గుల్బర్గా జైల్లో కొంత కాలం వుంచి అటు తర్వాత మహారాష్ట్రలోని జాల్నా జైలుకు పంపించారు. పేదరికంతో చదువు సంధ్యలులేని మల్సూరు జైలులో కమ్యూనిస్టు పార్టీ నాయకులద్వారా చదువు నేర్చుకున్నారు. 3వ తరగతి వరకు జైల్లోనే చదివాడు. 1976లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో 16 నెలలపాటు చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, మంచికంటి రాంకిషన్‌రావు, బోడేపూడి వెంకటేశ్వరరావు, డా॥వై.రాధా కృష్ణమూర్తి ఎం.ఓంకార్, నర్ర రాఘవరెడ్డితో సెంట్రల్‌జై ల్లో నిర్బంధించబడ్డారు. ఆ కాలంలో ఆయన ఇంగ్లీషు నేర్చుకున్నాడు. పాఠశాలకు వెళ్లకున్నా ప్రజా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యా వంతుడిగా పేరుపొందారు.

1960వ సంవత్సరం నుండి కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ కొంత కాలంపాటు కల్లుగీత వృత్తిని కొనసాగించారు. పూర్తికాలం కార్యకర్తగా మారి సూర్యాపేట, తుంగతుర్తి తాలూకాలో పార్టీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారు. సీపీఐ(ఎం) పక్షాన ఆయన తుంగతుర్తి పంచాయతీ సమితికి 1979, 83లలో అధ్యక్షుడిగా దొరలపై పోటి చేశారు. తన స్వగ్రామం చిల్పకుంట్ల గ్రామపం చాయతీకి సర్పంచ్‌గా, ఎల్కపల్లి సింగిల్ విం డోకి చైర్మన్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. 1995లో నూతన కల్లు జెడ్పీటీసీ సభ్యునిగా నల్లగొండ జిల్లా పరిషత్‌కు ఎన్నికయ్యారు. ప్ర జాఉద్యమంలో అగ్రభాగాన ఉంటూ తనకు టుంబ సభ్యులం దర్నీ పార్టీ వైపుకు మళ్లించారు. 1957 సం॥లో ఖమ్మం జిల్లా గార్లలో జరిగిన ఏపీ కల్లుగీత కార్మికసంఘం మొదటి రాష్ట్ర మహాసభలో పాల్గొన్నారు. ఆనాడు వేలంపాటల విధానానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలలో, గీతకార్మికుల సమస్యల పరిష్కారం కోసం జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొ న్నారు. 1978 సం॥ ఆగస్టు 25న హైదరాబాద్‌లో జరిగిన ఏపీ కల్లుగీత కార్మిక సంఘం 2వ రాష్ట్ర మహాసభ లో అధ్యక్షుడిగా ఎన్నికై 1986లో జరిగిన 6వ మహాసభ వరకు కొనసాగారు. 11-3-1999 సంవత్సరం మరణించేవరకు సంఘం ఉపాధ్యక్షునిగా పనిచేశారు. గీతకార్మి కుల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరా డా రు. ఆయన భార్య ఎల్లమ్మ వ్యవసాయ కార్మిక సంఘం, కల్లుగీత కార్మిక సంఘం మహిళా సంఘాలలో పనిచేశారు. ఆమె ఆత్మకూరు, నా గారం పంచాయతీకి కోఅప్షన్ సభ్యురాలిగా మూడుసార్లు ఎన్నికయ్యారు. మల్సూర్ పెద్దకుమారుడు ప్రజాశక్తి దినపత్రి కలో జర్నలిస్టుగా పనిచేశారు. ఇటీవల ఆనారో గ్యంతో మరణిం చారు. 2వ కుమారుడు కల్లు గీత కార్మికసం ఘం రాష్ట్రకమిటీ సభ్యుడిగా పనిచేస్తూ ప్రస్తుతం స్వగ్రామం చిల్పకుంట్ల గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా వున్నారు. నూతనకల్లు మండల కేంద్రంలో మల్సూర్‌గా రి పేరుతో స్మారక విజ్ఞా న కేంద్రం నిర్మించారు. ఇది ప్రజల సమస్యల పరిష్కారానికి కేం ద్రంగా భాసిల్లుతున్నది. శ్రమకు ఫలితం కావాలన్నాడు. కష్ట జీవుల పక్షాన నికరంగా నిలబడి జీవితాంతం కమ్యూనిస్టుగా బతికాడు. నేటితరం వారి అడుగుజాడల్లో నడవాలి. అదే తొట్ల మల్సూర్‌కి ఇచ్చే ఘనమైన నివాళి.

సెల్: 94900 98485

సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే




కిల్లె గోపాల్

చదువుల తల్లి, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయిపూలే జన్మదినం జనవరి 3ను మహిళా ఉపాధ్యాయ దినం గా ప్రకటించాలని టి-మాస్ కోరుతు న్నది. ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ఇండ్లలో దీపాలు వెలిగించాలని, మహిళా ఉపాధ్యా యులను సత్కరించాలని, సావిత్రిబాయి జీవిత విశేషాలను ప్రజలకు వివరించాలని టి-మాస్ కోరుతున్నది. సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే గొప్ప సామాజిక విప్లవకారులు, ఆదర్శ దంప తులు. మహరాష్ట్రలోని సతారా జిల్లా నామ్ గాంవ్‌లో ఒక రైతు కుటుంబంలో జనవరి 3, 1831లో సావిత్రిబాయి జన్మించింది. 1840సం॥లో ఆనాటి సాంప్రదాయాల ప్రకారం జ్యోతిరావు, సావిత్రిబాయిపూలేల వివాహం జరిగింది. అప్పటికి జ్యోతిరా వుకు 13సం॥లు, సావిత్రిబాయికి 9 సం॥లు. సావిత్రి బాయికి మొదటి గురువు పూలే. బాలికల కోసం పాఠశాలను ప్రారంభిం చాలని పూలే దంపతులు నిర్ణయించుకున్నారు. ఆ రోజుల్లో బాలికల కోసం కలకత్తా, బాంబే, నాసిక్, అహ్మద్‌నగర్, సూరత్ నగరాల్లో క్రైస్తవ మిషనరీలలో బాలికలకు ప్రవేశం ఉండేది. అయితే అవి విదేశీ క్రైస్తవులు నడుపుతుండడం వల్ల ఆ పాఠశాల లకు తక్కువ మంది బాలికలు వెళ్లేవారు. భారతీయ నిర్వహణ లో ప్రభుత్వ లేదా ప్రైవేటు పాఠశాలలు బాలికల కోసం ఉండేవి కావు. శూద్ర, అతిశూద్ర కుటుంబాల బాలికలకు ఉపయోగప డేవిధంగా పాఠశాలలను 1841లో పూనెలో ప్రారంభించారు. సావిత్రిబాయి ఆ పాఠశాల నిర్వహణ బాధ్యత చూసేది. 6 నెలలు మాత్రమే పాఠశాల నడిచి మూత పడింది. ఆ తర్వాత మరో భవనంలో పాఠశాల ప్రారంభించారు. ఈ పాఠశాల నిర్వహిస్తున్నందుకు అన్ని సామాజిక వర్గాలు ప్రధానంగా బ్రాహ్మణుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పాఠశాలకు వెళ్లే దారిలోనే రోజూ సావిత్రిబాయిని వేధించేవారు. పోకిరీలు రోడ్డుకు అడ్డంగా నిలిచి అసభ్య పదజాలంతో దూషించేవారు. బాలికల చదువు వల్ల ఎన్నో అరిష్టాలు జరుగుతాయని ప్రచారం చేసేవారు. ఈ వేధింపులు తట్టుకొని ఆమె పాఠశాల నిర్వ హించింది. ఈ సమయంలో పూలే ఆమెకు ధైర్యాన్ని కలిగించి ప్రేమతో ప్రోత్సాహాన్ని అందించేవారు. ఒక సారి పూలే ఒక బ్రాహ్మణ మిత్రుని వివాహానికి వెళ్లి ఊరేగింపులో పాల్గొనగా శూద్రుడవైన నీవు ఊరేగింపులో పాల్గొనకూడదని పూలేను అడ్డగించి అవమానపరిచారు. బ్రాహ్మణులు పూలే ఇంటికి వెళ్లి ఆయన తండ్రికి చెప్పగా వారు మంచి వారు కాబట్టి నిన్ను వదిలారు, అదే పీష్వాల కాలంలో అయితే బట్టలూడదీసి ఏనుగులతో తొక్కించేవారు అని కుమారున్ని హెచ్చరించాడు గోవిందరావు. కానీ సావిత్రిబాయికి పూలే ఆవేదన అర్థమైంది. ఆయన బాధ సరైందని బలపర్చింది. సామాజిక దురాచారాలపై పోరాడటానికి తాను కూడా తోడు నిలుస్తానని భరోసా ఇచ్చింది, ప్రోత్సహించింది. జీవితాంతం అండగా నిలిచింది. కొంతకాలం తర్వాత మిత్రుల నుండి, అభిమానుల నుండి పాఠశాల నిర్వహణకు ఆర్థిక సహాయం అందింది. ఒక ముస్లిం వ్యక్తి తన భవనాన్ని పాఠశాల కోసం విరాళంగా ఇచ్చాడు. 1851లో పాఠశాలను తిరిగి ప్రారంభిం చారు. 1852 నవంబర్ 16న విద్యాశాఖ ఆధ్వర్యంలో పూలే దంపతులను ప్రభుత్వం శాలువాతో సత్కరించింది. 1853 ఫిబ్రవరి 12న పాఠశాలలను పరిశీలించిన పరీక్షాధికారులు తమ నివేదికలో ఇలా తెలియజేశారు. "బాలిక విద్యపై వ్యతిరేకత క్రమంగా తగ్గుముఖం పడుతుంది. ఉపాధ్యాయులు బాలికల ను సొంత బిడ్డలా ప్రేమించటం, బంత్రోతు ఎంతో ఆదరంగా వారితో ప్రవర్తించడం, పాఠశాల విద్యార్థినులకు చదువుపై ఆసక్తి పెరిగి సంతోషంగా విద్యనభ్యసిస్తున్నారు". విద్యార్థినులపై సావిత్రిబాయి ప్రభావం బలంగా ఉండేది. ఆమె దగ్గర చదువుకున్న ముక్తాబాయి అనే 11 ఏండ్ల దళిత బాలిక ఆనాటి సమాజంలో అస్పృశ్యులపై బ్రాహ్మణీయ పెత్తనాన్నీ, అరాచకాలను విమర్శిస్తూ అద్భుతమైన వ్యాసం రాసింది. ఆ వ్యాసాన్ని ఓ పత్రిక ప్రచురించింది. అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించడానికి 1843లో అనాథ శరణాలయంను ప్రారంభించారు. ఒక ఇంటిలో పని చేసే బ్రాహ్మణ వితంతువు గర్భవతి అయి సమాజానికి భయపడి ఆత్మహత్యకు తలపడుతుండగా పూలే దంపతులు రక్షించి తమ ఇంటిలో ఆశ్రయం ఇచ్చారు. ఆమెకు కలుగబోయే బిడ్డను తా ము పెంచుతామని భరోసా ఇచ్చారు. పూలే దంపతులు దత్తత తీసుకున్న ఆ పిల్లవాడే యశ్వంత్. కవయిత్రిగా, రచయిత్రిగా సావిత్రిబాయి సేవలు మరువరానివి. ఆనాటి సామాజిక పరిస్థి తులకు ఆమె కవిత్వం అద్దం పట్టింది. సావిత్రిబాయి పవన్‌కాశీ సుబోద్‌రత్నాకర్ మరో కవితా సంపుటిలో పూలే జీవితాన్ని వర్ణిం చింది. భారతదేశ చరిత్ర గురించి పూలే చేసిన ప్రసంగాలను తన సంపాదకత్వంలో రెండు సంపుటాలుగా వెలువరించింది. 1892లో ఆమె ఉపన్యాసాలు పుస్తక రూపంలో వచ్చాయి. మానవుల అభివృద్ధికి విద్య, శ్రమ ఎంత అవసరమో ఆమె పదేపదే నొక్కి నొక్కి చెప్పేది. "శ్రమించి పని చేయండి, శ్రద్ధగా అధ్యయనం చేయండి. మంచి మార్గంలో నడవండి" అని సావిత్రిబాయి సందేశం. పండుగకు, పబ్బాలకు, ఆర్భాటాల కోసం శక్తికి మించి ఖర్చు చేసి అప్పులపాలయ్యే వాళ్లను విమర్శిస్తూ "అప్పు" అనే వ్యాసం రాసింది. మూఢనమ్మకాలపై, దుర్వ్యసనాలపై ఆమె రాసిన వ్యాసాలు నేటికీ ఎంతో అనుసరణీయం. స్త్రీ సాధికారత కోసం ముఖ్యంగా వితంతువు పునర్వివాహం కోసం ఎంతో కృషి చేశారు. వితంతువులకు శిరోముండన చేయబోమంటూ క్షౌరకులు తిరుగుబాటు చేసేట్టుగా వారిని చైతన్య పరిచి 1860లో సావిత్రిబాయి వీరితో ఒక సమ్మె నిర్వహించింది.

1890 నవంబర్ 28న మహాత్మాపూలే మరణించారు. ఆయన అంత్యక్రియలు సావిత్రిబాయి నిర్వహించింది. భర్త చితికి భార్య నిప్పు పెట్టడం భారతదేశ చరిత్రలో అతి అరుదైన సంఘటన. పూలే మరణానంతరం సత్యశోధక్ సమాజ్ బాధ్యతలన్నింటినీ సావిత్రిబాయి స్వీకరించింది. 1897లో పూనేలో అంటువ్యాధులు విజృంభించాయి. రోగులకు సేవ చేయటంలో సావిత్రిబాయి రాత్రింబవళ్లు పని చేసింది. ఆ సందర్భంలో ఆమెకు ప్లేగు సోకింది. చివరికి 1897 మార్చి 10న సావిత్రిబాయి కన్ను మూసింది. సావిత్రిబాయి జీవితం భావితరాలకు ఉత్తేజాన్నిస్తుంది. తన భర్త ఆశయాలకు తోడు నిలవడమే కాకుండా ఆమె స్వయంగా సామాజిక విప్లవోద్యమ నాయకురాలిగా ఎదిగింది. ఎన్నో అవరోధాలు, ఆటంకాలు ఎదుర్కొని నిలిచింది. భారతదేశంలో ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించిన తొలి మహిళ. ఆమె నాయకురాలు, రచయిత్రి, తాత్వికురాలు. ప్రపంచాన్ని మార్చే మహత్తరమైన సిద్ధాంతాన్ని రాసే సందర్భంగా మార్క్స్‌కు జెన్నీ అడుగడుగునా అండగా నిలిచింది. భారత సమాజాన్ని అర్థం చేసుకుని ఇక్కడి కుల వ్యవస్థపై పోరాడటానికి, నిమ్నవర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి చేసిన మహత్తర పోరాటం సందర్భంగా తమ పిల్లవాడు మృతి చెంది, ఇంట్లో శవం ఉన్నా 2వ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరు కావడమే ముఖ్యమని కష్టాలను, కన్నీళ్లను దిగమింగి అంబేద్కర్‌ను ప్రోత్సహించింది రమాబాయి. భారతదేశ సామాజిక ఉద్యమ నిర్మాత మహాత్మా జ్యోతిరావుపూలేకు సావిత్రిబాయి కూడా అండగా నిలిచింది. వారి ఆదర్శ జీవితం బావితరాలకు స్ఫూర్తినిచ్చేదిగా అజరామరంగా నిలిచి ఉంటుంది. "తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని ఎన్నో విధాలుగా అర్థం చేసుకున్నారు, వ్యాఖ్యానించారు కానీ అసలు విషయం దాన్ని మార్చటం ఎలాగన్నదే ముఖ్యం" అన్న విప్లవ తాత్వికుడు మార్క్స్ హృదయఘోషకు అద్భుతమైన రూపాలుగా జెన్నీమార్క్స్, సావిత్రిబాయి పూలే, రమాబాయి జీవితాలు నిలుస్తాయి.

సెల్: 9490098760

మహిళల మహోన్నత శిఖరం సావిత్రిబాయి



ప్రొ॥ప్రభంజన్ యాదవ్

దేశాన్ని, ప్రకతిని స్త్రీతో పోలుస్తం. మన దేశాన్ని భారత'మాత' అని కూడా అంటరు. భారత'మాత' అనే భావనకు నిలువెత్తు రూపం సావిత్రిబాయిపూలే. ఆమె హిమాలయాలకన్నా మహోన్నత శిఖరం. దేశంల తొలి సామాజిక విప్లవ మాత. పూనె పట్టణంల ప్లేగు వ్యాధి సోకి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నరు. గట్లనే ఒక బాలిక ప్లేగు బారినపడి విలవిలాడుతాంది. అది చూసి సావిత్రి హదయం చలించింది. మా త ప్రేమ కదా! ప్లేగు ప్రాణాంతక వ్యాధి అని తెలుసు. ఆ వ్యాధి తననూ కబలిస్తుందనీ తెలుసు. అయినా ఆ బిడ్డను సావిత్రి భు జాన ఎత్తుకున్నది. వైద్యం కోసం తన కొడుకు డాక్టర్ యశ్వంతు దగ్గరికి తీసుకపోయింది. వైద్యం చేస్తూనే డాక్టర్ యశ్వంతు "అమ్మా! ఈ బాలికకు తల్లిదండ్రులు లేరా? అని ప్రశ్నించిండు. "ఉ న్నరు బిడ్డా" సావిత్రి సమాధానం. "మరి నువ్వు తీసుకొచ్చినవ్. ప్లేగు అంటు వ్యాధి. నీకూ సోకే ప్రమాదం ఉంది కదా". "తెలు సుబిడ్డా! అందుకే ఆ పిల్లను వదిలేసిపొమ్మని ఆ తల్లిదండ్రులకు చెప్పి, నేనే తీసుకొచ్చిన". తాము చనిపోతామని తెలిసి కన్నవాళ్లే వదిలేస్తే నువ్వెందుకు తీసుకొచ్చినవ్?" "ఆ తల్లిదండ్రులకు ఇంకా ముగ్గురు పిల్లలు ఉన్నరు. కన్నవాళ్లకు వ్యాధి సోకి చనిపోతే ఆ పిల్లలు అనాథలైతరు. అందుకే నేనే వద్దన్న బిడ్డా" అని చెప్పిన మ హా త్యాగశీలి సావిత్రి. పిల్లలు లేని అమ్మప్రేమ ఆమెది. ప్రాణాన్ని తృణపాయంగా భావించింది. ఆర్యబ్రాహ్మణీయ పురుషాధిపత్య సమాజం 'సరస్వతీ దేవిని చదువులదేవత'గా కొలుస్తున్నది. కానీ బాలికల విద్యను ప్రోత్సహించలేదు. పైగా బాలికలకు చదువును నిరాకరించింది. సమాజంల సగభాగామైన మహిళలు అభివద్ధి చెందకుండా సమాజం పురోగతి చెందదని పూలే నమ్మిండు. అం దుకే స్త్రీలు విద్యావంతులు కావాలని భావించిండు. ఇతరులకు ఆదర్శంగా ముందు తన భార్య సావిత్రిని చదివించిండు. సావిత్రి బాయిని 1846 -1847ల అహ్మదాబాద్‌ల టీచర్ ట్రైనింగ్ ఇప్పించిండు. ఆమెతోపాటు ఫాతిమాషేక్ అనే ముస్లిం మహిళ కూడా శిక్షణ పొందింది. పూలే దంపతులు 1848 జనవరి 1న పూణేల అంటరాని బాలికల కోసం పాఠశాలను ప్రారంభించిండ్లు. మగవాళ్లు బోధకులుగా ఉన్న బడులకు బాలికలను పంపించ లేమని తల్లిదండ్రులు తేల్చి చెప్పిండ్లు. అప్పటి వరకు భారతదే శంల మహిళా టీచర్లేలేరు. భారతదేశంల తొలి మహిళా టీచర్ సావిత్రి. ఆర్య బ్రాహ్మణ పురుషాధిపత్యం నుంచి విముక్తి సాధనం విద్య అని ప్రబోధించింది. స్త్రీవిముక్తి కోసం సావిత్రిబాయిపూలే అక్షరాన్ని ఆయుధంగా సంధించింది. పీష్వా (బ్రాహ్మణ)ల అవమానాలను, అకత్యాలను లెక్కచేయలేదు. సావిత్రిబాయిపూలే క్రాంతిజ్యోతి. చదువుల దేవత సరస్వతి ఓ కట్టుకథ. కానీ 'చదువు లతల్లి' సావిత్రిబాయిపూలే చారిత్రక సాక్ష్యం. సామాజిక సత్యం.

భారతదేశంల శూద్రులకు, అతిశూద్రులకు బ్రాహ్మణాధిపత్య సమాజంల విద్యార్హతలేదు. బ్రిటీష్ ప్రభుత్వం అణగారిన కులాలకు విద్య, విజ్ఞానం, వికాసం కోసం ఏటా లక్షరూపాయలు వినియోగించాలని నిర్దేశిస్తూ 1813ల చట్టంచేసింది. దాంతో శూద్రులకు, అతి శూద్రులకు చదువుకునే అవకాశాలు కలిగినై. ఆరేండ్ల వయసు నుంచే సావిత్రిబాయి పొలం పనులకు వెళ్లేది. పశు సంరక్షణ ఆమెకు ఇష్టం. చదువంటే చాలా ఇష్టం. 1840ల జ్యోతిరావుకు, సావిత్రికి పెండ్లి అయింది. ఆనాడు సమాజంల బాల్యవివాహాలు సర్వసాధారణం. ఆ బాలదంపతులిద్దరికి తల్లి ప్రేమను పంచి సామాజిక విప్లవకారులుగా తీర్చిదిద్దిన మహాసాధ్వి సగుణా బాయి. ఆమె గోవిందరావుకు సమీప బంధువు. బాల్య వితంతువు. మంచి పెంపకం, శిక్షణల పెరిగిన పూలే దంపతులు బహుజనుల విముక్తిమార్గంల వేగుచుక్కలు, వెలుగురేఖలు. స మాజహితం కోరిండ్లు. సకల వివక్షలపై సమరభేరి మోగించిం డ్లు. అసమానతలపై అలుపు ఎరగకుండా పోరాడిండ్లు. బ్రాహ్మ ణాధి అగ్రకులాల దురహంకారాన్ని ప్రశ్నించిండ్లు. దుర్మార్గపు సనాతన ధర్మాలను ఎదిరించిండ్లు. నీచ, కుటిల సంప్రదాయలను వ్యతిరేకించిండ్లు. స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్నరు. 'సత్యశో ధక సమాజాన్ని' స్థాపించిండ్లు. దీనులకు బాసటగా నిలిచిండ్లు. అత్యాచారాలకు బలైన విధవలను ఆదరించిండ్లు. అక్రమంగా గర్భవతులైతే పురుడు పోసుకునే అవకాశం కల్పించిండ్లు. అక్రమ సంతాన హత్యలను ఆపించిండ్లు. దిక్కులేని అతివలకు, అనాథ శిశువులకు తమ సొంత ఇంటినే పునరావాసంగా మార్చిండ్లు. బాలికలను ముసలి వారికిచ్చి పెండ్లిచేయడంతో చాలామం ది అమ్మాయిలు వితంతువులుగా జీవితం గడపాల్సి వచ్చేది. కుటుంబంలోని మగవాళ్లు బలత్కరించుడుతో అక్రమంగా గర్భ వంతులు అయ్యేవాళ్లు. ఆ అవమానాన్ని భరించలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకునేవాళ్లు. కొందరైతే ఆ అక్రమ సంతానాన్ని చంపేసేవాళ్లు. ఇది పూలే దంపతులను బాగా కలిచివేసింది. అక్ర మంగా జన్మించిన శిశువులను చంపొద్దని పూలే దంపతులు పిలు పునిచ్చిండ్లు. తమ ఇంట్లో స్వేచ్ఛగా పురుడు పోసుకోవచ్చని, ఆ పిల్లలు వద్దనుకుంటే తమ వద్దే వదిలి వెళ్లవచ్చని ప్రకటించిండ్లు. కుల, మత, లింగ, ప్రాంత తదితర వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సత్యశోధక సమాజంల సభ్యత్వం కల్పించిండ్లు. వేదాలు పవిత్రం గా భావించడాన్ని పూలే వ్యతిరేకించిండు. సావిత్రి అన్ని విష యాలల్ల నిస్సంకోచంగా భర్తను అనుసరించేది. ఆయనంటే ఆమెకు అమితమైన ప్రేమ, నమ్మకం. పీష్వాల ఆధిపత్యాన్ని వ్యతిరే కిస్తున్న జ్యోతిరావ్‌ను తండ్రి గోవిందరావ్ ఇంటి నుంచి వెళ్లగొ ట్టిండు. ఏమాత్రం సంశయించకుండా భర్తను అనుసరించింది సావిత్రి.

సెల్: 9394243344 / 8639357648

అదీ తల్లీ పిల్లల బంధం!

రంగనాయకమ్మ

- 5 -

"ఎన్నాళ్లయింది ఇక్కడ చేరి?" "రెండున్నరేళ్లమ్మా! కూతురూ అల్లుడూ అప్పుడప్పుడూ వస్తూ వుంటారులెండి! ముగ్గురం బాగా మాట్లాడుకుంటూనే వుంటాం. నా ముందే కుర్చీల్లో కూర్చుంటారు" అని ఆవిడ చెప్తే, "మిమ్మల్ని బైటికి పంపేసిన వాళ్లతో మీరు మాట్లాడతారా?" అని ఆశ్చర్యపోతూ అడిగాను. "అప్పుడు పంపారుగానీ, ఇప్పుడు తీసుకు వెళ్లాలని ఆలోచిస్తున్నట్టు కనపడుతున్నారు, చూద్దాం!" అంది ఆవిడ. "అయ్యో! అంటే, మీరు వాళ్ల దగ్గరికి వెళ్తారా? అయ్యయ్యో! అలా వొద్దండీ! ఇక్కడ మీరు రెండున్నరేళ్ల నుంచీ వుంటున్నారు. ఇక్కడ అలవాటైంది మీకు. 90 ఏళ్లు దాటిన కన్నతల్లిని వదిలేసిన కూతురు, ఇంకా మీకు కూతురా? వాళ్లతో మాట్లాడటం కూడా చెయ్యగలుగుతున్నారా?" అని నేను అంటుంటే, ఆవిడ విచారంగానే దు్ఖం వచ్చిన కంఠంతో అన్నారు. "అసలు నేను ఇన్నేళ్లు ఎందుకు బతకాలి? ఎప్పుడో పోయి వుండవలిసింది కదా? నాకన్నా చిన్నవాళ్ళు, నా బంధువులెందరో పోయారు. నా కొడుకే పోయాడు. నేను మాత్రం బతికి వుంటున్నాను. కూతురైతే మాత్రం, వాళ్ల సరదాలన్నీ ఆపుకుంటూ ఎంత కాలం చూస్తారు నన్ను? నేను బతకడం నా తప్పంటారా?" అంటూ ఆవిడ విచారంగానే మాట్లాడారు. "మీరు బతకడం కాదు. మిమ్మల్ని వదిలేసిన కూతురి దయ కోసం ఇంకా ఎదురు చూడడమే మీ తప్పు!" అన్నాను. "ఏం చెయ్యను? ఇక్కడే పోతే ఏమవుతానో చెప్పండి!" "ఏమవుతారు? వీళ్లకే మీ బ్యాంకు డబ్బు అంతా రాసెయ్యండి! మీ అంత్యక్రియలు వీళ్లే జరుపుతారు. భూమి ఎక్కడైనా ఒకటే. దహనం అయినా, ఖననం అయినా, భూమిలో కలిసిపోతాం. మీకు మరణమే జరిగితే, మీ కూతురికి తెలియక్కరలేదని వీళ్లకి చెప్పండి!" అంటూ నేను కోపంగా మాట్లాడాను. ఆవిడ విచారంగా నవ్వారు. "కోపాలు పెట్టుకుంటే ఎలాగమ్మా? నా కూతురి చేతుల్లో పోవాలని నాకు వుండదా? మనకి కూడా 'స్వార్థం' వుండాలమ్మా, స్వార్థం వుండాలి!" అన్నారు.

" 'స్వార్థం' కాదు, మనిషి జన్మ ఎత్తిన వాళ్లకి 'ఆత్మ గౌరవం' వుండాలి. కూతురి చేతుల్లో పోతే, 'స్వర్గం' వొస్తుందనుకుంటున్నారా?" "స్వర్గమా, నా మొహమా? ఇప్పటికే నవ్వుతున్నారు నలుగురూ. మా ఆయన ఎంత గొప్ప రచయితో మీకు తెలుసుగా? అలాంటి ఆయన పెళ్లానికి ఈ గతి పట్టిందా అనుకుంటాను నేను రోజూ." "మీ ఆయన ఎంత గొప్ప రచయితో నాకు తెలీదు గానీ, ఆయన గొప్పవాడు కాబట్టి ఇలా జరగకూడదని కాదు కూలి వాడి కూతురు కూడా తల్లికి ఇంత ద్రోహం చెయ్యకూడదు. 90 ఏళ్ల మనిషికే కాదు చిన్న వయసు మనిషికైనా ఇలా జరగకూడదు. మీరు బాధ పడుతున్నారు గానీ, కూతురు మీద కోపం ఎందుకు రావడం లేదో అర్థం కావడం లేదు నాకు." "కోపాలొచ్చి ఏం చేస్తాం? కాటికి కాళ్లు చాచుకుని కూర్చున్నాను. కాలం మారిపోయింది. మా అమ్మని నేను చివరి కాలంలో ఎంతో ముద్దుగా చూసుకున్నాను. నాకా భాగ్యం దొరకలేదు. మొన్న నన్ను తీసికెళ్లి వాళ్ల ఇంటికి దగ్గరగా వుండే ఆశ్రమంలో పెడతానంది. దగ్గరైతే, అప్పుడప్పుడూ వచ్చి కనపడుతుంది కదమ్మా?" "ఏం మాట్లాడుతున్నారండీ! మతిపోయింది మీకు. మీకు ముద్దుల మనవరాలు వుంటుందిగా? దానికి తెలీదా ఇదంతా? తల్లిని ఆ పిల్ల మందలించిందా? 'అమ్మమ్మని ఆశ్రమంలో పెట్టావా? నీ మొహం నేనెప్పుడూ చూడను' అని తల్లికి గడ్డి పెట్టిందా?" "పెట్టిందేమో, మనకేం తెలుస్తుంది?" "తల్లికి గడ్డి పెట్టి వుంటే, ఆ మాట మీకు చెబుతుందిగా? ఆ మనవరాలికి మీరంటే చాలా ప్రేమ అని చెబుతారు మీరు." "నా మీద ప్రేమ వుంటే మాత్రం కన్నతల్లిని ఏమనగలుగుతుందమ్మా?" "మీ కూతురైతే, కన్నతల్లిని వదిలేస్తుంది! 'భర్త మాట వినక తప్పదు కదా?' అంటారు. మనవరాలైతే, కన్నతల్లికి ఎదురు చెప్పదా? ఇంత లొంగి పోయి వుంటే, వాళ్లెందుకు మిమ్మల్ని లెక్క చేస్తారండీ? ఇక, ఇక్కడే వుండిపోండి! వాళ్లు రమ్మన్నా వెళ్లకండి! మీ గౌరవం మీరే కాపాడుకోవాలి! అసలు వాళ్ల మొహాలు చూడకండి!" "పిలిస్తే వెళ్తే తప్పేముందమ్మా? నాకూ ఒక 'ఇంట్లో' వుండాలనిపిస్తుంది కదా?" "ఇదే నా ఇల్లు' అనిపించాలి మీకు! వాళ్ల ఇల్లు మీకెందుకు? మళ్లీ ఎప్పుడు గెంటేస్తారో మీరు చెప్పగలరా?" ఆవిడ వూరుకుంది.

"మీకు 'ఇల్లు' లాంటిది కావాలంటే, మీకు స్నేహితులు వున్నారు. మీకు డబ్బు వుంది. వాళ్లకి డబ్బు ఇచ్చి, వాళ్ల ఇంట్లోనే మీ కోసం ఒక గది ఏర్పాటు చేయమనండి! స్నేహితుల దగ్గర వుంటే, ఒక ఇంట్లో వున్నట్టే వుంటుంది మీకు." "అదీ పరాయివాళ్ల ఇల్లే గానీ, కూతురు ఇల్లు అవుతుందా?" "పోనీ, మీరు మా ఇంటికి వచ్చేస్తారా? కబుర్లు చెప్పుకుంటూ వుందాం." "మీరు మందలింపులే చేస్తారు, నాకేం కబుర్లు చెపుతారు?" అని నవ్వింది. "మందలింపులు మాత్రం కబుర్లు కావా? మీ కూతుర్ని మందలించేవాళ్లు వుంటే, మీకు ఇలా జరిగేదా? సరేనండీ! మరి వుంటాను, దిగులు పడకండి!" అనేసి ఫోన్ ఆపేశాను. వెంటనే ఆ ఫోన్ నెంబరు ఇచ్చిన ఆవిడికి చేసి, అంతా చెప్పాను. "మీ ఇంటికైనా తెచ్చుకోరాదూ ఆవిణ్ణి? ఒక పని అమ్మాయిని పెట్టండి ఆవిడ కోసం. ఆ డబ్బు ఆవిడ పెట్టగలదు. ఆశ్రమంలో కాకుండా ఇంట్లో వుండాలని ఆవిడికి అనిపిస్తోంది" అన్నాను. "రమ్మంటే వస్తారా? ఆవిడ రారు" అన్నారు ఈవిడ. "అయితే, ఆ కూతుర్ని మీరు మందలించరాదూ? మీకు బాగా తెలిసిన వాళ్లేగా?" "తెలిసినవాళ్లే గానీ, 'తల్లిని వదులుకోవద్దు' అనే మాట ఒకరు చెప్పాలా? చెప్తే వింటారా?" అన్నారు. "నిజమే గానీ, ..." అని నేనూ వూరుకున్నాను. ఒక నెల లోపలే, ఈవిడ ఫోన్ చేసి, "ఆవిణ్ణి కూతురు తీసుకెళ్లిందండీ! ఇవ్వాళే తెలిసింది నాకు" అన్నారు. "ఎందుకంటారు? రెండున్నరేళ్ల నించీ వదిలేసిన మనిషికి అంత దయ కలిగిందా?" అన్నాను.

" 'దయ' అయితే, ఇన్నేళ్లకా? అప్పుడప్పుడూ వాళ్లూ వీళ్లూ వెళ్లి పెద్దావిణ్ణి చూస్తున్నారు కదా? 'వాళ్లొచ్చి చూశారు' అని ఈవిడ కూతురికి ఫోన్ చేసి మరీ చెబుతారు. మీరు మాట్లాడినట్టు కూడా చెప్పి వుంటారేమో! ఒకరు వచ్చి చూస్తే, కూతురికి భయమా ఏమిటోగానీ, 'ఇంకెన్నాళ్లు బతుకుతుందిలే' అనుకుని తీసుకువెళ్లిందేమో!" అన్నారు ఈవిడ! అదీ, తల్లీ పిల్లల బంధం! ఈ నిజం తెలుసుకుని, పిల్లల్ని కనడం మానెయ్యడం మంచిది! వృద్ధుల ఆశ్రమాలు పెరిగిపోతున్నాయి అంటే అర్థం ఏమిటి? 'పిల్లలు దండగ' అని అర్థం కాదూ? పిల్లలే అవసరం అయితే, ఆశ్రమాలెందుకు? ఆశ్రమాలే అవసరం అయితే, పిల్లలెందుకు? ఇప్పుడు ఆశ్రమాలు కనపడుతున్నాయి గానీ, ఆశ్రమాలు తలెత్తని కాలంలో కూడా తల్లీపిల్లల బంధాలు ఇలాగే ఏడ్చి వుంటాయి. కొన్ని కుటుంబాల్లో, పిల్లలే బానిసలు! కొన్ని కుటుంబాల్లో బానిసలు తల్లులే! తండ్రులే! ఇదండీ, మానవ సమాజం!

(అయిపోయింది)

ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228

షో



జాంగ్ జియి..


అందం, అభినయంతో విశ్వ ప్రేక్షకుల్ని ఫిదా చేసిన కథానాయికే కాదు మెరుపువేగంతో శత్రువుని మట్టికరిపించే యాక్షన్ క్వీన్ కూడా. కమర్షియల్ చిత్రాల్లోని పాత్రలతో విలక్షణతను చూపిస్తూనే, మార్షల్ ఆర్ట్స్ చిత్రాల్లో పోరాడే యోధురాలిగా మహిళా శక్తిని చాటిన అసమాన నటి. అభిరుచిగల నిర్మాతగానూ విమర్శకుల ప్రశంసలను అందుకున్న చైనీస్ స్టార్ హీరోయిన్ జాంగ్ జియి గురించి ఈ వారం అందిస్తున్న స్పెషల్ షో..

మహిళా శక్తిని చాటిన అసమాన నటి..























మలుపు తిప్పిన తొలి చిత్రం..

చైనాలోని బీజింగ్‌లో పుట్టిన జాంగ్ జియి తండ్రి జాంగ్ యువాన్సువోయా అకౌంటెంట్. తల్లి లీ జుషెంగ్ టీచర్. చిన్నప్పట్నుంచి డాన్స్ పట్ల మక్కువతో శిక్షణ తీసుకుని 15 ఏండ్ల ప్రాయంలోనే జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచింది. దీంతో హాంకాంగ్ టెలివిజన్ ప్రకటనల్లో నటించే అవకాశాలొచ్చాయి. అలా బుల్లితెర ప్రేక్షకులకు పరిచయమైన జాంగ్ ఆ తర్వాత ప్రతిష్టాత్మక సెంట్రల్ అకాడమీ డ్రామా స్కూల్‌లో యాక్టింగ్ నేర్చుకుంటున్న తరుణంలో ప్రముఖ చైనీస్ దర్శకుడు జాంగ్ యిమౌ 'ది రోడ్ హోమ్' (1999) చిత్రానికి జాంగ్‌ని ఎంపిక చేశారు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాలో యుక్త వయసు అమ్మాయిగా జాంగ్ నటించింది. టీచర్‌తో ప్రేమలో పడే అమ్మాయిగా అమయాకత్వ నటనతో ప్రేక్షకుల్ని ఫిదా చేసింది. అంతేకాదు హండ్రెడ్ ఫ్లవర్స్ అవార్డునూ దక్కించుకుంది. బెర్లిన్ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై ఈచిత్రం సిల్వర్ బీర్ ప్రైజ్‌ను గెల్చుకుంటే, జాంగ్ వీక్షకుల మనసుల్ని దోచేసింది.

అంతర్జాతీయ గుర్తింపు..

పరిశ్రమలోకి అడుగిడి అతి తక్కువ టైమ్‌లోనే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన నటిగా జాంగ్ రికార్డు సృష్టించింది. 2000 సంవత్సరంలో విడుదలైన మార్షల్ ఆర్ట్స్ బేస్డ్ చిత్రాలు 'క్రౌచింగ్ టైగర్, హిడెన్ డ్రాగన్' చిత్రాలు జాంగ్‌ను స్టార్‌ను చేశాయి. అంతేకాదు ఆయా చిత్రాల్లో మార్షల్ విద్యలతో ఆమె చేసిన యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను మెస్మరైజ్ చేశాయి. ఈ చిత్రాలు జాంగ్‌కు హాలీవుడ్ ప్రవేశానికి మార్గాన్ని సుగమం చేశాయి. ఆ వెంటనే అమెరికన్ చిత్రం 'రష్ అవర్ 2'లో నటించే అరుదైన అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఆమె నటించిన తొలి అమెరికా చిత్రం కావడం ఓ విశేషమైతే, ఇందులో నెగటివ్ పాత్రను పోషించడం మరో విశేషం. హాలీవుడ్‌లోకి అడుగిడుతూనే ఓ సరికొత్త పాత్రలో విలక్షణమైన నటనను కనబర్చి ఆకట్టుకుంది. 2002లో హాంకాంగ్ నటుడు టోనీ లెంగ్‌తో కలిసి 'హీరో' చిత్రంలో నటించింది. ఈ చిత్రానికి జాంగ్ యిమౌ (ది రోడ్ హోమ్) దర్శకత్వం వహించారు. ఈ సినిమా భారీ విజయం సాధించింది. ఆస్కార్‌కు కూడా నామినేట్ అయ్యింది. గోల్డెన్ గ్లోబ్ అవార్డునందుకుంది. ఆ తర్వాత నటించిన మరో కమర్షియల్ చిత్రం 'పర్పుల్ బట్టర్‌ఫ్లై' కేన్స్‌లో ప్రదర్శితమైంది. ఆ తర్వాత తనకు మంచి పట్టున్న మార్షల్ ఆర్ట్స్ జోనర్‌లో 'హౌస్ ఆఫ్ ఫ్లైయింగ్ డాగ్గర్స్' చిత్రంలో నటించింది. ఈ చిత్రానికి కూడా జాంగ్ యిమౌనే దర్శకత్వం వహించడం విశేషం. చైనీస్ సూపర్ స్టార్ టకెషి కనెషిరోతో తొలిసారి జాంగ్ నటించిన చిత్రమిది. చైనీస్ టాప్ నటీనటులు నటించిన రొమాంటిక్ డ్రామా '2046' జాంగ్ నటించిన తన స్పెషాలిటీని మరోసారి చాటుకుంది. ఇందులో స్ట్రగుల్ పడే వేశ్యగా జాంగ్ బాడీ లాంగ్వేజ్, హావభావాలకు ప్రేక్షకుల అభినందనలతోపాటు విమర్శకుల ప్రశంసలూ దక్కాయి. అంతేకాదు హాంకాంగ్ ఫిల్మ్ అకాడమీ అవార్డు కూడా వరించింది. జాంగ్‌కు మంచి గుర్తింపు తెచ్చిన చిత్రాల్లో 'జాస్మిన్ ఉమెన్' మరొకటి. 'ఉమెన్ లైవ్స్' అనే నవల ఆధారంగా రూపొందిన చిత్రమిది. 2005లో విడుదలై విశేష ప్రేక్షకాదరణతో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత చేసిన 'ప్రిన్సెస్ రాక్యూన్' చిత్రం అనేక అవార్డులను దక్కించుకోవడంతోపాటు జాంగ్‌ను ఇంటర్నేషనల్ స్టార్ హీరోయిన్‌నిచేసింది. దీని తర్వాత నటించిన 'ది బాంక్విట్' చిత్రం సైతం జాంగ్‌కి అగ్ర కథానాయికగా మంచి పేరు, గుర్తింపు తీసుకొచ్చింది.

హాలీవుడ్‌లోనూ తనదైన ముద్ర..

2007లో అమెరికన్ యానిమేషన్ చిత్రం 'టిఎమ్ఎన్‌టి'కి వాయిస్ ఓవర్ ఇచ్చింది. ఆ తర్వాత 2008లో అమెరికన్ సినిమా 'ఫరెవర్ ఎంత్రాల్డ్'లో నటించే ఛాన్స్ అందుకుంది. పెకింగ్ ఎపెరా నటుడు మెయి లాఫాంగ్‌కు సంబంధించిన కథ ఆధారంగా రూపొందించిన బయోగ్రాఫికల్ చిత్రమిది. ఇందులో మెయి ప్రియురాలి పాత్రలో జాంగ్ తనదైన అందం, అభినయంతో మెప్పించింది. ఇందులోని నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. జాంగ్‌కు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన సినిమాలో 'ది హార్స్‌మెన్' ఒకటి. ఇందులో హాలీవుడ్ నటుడు డెన్నిస్ క్వాయిడ్ సరసన నటించడం విశేషం. హాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన జాంగ్ 2009లో మళ్ళీ తిరిగి చైనా చిత్రాల్లో నటించింది. రొమాంటిక్ కామెడీ చిత్రం 'సోఫీ రివేంజ్', ఎయిడ్స్‌పై అవగాహన నేపథ్యంలో వచ్చిన 'లవ్ ఫర్ లైఫ్' చిత్రాలు చైనాలో జాంగ్‌కు మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకొచ్చాయి. 2012లో ఫ్రెంచ్ నవల ఆధారంగా వచ్చిన 'డేంజరస్ లైసన్స్'లో ప్రముఖ నటులు సెసెలియాచాంగ్, జంగ్ డాంగ్‌లతో కలిసి నటించింది. ఈ చిత్రానికిగానూ ఆమె 3.5 మిలియన్ డాలర్ల పారితోషికం అందుకుంది. అత్యధిక పారితోషికం అందుకున్న స్టార్ హీరోయిన్‌గా జాంగ్ రికార్డు సృష్టించింది.

'ఫరెవర్', 'ది గ్యాంగ్‌మాస్టర్', 'ది బాంక్విట్', 'మై లక్కీ స్టార్', 'ది క్రాసింగ్', 'ఓ మై గాడ్', 'రన్ ఫర్ లవ్', 'ది వేస్టెడ్ టైమ్స్' వంటి తదితర బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో నటించింది జాంగ్ తిరుగులేని కథానాయికగా చైనాలో గొప్ప పేరు తెచ్చుకుంది. మార్షల్ ఆర్ట్స్ నేపథ్యంలో తెరకెక్కిన 'ది బాంక్విట్' ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. ఆమె నటించిన సైన్స్‌ఫిక్షన్ 'ది క్లెవర్‌ఫీల్డ్ పారాడాక్స్' ఈ ఏడాది ఫిబ్రవరిలో, డ్రామా చిత్రం 'ఫరెవర్ యంగ్' జనవరిలో విడుదలయ్యాయి. ప్రస్తుతం నటిస్తున్న 'గాడ్జిల్లా: కింగ్ ఆఫ్ ది మాన్‌స్టర్స్' చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

నిర్మాతగా..

జాంగ్ జియి చైనీస్ రాక్ మ్యూజిషియన్ వాంగ్ ఫెంగ్‌ను 2015లో వివాహమాడారు. వీరికి ఓ కూతురు వాంగ్ గ్జింగ్‌గ్జింగ్ ఉన్నారు. నటిగా, డాన్సర్‌గానే కాదు నిర్మాతగానూ తన అభిరుచిని చాటుకున్నారు. 'సోఫీ రివేంజ్' చిత్రాన్ని నిర్మించడంతో పాటు అందులో నటించారు. 'మై లక్కీ స్టార్', 'ఓ మై గాడ్' వంటి తదితర చిత్రాలను నిర్మించిన జాంగ్ చిత్ర పరిశ్రమకు చేస్తున్న సేవలకుగానూ 2013లో ఆర్డె డెస్ ఆర్ట్స్ ఎట్ డెస్ లెటర్స్ పురస్కారం అందుకున్నారు. 2008 షాంగై అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఔట్‌స్టాండింగ్ కంట్రిబ్యూషన్ టు చైనీస్ సినిమా' అవార్డును, 2010లో యాక్ట్రెస్ ఆఫ్ ది డికేడ్ ప్రైజ్‌ను అందుకున్నారు. టైమ్స్ ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావితమైన మహిళల్లో ఒకరిగా నిలిచారు. 2006లో కేన్స్ జ్యూరీ మెంబర్‌గా పనిచేసిన జాంగ్ 'కేర్ ఫర్ చిల్డ్రన్'కు అధికార ప్రతినిధిగా, చైనా స్పెషల్ ఒలంపిక్స్‌కు, మొదటి బీజింగ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు, స్క్రీన్ సింగపూర్ 2011 ఫిల్మ్ ఫెస్టివల్‌కు, అనాథల కోసం మెడికల్ క్యాంప్స్ నిర్వహించే చిల్డ్రన్ ఆఫ్ చైనా పెడియాట్రిక్ ఫౌండేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు. 2012లో చైనీస్ వెబ్‌సైట్ బోక్సన్ తన గురించి తప్పుడు సమాచారాన్ని ప్రచురించినందుకు 100 మిలియన్ డాలర్ల పరువునష్టం దావా వేశారు. అలాగే హాంకాంగ్‌కు చెందిన నెక్ట్స్ మీడియాపై కూడా కోర్టుకెక్కారు.



మార్షల్ ఆర్ట్స్ చిత్రాల్లో నట విశ్వరూపం..

కమర్షియల్ చిత్రాల్లోనే కాదు మార్షల్ ఆర్ట్స్ చిత్రాల్లోనూ జాంగ్ అత్యద్భుతమైన నటనా ప్రతిభను చూపింది. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ సినిమాల్లో యుద్ధనారిగా జాంగ్ మహిళా శక్తిని చాటింది. మార్షల్ ఆర్ట్స్ విద్యల్లో ఆరితేరిన అమ్మాయిగా ఆయా చిత్రాల్లో తనదైన యాక్షన్‌తో మెస్మరైజ్ చేసింది. జాంగ్ పేరు వినగానే మెరుపు వేగంతో ఫైట్ చేసే యోధురాలు గుర్తుకొస్తుంది. అదే జాంగ్ ప్రత్యేకత. ఆ ప్రత్యేకతకే విశ్వ ప్రేక్షకులు జాంగ్‌కు ఫిద్ అయిపోయారు. మార్షల్ ఆర్ట్స్ చిత్రాల్లో ముఖ్యంగా 'క్రౌచింగ్ టైగర్, హిడెన్ డ్రాగన్' చిత్రం గురించి చెప్పుకోవాలి. తన రక్షణ కోసం యుద్ధవీరుడైన ప్రియుడు ఇచ్చిన ఖడ్గాన్ని ఓ వ్యక్తి దొంగిలిస్తారు. అతన్ని పట్టుకుని తన ఖడ్గాన్ని తిరిగి పొందేందుకు రహస్యంగా యుద్ధ విద్యలు నేర్చుకునే ఉన్నత మహిళ పాత్రలో జాంగ్ నటన మైమరిపిస్తుంది. యాక్షన్ టెలివిజన్ సిరీస్ 'లెజెండ్ ఆఫ్ జు మౌంటేన్'లో గెస్ట్ పాత్రలో తనదైన యాక్షన్‌తో జాంగ్ అలరించింది. మార్షల్ ఆర్ట్స్ ప్రధానంగా వచ్చిన మరో చిత్రం 'హీరో'. క్రీ.పూ.227లో క్విన్ అనే రాజ్యానికి చెందిన రాజును హత్య చేసిన జింగ్ కె చరిత్రక కథాంశంతో రూపొందిన ఈ చిత్రంలో యుద్ధ వీరురాలిగా, జింగ్ కెను ఎదురించే మహిళగా జాంగ్ తనదైన నట విశ్వరూపం చూపించింది. ఇందులో చైనా అగ్ర నటుడు టోని లెంగ్‌తో కలిసి నటించడం విశేషం. దర్శకుడు జాంగ్ యిమౌ దర్శకత్వంలో జాంగ్ జియికిది రెండో చిత్రం. ఇక జియి యాక్షన్‌కు, మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలకు ప్రతిబింబం 'హౌస్ ఆఫ్ ఫ్లైయింగ్ డాగ్గర్స్'. ఇందులో బ్లైండ్ డాన్సింగ్ గర్ల్, యుద్ధ విద్యల్లో అత్యంత ప్రతిభ కలిగిన ఫైటర్‌గా నటించింది. పోలీస్‌లకు, రెబల్స్‌కి జరిగే యుద్ధంలో రెబల్ నాయకురాలిగా జాంగ్ చేసే అద్భుత పోరాటం కట్టిపడేస్తుంది. చైనీస్ స్టార్ హీరో తకెషి కనెషిరోతో కలిసి నటించారు. అంధురాలిగా కనిపించేందుకు రెండు నెలల పాటు శిక్షణ తీసుకుంది. జాంగ్ యిమౌ దర్శకత్వం వహించిన ఈ సినిమా 2004లో విడుదలై భారీ కలెక్షన్లను రాబట్టడంతోపాటు ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. విలియమ్ షేక్‌స్పియర్ రాసిన ట్రాజెడీ నవల 'హామ్లెట్' ఆధారంగా రూపొందిన యాక్షన్ డ్రామా 'ది బంక్విట్' చిత్రంలో యువరాణి వాన్ పాత్రలో హుందాతనం, ధీరత్వం, పోరాట పటిమ కలిగిన యోధురాలిగా జాంగ్ నటన శభాష్ అనిపించేలా ఉంటుంది. ఏడేండ్ల గ్యాప్ తర్వాత జాంగ్ నటించిన మార్షల్ ఆర్ట్స్ చిత్రం 'ది గ్రాండ్‌మాస్టర్'. మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్, వింగ్ చున్ ఆర్ట్స్ టీచర్, బ్రూస్‌లీ గురువు ఐపీ మ్యాన్ జీవితం ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో ప్రత్యర్థి కూతురు పాత్రలో జాంగ్ నటించారు. ఇందులో ఐపీ మ్యాన్‌గా చైనీస్ స్టార్ టోనీ లెంగ్ నటించడం విశేషం. వీరి కాంబినేషన్‌లో వచ్చిన మూడో చిత్రమిది. ఆస్కార్‌కు సైతం నామినేటైందీ సినిమా. ఎపిక్ హిస్టారికల్ రొమాంటిక్ వార్ డ్రామా చిత్రం 'ది క్రాసింగ్'. రెండు భాగాలుగా వచ్చిన ఈ సినిమా 1940లో చైనా రివల్యూషన్ టైమ్‌లో జరిగిన డిజాస్టర్ ప్రధానంగా రూపొందించారు. ఇందులో పెళ్లైన జంటగా తకేషి కనెషిరోతో కలిసి జాంగ్ నటించిన తీరు ఆద్యంతం అద్భుతం.

నాణానికి మరో వైపు..

మార్షల్ ఆర్ట్స్ చిత్రాలతోనే కాదు పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తోనూ హాలీవుడ్ ప్రేక్షకుల్ని సైతం జాంగ్ ఫిదా చేసింది. యాక్షన్, కామెడీ, రొమాన్స్, డ్రామా.. జోనర్ ఏదైనా, పాత్ర ఏదైనా వాటికి పూర్తి న్యాయం చేయటం ఆమె నటనా ప్రతిభకు నిదర్శనం. 'ది రోడ్ హోమ్'లో టౌన్ టీచర్ ప్రేమలో పడే అమాయక యువతిగా, 'రష్ అవర్ 2'లో నెగటివ్ రోల్‌లో సైకోగా, 'పర్పుల్ బట్టర్‌ఫ్లై'లో ప్రతిఘటన దళం 'పర్పుల్ బట్టర్‌ఫ్లై'కి చెందిన సభ్యురాలిగా, 'మై వైఫ్ ఈజ్ ఏ గ్యాంగ్‌స్టర్ 2'లో అతిథి నటిగా, నాలుగు తరాలకు చెందిన వ్యక్తుల ఆలోచనలు, ప్రవర్తన, భావోద్వేగాలను తెలిపే మహిళా ప్రధాన చిత్రం 'జాస్మిన్ ఉమెన్'లో మూడు జనరేషన్స్ బామ్మగా, తల్లిగా, కూతురిగా, 'మెమరీస్ ఆఫ్ ఏ గైషా'లో వేశ్యగా, డాన్సర్‌గా, 'లవ్ ఫర్ లైఫ్' చిత్రంలో ఎయిడ్స్ బాధితురాలిగా, చైనా ప్రభుత్వం నిర్మించిన చిత్రం 'ది ఫౌండింగ్ ఆఫ్ ఏ రిపబ్లిక్'లో చైనాలోని విదేశీ వ్యవహారాలు చూసే అధికారిగా, 'బెటర్ అండ్ బెటర్' చిత్రంలో అతిథి హాస్యనటిగా, 'మై లక్కీ స్టార్' ప్రేమికురాలు సోఫీగా, 'ఓ మై గాడ్'లో విలక్షణ ప్రేమికురాలిగా, ఐదు ప్రేమ కథల నేపథ్యంలో రూపొందిన 'రన్ ఫర్ లవ్' చిత్రంలో చైనాకు చెందిన ప్రేమికురాలిగా జాంగ్ తన అద్భుతమైన నటనలో మరో కోణాన్ని ఆవిష్కరించింది. ఇటు కమర్షియల్ చిత్రాలతో, అటు మార్షల్ ఆర్ట్స్ చిత్రాలతో దాదాపు రెండు దశాబ్దాలుగా తనదైన ముద్రతో ప్రేక్షకుల మదిపై జాంగ్ చెరగని సంతకం చేసింది. అందం, అభినయం, అద్భుతమైన వ్యక్తిత్వం అన్నింటికి మించి సేవాగుణం జాంగ్‌ను విశ్వస్థాయిలో ఉత్తమ మహిళగా నిలిపింది.

నేటి నుంచి అసెంబ్లీ


- అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు
- సెక్యూరిటీపై డ్రెస్ రిహాల్సల్స్ నిర్వహించిన పోలీసు ఉన్నతాధికారులు
- బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు నిషేధాజ్ఞలు


(ఫైల్)

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. శాసనసభ,శాసనమండలి వేదికగా అధికార,ప్రతిపక్షపార్టీలు అస్త్రశస్త్రాలతో రెడీ అయ్యాయి. కాగా గవర్నర్ నరసింహన్ ఉభయసభనుద్దేశించి ప్రసంగంతో సమావేశాలు షురు కానున్నాయి. టీఆర్ఎస్ సర్కారుకు చివరి బడ్జెట్ సమావేశాలు కానున్నాయి. మరోవైపు సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతను పోలీసు ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. దీంతో అసెంబ్లీ వద్ద సెక్యూరిటీ ఏర్పాట్లను నగర పోలీసు కమిషనర్ వివి శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ డ్రెస్ రిహాల్స్‌ను నగర అదనపు పోలీసు కమిషనర్ శివప్రసాద్ నేతృత్వంలో సెంట్రల్ జోన్‌డీసీపీ జోయెల్ డేవిస్, నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ రవీందర్, డీసీపీ రంగనాథ్, సైఫాబాద్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎదుట ఇనుప భారీ కేడ్ల వద్ద అడుగడుగునా సాయుధ పోలీసులను నియమించడంతో పాటు అసెంబ్లీలోకి వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా సోదా చేసి పంపించేలా చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ రెండు గేట్ల వద్ద అదనపు ఎస్పీ స్థాయి అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించడంతో పాటు అసెంబ్లీ లోపల, లాంజ్ లోను ముందుస్తు చర్యగా పెద్ద సంఖ్యలో సివిల్ దుస్తుల్లో పోలీసులను నియమించి పరిసరాలపై నిఘా వేసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా లాబీ, గ్యాలరీలోకి పాసులున్న వారినే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. అసెంబ్లీ పరిసరాలలోని ప్రతి చౌరస్తా వద్ద సాయుధ పోలీసులతో పికెట్‌లను ఏర్పాటు చేయడమే గాక , హఠాత్తుగా ఏదేని ఆందోళన కారులు అసెంబ్లీ వైపునకు చొరబడే ప్రయత్నం చేస్తే వారిని నిరోధించేవిధంగా పలు చర్యలు తీసుకున్నారు. ఇనుప కంచెలతో పాటు, వజ్రా వాహనం, సాయుధ అశ్విక దళాలను కూడా సిద్ధంగా ఉంచారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేంత వరకు పరిసరాలలో రెండు కి.మీ దూరం వరకు నిషేధాజ్ఞలను విధిస్తూ కమిషనర్ ఆదేశాలను జారీ చేశారు. దీంతో అసెంబ్లీకి సమీపంలో ర్యాలీలు, ధర్నాలు, బహిరంగ సభలు, పికెటింగ్‌లు నిర్వహించడాన్ని నిషేధించారు. జెండా కర్రలు , పేలుడు పదార్థాలు, ఆయుధాలు ధరించి తిరగడాన్ని కూడా నిషేధించారు. కాగా అసెంబ్లీ సమావేశాలు ముగిసేంత వరకు నగరంలోని ప్రతి పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మొదలుకుని కింది స్థాయి సిబ్బంది వరకు విడతల వారిగా డ్యూటీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ముందు జాగ్రత్త చర్యగా టీఎస్ఎస్‌పీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన సాయుధ పోలీసు లను సిద్ధంగా ఉంచారు. అలాగే అత్యవసర పరిస్థితిలో రంగంలోకి దింపడానికి గ్రేహౌండ్స్, అక్టోపస్ చెందిన యూనిట్‌లను అందుబాటులో ఉంచేలా డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం మీద దాదాపు మూడు వేల మంది పోలీసులు, సాయుధ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కాగా ఈ సమావేశాల సందర్భంగా విపక్షాలు, ప్రజాసంఘాలు, ఇతర సంఘాలు ర్యాలీలు, ప్రదర్శనలు , మెరుపు ముట్టడులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయనే నిఘా వర్గాల హెచ్చరికలతో జాగ్రత్తగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు ఇతర అధికారులను డీజీపీ మహేందర్ రెడ్డి అప్రమత్తం చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా అసెంబ్లీ సమావేశాల ప్రాంగణాన్ని కమాండ్ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు నిఘా వేసి ఉంచాలని ఆదేశించారు.

సాయుధ పోరాటయోధురాలు కమలమ్మ మృతి


(ఫైల్)

నవతెలంగాణ-వరంగల్ చౌరస్తా

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఐ సీనియర్ నాయకురాలు చెన్నబోయిన కమలమ్మ (90) ఆదివారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైద్రాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆమె భౌతికదేహాన్ని వరంగల్‌అర్బన్ జిల్లా పోచమ్మమైదాన్‌లోని నివాసానికి తీసుకురాగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళ్లర్పించారు. ఆమె అంత్యక్రియలు వరంగల్‌లో జరిగాయి.

కమలమ్మ మృతి కష్టజీవులకు తీరనిలోటు : సీపీఐ(ఎం)



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, స్వాతంత్ర్య ఉద్యమ నాయకురాలు చెన్నబోయిన కమలమ్మ (90) మృతికి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపం ప్రకటించింది. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. కమలమ్మ మరణించారన్న విషయం తెలియగానే సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి వెంకట్, డిజి నర్సింహారావు మఖ్దూంభవన్‌కు చేరుకుని ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కమలమ్మ మరణం తెలంగాణ ప్రజలకు, కష్టజీవులకు తీరనిలోటని తమ్మినేని వీరభద్రం అన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన కమలమ్మ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పనిచేశారని చెప్పారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని కన్నబిడ్డను సైతం పోగొట్టుకున్న నేత కమలమ్మ అని అభివర్ణించారు. ఆమె ఉద్యమ స్పూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సీపీఐ నివాళి :

కమలమ్మ మృతికి సీపీఐ రాష్ట్ర సమితి సంతాపం ప్రకటించింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, నాయకులు డి సుధాకర్, రాంనర్సింహ్మారావు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కేంద్రానికి వర్గీకరణ చేసే ఉద్దేశం లేదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఎస్సీ వర్గీకరణ చేసే ఉద్దేశం లేదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి విమర్శించారు. ఈనెల 13న తలపెట్టిన ఎమ్మార్పీఎస్ బంద్‌పై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ఎమ్మార్పీఎస్ బంద్ వాయిదా వేయాలని కోరడంతో మందకృష్ణ మాదిగ స్పందించి బంద్ వాయిదా వేస్తున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనెల 13న ఇంటర్మీడియెట్ కెమిస్ట్రీ పరీక్ష పేపర్-1 యథాతథంగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు టీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వర్గీకరణ కోసం ఇప్పటికే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామని చెప్పారు. 2016, మే 10న తాను, సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని నరేంద్రమోడీకి ఇచ్చామన్నారు. అనేక సార్లు లేఖలు రాశామని, అఖిలపక్షాన్ని తీసుకెళ్లేందుకు మూడుసార్లు ప్రధాని అపాయింట్‌మెంట్ కోరామని చెప్పారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోపే ఎస్సీ వర్గీకరణ, ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల పెంపు కోసం ఢిల్లీలో తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ధర్నా చేస్తామని చెప్పారు. కేంద్రానికి వర్గీకరణ చేసే ఉద్దేశం లేదని అన్నారు. ఎమ్మార్పీఎస్ బంద్ సందర్భంగా విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని, దీనిపై మందకృష్ణ, కాంగ్రెస్ నాయకులు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నేత లక్ష్మణ్, ఇతర నేతలతో మాట్లాడానని చెప్పారు. ఈనెల 13న ఇంటర్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలీసులు, ఆర్టీసీ అధికారులతో మాట్లాడామని అన్నారు. విద్యార్థులు పరీక్షలకు హాజరుకాకుండా నష్టపోతే దానికి ఎమ్మార్పీఎస్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ఉగాది, శ్రీరామనవమి ఉందని, ఏప్రిల్ 15లోపు ఇంటర్ ఫలితాలు విడుదల చేయాల్సి ఉందన్నారు. లేనిపక్షంలో విద్యార్థులు జాతీయ పరీక్షలు రాసే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. పరీక్షల కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఒత్తిడికి లోనవుతారని అన్నారు. ఫిబ్రవరి 28న ఇంటర్ పరీక్షలు ప్రారంభించామని, ఈనెల 14 వరకు ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు పూర్తవుతాయని చెప్పారు. ఈనెల 15 నుంచి టెన్త్ పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఇంటర్ పరీక్షలు శాంతియుత వాతావరణంలో, ప్రశాంతంగా జరుగుతున్నాయని చెప్పారు. మాస్ కాపీయింగ్, ఇతర ఫిర్యాదులేమీ రాలేదని అన్నారు.

9 రాష్ట్రాల్లో తగ్గిన వర్షపాతం

ఔరంగబాద్ : తెలంగాణ సహా తొమ్మిది రాష్ట్రాల్లో వాతావరణ పరిస్థితుల అంచనాలు గాడితప్పాయి. తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, కర్నాటక రాష్ట్రాల్లోని 61 జిల్లాల్లోఉష్ణోగ్రతలు గతేడాది 0.25 నుంచి 0.75 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. వీటితో పాటు 50 నుంచి 500 మిల్లిమీటర్ల వర్షపాతం తగ్గింది.

ఆర్థిక సర్వేలో గుర్తించిన వాతావరణ సమస్యలు

ఆర్థికసర్వే..2018లో వాతావరణ మార్పులపై కొత్త సమస్యలు ముందుకొచ్చాయట. దీని ప్రకారం దేశంలోని వాతావరణ ప్యాటర్న్‌లో తేడా కనిపిస్తున్నది. మధ్యప్రదేశ్,ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, కేరళతో పాటు ఈశాన్య రాష్ట్రాల్లో వర్షపాతం పెద్ద సమస్యగా మారనున్నదని అంచనా. ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో వర్షపాతం మరింత తగ్గుతున్నది. 2005 నుంచి 2015 వరకు.. పదేండ్ల వ్యవధిలో మధ్య ప్రదేశ్‌లోని 23 జిల్లాలు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలోని 8 జిల్లాల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధిపేరిట జరుగుతున్న హరిత హననమే దీనికి కారణమని పర్యావరణవేత్తలు అంటున్నారు.


వర్షపాతం తగ్గుతున్న జిల్లాలు

తెలంగాణలో..నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, రంగారెడ్డి ఇక మధ్య ప్రదేశ్‌లోని టికమ్‌గడ్, పన్నా, ఛతర్‌పూర్, సత్నా, రీవా, సియి, సింగరోలి, షహడోల్, ఉమరియా, అనూప్‌పూర్, డిండోరి, మండల, బాలాఘటా, కట్నీ, సాగర్, దామోహ్, భిండ్, జబల్‌పూర్, మురైనా, గ్వాలియార్, దాతియా, షోయపూర్, శివ్‌పూరి ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కోరియా, సర్‌గాజా, జష్‌పూర, బిలాస్‌పూర్, కోర్బా, రాయ్‌గడ్, జంగిర్, కబీర్‌ధామ్ ఉన్నాయి. గుజరాత్‌లో వాల్స్‌వాడా, డాంగ్, నవసరీ, తాపీ, మహారాష్ట్రలో థానే, నాసిక్, గోండియా, భండారా, చంద్రపూర్, నాందేడ్, హింగోలి, పర్భణఇ, పంజాబ్‌లో గురుదాస్‌పూర్, అమృతసర్, తరన్‌తరణ్, భటిండా జిల్లాలున్నాయి. జార్ఖండ్‌లో గద్వా, పాల్‌మూ, లాతేహర్, గుమలా, సిమ్‌డేగా, కర్నాటకలో బీదర్, గుల్బార్గా జిల్లాల్లో వర్షపాతం తగ్గుముఖం పట్టే సూచనలున్నాయని ఆర్థిక సర్వేలో ప్రస్థావించింది.

అధికారంలోకి వస్తే మహిళలకు ప్రాధాన్యం

చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

- కేసీఆర్..నీ క్యాబినెట్‌లో మహిళకు చోటు లేదా?
- మహిళా దినోత్సవ సదస్సులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-అమీన్‌పూర్

దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని టీపీసీసీ అధ్యక్షులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బీరంగూడగుట్ట వద్ద ఎంపీటీసీ కాట సుధారాణి, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాట శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే డీకే అరుణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సదస్సులో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్ ఉభయ సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టినా ఆర్జేడీ, జనతాదల్, ఎస్పీ తదితర పార్టీలు అడ్డుకున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ నేటికీ మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం కృషి చేస్తోందన్నారు. మహిళా సంఘాల కోసం గ్రామాల్లో, పట్టణాల్లో మహిళా భవనాలు కట్టిస్తామని తెలిపారు. వడ్డీలేకుండా రూ.10లక్షల వరకు రుణాలను ఇస్తామన్నారు. గ్రామంలో ఉన్న డీవోఏలకు రూ.10వేలు గౌరవవేతమిస్తామన్నారు. మహిళలు రాజకీయంగా ఎదిగితేనే ఆర్థిక స్వావలంబన సాధిస్తారని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ మహిళలను చిన్నచూపు చూస్తోందని, రాష్ట్ర క్యాబినెట్‌లో మహిళలకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదన్నారు. దీన్ని బట్టే మహిళలకు వారిపై ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతోందని విమర్శించారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 'అభయహస్తం' పథక నిధులను టీఆర్ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. అభయహస్తం కింద ప్రజలు కట్టిన చందా డబ్బులను టీఆర్ఎస్ ప్రభుత్వ వారి అవినీతి కార్యక్రమాలకు మళ్లించిందని ఆరోపించారు.

ప్రస్తుతం మిషన్ భగీరథ పైప్‌ల కోసం వాడుతున్న నిధులు ఆ పథకానివే అని తెలిపారు. ఎమ్మెల్యే, మాజీ మంత్రి డీకే అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఏదో ఒక చోట మహిళలపై నిత్యం దాడులు జరుగుతున్నాయని, వాటిని నివారించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని తెలిపారు. మహిళలు సంఘటితంగా ఉండి వాటిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శారద, జిల్లా అధ్యక్షులు నిర్మల, మాజీ ఎమ్మెల్యే టి.జయప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రవణ్‌కుమార్, రాజనర్సింహ సతీమణి పద్మిని, సినీనటి రాగిణి, తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల రాజ్యాధికారమే బీఎల్‌ఎఫ్ ధ్యేయం


నవతెలంగాణ-సిటీబ్యూరో


మాట్లాడుతున్న తమ్మినేని

బహుజనుల రాజ్యాధికారమే ధ్యేయంగా బీఎల్ఎఫ్ ఏర్పడిందని బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్ఎఫ్) రాష్ట్ర చైర్మెన్ నల్లా సూర్యప్రకాశ్ అన్నారు. సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధిలో భాగంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీఎల్ఎఫ్ ఆవిర్భావ సభ కొత్తపేటలోని భాగ్యనగర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. సభలో నల్లా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో సుమారు 40 వేల మంది మాత్రమే ఉన్న వెలమలు 9 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాల్లో ఉన్నారని వివరించారు. మంత్రివర్గంలో సీఎం కేసీఆర్‌తో కలిపి నలుగురు ఉన్నారన్నారు. తెలంగాణలో నాలుగు శాతమున్న రెడ్డి సామాజిక తరగతికి చెందిన 41 మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు మంత్రులున్నారని తెలిపారు. 52 శాతం జనాభా ఉన్న బీసీలకు చెందిన ఎమ్మెల్యేలు కేవలం 19 మంది మాత్రమే ఉన్నారని, నలుగురు మంత్రి వర్గంలో ఉన్నారని ఆయన వివరించారు. దీంతో బహుజనులు ఆశించిన ఫలితాలు రాక అట్టడుగు స్థాయికే పరిమితమవుతున్నారని తెలిపారు. బీఎల్ఎఫ్ వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేస్తుందని స్పష్టం చేశారు. అధికారంలోకి వస్తే విద్య, వైద్యం, సేద్యం, డబుల్‌బెడ్ రూమ్‌లలో పారదర్శకతను పాటిస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ అవకాశవాదం కోసం ఫెడరల్‌ఫ్రంట్ అనే కొత్త నాటకానికి తెరతీశారన్నారు. చరిత్రలో హిట్లర్‌కు పట్టిన గతే మోడీకీ పడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో బహుజనులు బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలకు గట్టి గుణపాఠం చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ముందు బీసీ సీట్ల కేటాయింపుపై స్పష్టత ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీఎల్ఎఫ్ ఏర్పడిన నాటి నుంచే అనేక మందికి సందేహాలున్నాయని, వాటన్నింటికీ ఒకటే సమాధానం..అదే బీఎల్ఎఫ్ ఎజెండా అని స్పష్టం చేశారు. బీఎల్ఎఫ్‌కు బహుజనులకు రాజ్యాధికారం అనే ఎజెండానే బలమన్నారు. బహుజనుల ఓట్లన్నీ బీఎల్ఎఫ్‌వే అయినప్పుడు, ఇక నోట్ల అవసరం ఎందుకని ఆయన ప్రశ్నించారు.

వచ్చే ఎన్నికల్లో బీఎల్ఎఫ్ అభ్యర్థులు అన్ని చోట్లా పోటీచేసి విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బీఎల్ఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు భూపాల్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు చెరుపల్లి సీతారాములు, నాగయ్య, మన్నారం నాగరాజు చంద్రమౌళి, బీజీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి గుజ్జ రమేష్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి తాండ్రకుమార్, ఎంబీటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముస్తాఫా మహ్మద్, బీఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు రేఖ, బహదూర్ శ్రీనివాస్‌తో పాటు బీఎల్ఎఫ్‌లో భాగస్వామ్యమైన దాదాపు 30 పార్టీలకు చెందిన ప్రధాన నాయకులు, మాట్లాడి ప్రజల్లో ఉత్సాహం నింపారు.

ఇంటిగుట్టు



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

హైదరాబాద్ జిల్లాలో విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న సుమారు 73 మంది ప్రభుత్వం నుంచి హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లను పొందారు. గతంలో డీఈఓగా పనిచేసిన సోమిరెడ్డి ఉన్నప్పుడు మొదటివిడతలో 13 మంది అడ్వాన్సులు తీసుకోగా, రెండో విడతలో డీఈఓ రమేశ్ హయాంలో 60 మంది పొందారు. రెండో విడతలో అడ్వాన్సులు పొందిన వారంతా దాదాపు అందరూ డీఈఓ ఆఫీస్‌లో పనిచేసే నాన్‌టీచింగ్ స్టాఫే కావడం గమనార్హం. 2017లో 60మంది ఉద్యోగుల ఇండ్లులేవని డీఈఓకు లెటర్ పెట్టుకోగా, అనుమతి ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వం వీరికి అనుమతించి, అడ్వాన్స్ కోసం రూ.6,27,60,000 నిధులను మంజూరు చేసింది. మొదటి విడతలో భాగంగా 25శాతం, రెండో విడుతలో భాగంగా మరో 50శాతం అడ్వాన్స్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ లెక్కన ఒక్కో ఉద్యోగికి రూ.పదిలక్షల నుంచి రూ.15లక్షల వరకూ అడ్వాన్స్ మంజూరైంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 95లో ఈ ఉద్యోగులంతా ఒకేచోట స్థలాన్ని కొనుగోలు చేసినట్టు అధికారుల నివేదికల్లో ఉన్నది. వాస్తవానికి బాలానగర్ మండలంలో ఈర్లపల్లి అనే గ్రామమే లేదు అక్కడుంది ఈరన్నపల్లి. నిజానికి వీరంతా జడ్చర్ల మండలంలోని ఈర్లపల్లి గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. కానీ ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇచ్చినట్టు తెలుస్తోంది. బసేరా వెంచర్స్, హైదరాబాద్ అనే రియల్‌ఎస్టేట్ సంస్థ ద్వారా ఈ స్థలాన్ని కొనుగోలు చేసినట్టు అధికారుల నివేదికల్లో ఉంది.

కనిపించని నిర్మాణాలు

ఇంటి నిర్మాణం కోసం ఒక్కో ఉద్యోగికి ప్రభుత్వం నుంచి రూ.8లక్షల నుంచి రూ.12లక్షల వరకు ఇప్పటికే అందాయి. ఈ లెక్కన ఇంటి నిర్మాణాలు ఎన్నడో ప్రారంభం కావాలి. కానీ, ప్రస్తుత స్థలంలో వెంచర్ నిర్మాణమే సరిగా లేకపోవడం గమనార్హం. కేవలం స్థలంలో ప్లాట్లుగా మార్చి ఉన్న హద్దులు మాత్రమే కనిపిస్తున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్(డీటీసీపీ) అనుమతులు పొందినట్టు ఉన్న ఆ స్థలంలో కనీస సౌకర్యాలు లేవు. వెంచర్, లే అవుట్ వేసినప్పుడే రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, విద్యుత్, నీటిసౌకర్యం కల్పించాలి. కానీ, అక్కడ అవేవీ అవేవీ లేవు. రెండోవిడత అడ్వాన్స్ తీసుకున్నాక...నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉన్నా, ప్రాథమిక నిర్మాణాలూ చేపట్టలేదు. 60మంది ఉద్యోగుల్లో దాదాపు 15మందికి ఇప్పటికీ గవర్నర్ పేరుతో స్థలం మార్ట్‌గేజ్ లేకపోవడం గమనార్హం. అయినా రెండో విడుత నిధులు మంజూరయ్యాయి. ఉద్యోగుల్లో కొందరికి మూడు విడుతల నిధులూ విడుదలైనట్టు సమాచారం.

డీఈఓ ఆఫీసే అడ్డా...

హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌ల అక్రమాల్లో హైదరాబాద్ డీఈఓ ఆఫీస్ అడ్డాగా మారింది. నగరానికి సుమారు 70 కిలోమీటర్లకు దూరంలో ఉన్న ఈర్లపల్లి గ్రామంలో స్థలాన్ని కొనుగోలు చేయించడంలో డీఈఓ ఆఫీస్‌లోని 'ఏ' సెక్షన్‌లోని హిమాయత్‌నగర్ మండలాన్ని చూసే ఓ సీనియర్ అసిస్టెంట్ పాత్ర కీలకంగా ఉన్నట్టు తెలుస్తోంది. మొదట్లో 36 మందికి రూ.3.77కోట్ల నిధులు మంజూరు కాగా, వాటిని డీఎస్ఈ అనుమతి లేకుండానే ఆ మొత్తాన్ని 60మందికి పంచినట్టు ఆరోపణలున్నాయి. ఉద్యోగులందరినీ సరూర్‌నగర్‌లోని ఓ హోటల్‌లో కూర్చోబెట్టి, ఎవరికి ఏ ప్లాట్ అనే విషయాన్ని కూడా ఆయనే చెప్పినట్టు సమాచారం. అయితే వాస్తవానికి అడ్వాన్స్‌ల వ్యవహారం డీఈఓ ఆఫీస్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ చేయాల్సి ఉన్నా, దాంతో సంబంధం లేని సీనియర్ అసిస్టెంట్ చేయడం వివాదాలకు తావిస్తోంది. వాస్తవానికి మరో వందమంది పీఈటీలనూ దీనిలో కలుపుకోవాలని చూసినా, ప్రస్తుతమున్న సభ్యులు గొడవ చేయడంతో అతడు వెనక్కి తగ్గినట్టు సమాచారం. ప్రభుత్వమిచ్చిన మొత్తంలో రూ.లక్ష భూమికి ఇవ్వగా, మరో రూ.లక్ష ఆ స్థలాన్ని అభివృద్ధి కోసం ఇచ్చారు. ఈ డెవలప్‌మెంట్ డబ్బుల కోసం ఉద్యోగులకు ఒక్కసారి కూడా వెంచర్ యజమాని ఫోన్ చేయకపోగా, సదరు ఉద్యోగే నిత్యం ఉద్యోగులను డబ్బులకోసం అడిగేవాడని తెలుస్తోంది.

అందరిదీ పాత్ర...

'తలాపాపం తిలా పిడికెడు' అన్నట్టుగా ఉన్నది హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్‌లను పరిస్థితి. వీటిని మంజూరు చేయడంలో డీఈఓ నుంచి సెక్రటేరియేట్ అధికారుల వరకూ పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. స్థలాన్ని పరిశీలించి, ఆతర్వాతే రెండో విడత నిధులు ఇవ్వాలి. కానీ అదేదీ పట్టించుకోకుండానే ఉన్నతాధికారులు గుడ్డిగా సంతకాలు చేశారనే ఆరోపణలున్నాయి. అయితే, దీనికి ప్రధాన కారణం..వారికి లంచాలు అందడమేనని తెలుస్తోంది. ఈ వ్యవహారంలో పాఠశాల విద్యాశాఖలోని ఓ సీనియర్ అధికారి, సూపరింటెండెంట్ పాత్ర కూడా ఉందనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. అయితే అడ్వాన్స్ తీసుకున్న 19నెలల్లో ఇండ్లు నిర్మించాల్సి ఉందనీ, తమను వెంచర్ యజమాని మోసం చేసినట్టు కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ప్రభుత్వం డబ్బులు తిరిగి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకూ వచ్చిన అడ్వాన్స్ మొత్తాన్ని ఉద్యోగులు వడ్డీలకు ఇచ్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వడ్డీరేటు కేవలం 5.5శాతం మాత్రమే ఉండటంతో ఈ దందాకు ఉద్యోగులు తెరలేపినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఇలాంటి వ్యవహారాల్లో అవకతవకలని తేలితే ప్రభుత్వం వీరి నుంచి 8.5వడ్డీ రేట్‌తో రికవరీ చేస్తుంది. ఎలా చేసినా ఉద్యోగులకే లాభం కావడంతో ఇలాంటి వాటికి ఉద్యోగులు మొగ్గుచూపుతున్నారు. అయితే అదే స్థలంలో ఈఎస్ఐ, అగ్రికల్చర్, మెడికల్, జూపార్క్ తదితర శాఖలకు చెందిన ఉద్యోగులూ అడ్వాన్స్‌లు తీసుకున్నట్టు సమాచారం.

బంద్ వాయిదా

మొదటిపేజీ తరువాయి

ఇంటర్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తలెత్తకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. బంద్‌కు బదులుగా అదే రోజు జిల్లా, మండల కేంద్రాల్లో మహాదర్నా నిర్వహిస్తామన్నారు. పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టాలని కోరుతూ 19 నుంచి ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని డిమాండ్ చేశారు. బంద్‌ను విరమించుకోవాలని చెప్పిన ఉప ముఖ్యమంత్రి కడియంశ్రీహరి వర్గీకరణ విషయంపై ప్రధానికి లేఖ రాస్తారా? లేదా? అన్న విషయాన్ని బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంపై పార్లమెంట్‌లో ఎంపీలు మాట్లాడకపోతే వారిని మాదిగలకు శత్రువులుగా భావించి రాజకీయ భవిష్యత్తు లేకుండా చేస్తామన్నారు. బంద్‌ను వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసిన ఎంఎస్ఎఫ్ నేతలను ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టిందని మందకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. బంద్‌కు మద్దతు ప్రకటించిన రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేరచరిత నేతలు

మొదటిపేజీ తరువాయి

ఎంతమంది నేతలపై నేరచరిత్ర ఉన్నది..?ఎంతమందిపై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి..?ఈ వివరాలను కేంద్రం సుప్రీం కోర్టుకు నివేదించింది. దీని ప్రకారం.. దేశవ్యాప్తంగా 1700 మంది చట్టసభ సభ్యులపై నేరచరిత్ర ఉన్నది. ఇందులో 3,045 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ జాబితాలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో..248 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై నేర చరితులు ఎక్కువగా ఉండటంతో..యూపీ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఆ తర్వాత స్థానాల్లో తమిళనాడు (178), బీహార్ (144), పశ్చిమ బెంగాల్ (139)తో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో వందకు పైగా ఎంపీలు, ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసుల విచారణల్లో ఉన్నారని సుప్రీంకు ఎన్డీయే సర్కారు వెల్లడించింది. 2014 నుంచి 2017 మధ్య కాలంలో అనేకమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పలు కేసుల్లో.. కటకటాల్లోకి వెళ్లినట్టు కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది. మొత్తంగా ఉన్న 3,816 కేసుల్లో ఏడాది కాలంలో కేవలం 125 కేసుల్లో మాత్రమే తీర్పును వెలువరించారు. 2014లో సుప్రీం కోర్టు ఒక కేసు విషయంలో తీర్పు వెలువరిస్తూ ఎంపీలు, ఎమ్మెల్యేలకు సంబంధించిన క్రిమినల్ కేసుల విచారణను ఒక ఏడాదిలో పూర్తి చేయాలని ఆదేశించింది. అయితే అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు సజావుగా అమలైనట్టు దాఖలాల్లేవు.గత మూడేండ్ల కాల వ్యవధిలో కేవలం 771 కేసుల్లో విచారణ పూర్తి చేశారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో 539, కేరళలో 373 కేసులు విచారించాల్సి ఉన్నది.ఇక తమిళనాడు, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో కలిపి తొమ్మిది వందలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎంపీలు, ఎమ్మెల్యేల క్రిమినల్ కేసులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాల్సిందిగా జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్రాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇందులో భాగంగా కేంద్ర న్యాయశాఖ నేరచరిత్ర కలిగిన నేతల వివరాలను సుప్రీం కోర్టుకు సమర్పించింది. నేర చరిత్ర కలిగిన రాజకీయ నాయకులను జీవితకాలం రాజకీయాల నుంచి నిషేధించాలని అశ్విని ఉపాధ్యాయ అనే న్యాయవాది ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్)పై సుప్రీం కోర్టు విచారణ చేపట్టిన విషయం విదితమే.

టీఆర్ఎస్ బీసీ మంత్రం!

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

టీఆర్ఎస్ బీసీల మంత్రం జపిస్తున్నది. ఆ సామాజికవర్గం నుంచే ఇద్దరిని పెద్దల సభకు ఎంపిక చేసింది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌కు బీసీలకు పెద్దపీట వేయనున్నట్టు ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు చెప్పినట్టు తెలిసింది. ఆదివారం తెలంగాణభవన్‌లో టీఆర్ఎస్ఎల్పీ సమావేశం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగింది. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. ఎన్నికలకు ముందు ఇది ఆఖరి బడ్జెట్ సమావేశాలు కావడంతో ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులు, వివిధ వర్గాలకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులు, వాటి అమలుపై సమగ్ర సమాచారంతో ప్రతిపక్షాలను తిప్పికొట్టాలని కేసీఆర్ సూచించారు. అదే సమయంలో గవర్నర్ ప్రసంగాన్ని కాంగ్రెస్‌పార్టీ బహిష్కరించే అవకాశం ఉందని, అయినప్పటికీ మీరంతా సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా స్థానికంగా ప్రజల అభిమానం పొందారని, అదే విధంగా అహర్నిశలు కష్టపడి పని చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకరాలన్నారు. ప్రస్తుతం సిట్టింగులకే టికెట్లు ఇస్తామని కేసీఆర్ భరోసా ఇచ్చిననట్టు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ అధికారంలోకి వస్తోందని, దాదాపు 103 నుంచి 106 స్థానాలను పార్టీ గెలుస్తోందని రెండుసార్లు నిర్వహించిన సర్వేల్లో వచ్చిందన్నారు. 2019 వరకు తాను రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానన్నారు. ఆ తర్వాతనే దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు కోసం ప్రయత్నిస్తాన్నారు. అందుకు మీరంతా సహకరించాలని కోరారు. దేశ రాజకీయాల్లో తాను చేస్తున్న ప్రయత్నం థర్డ్ ఫ్రంట్ కాదు...ఫస్టు ఫ్రంట్ ప్రయత్నమన్నారు.

రాజ్యసభకు టీఆర్ఎస్ అభ్యర్థులు వీరే...


బండ ప్రకాశ్ ముదిరాజ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్

రాజ్యసభకు టీఆర్ఎస్ తరుపున పోటీ చేసే అభ్యర్థులను కేసీఆర్ ప్రకటించారు. టీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్, పార్టీ నేత సీనియర్ బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాశ్ ముదిరాజ్ పేర్లను సమావేశాలోనే ప్రకటించారు. మూడు సీట్లలలో రెండు బలహీనవర్గాలకు ఇవ్వడంతో కేసీఆర్ బీసీలకు పెద్ద పీట వేసినట్టేనని ఆ వర్గాలకు చెందిన నేతలు చెబుతున్నారు. లింగయ్య యాదవ్, బండ ప్రకాశ్ ఇద్దరూ టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేరారు. వలసొచ్చిన నేతలను పెద్దల సభకు పంపించడంపై ఆ పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. రెండూ బీసీలకు కాకుండా ఒక సీటు ఎస్సీ సామాజికవర్గానికి కేటాయిస్తే సామాజికన్యాయం జరిగేదని మహబూబ్‌నగర్ చెందిన నేత ఒకరు చెప్పారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గంలో మహిళా ప్రాతినిధ్యం లేదన్న విమర్శలను పార్టీ మూటకట్టుకుంటున్నది. మహిళలకు రాజ్యసభ సీటు వస్తోందంటూ కొన్ని రోజులుగా మీడియాలో ప్రచారం కావడంతో పెద్ద ఎత్తున మహిళలు పార్టీ కార్యాలయానికి తరలివచ్చారు. మహిళ పేరు ప్రకటించలేదని తెలియడంతో అక్కడి నుంచి వెళ్లి పోయారు.

రాజ్యసభ ఎన్నికలు కేటీఆర్ కన్నుసన్నల్లోనే...

దేశ రాజకీయాలపై దృష్టి పెట్టిన కేసీఆర్...అదేస్థాయిలో తన కుమారుడు కేటీఆర్ కూడా టీఆర్ఎస్ పట్టు సాధించానికి పలు బాధ్యతలను అప్పగిస్తూనే ఉన్నారు.. తాజాగా రాజ్యసభ ఎన్నికలు కేటీఆర్ కన్నుసన్నల్లోనే జరిగేటట్టు నిర్ణయం తీసుకున్నారు. నామినేషన్లు దాఖలు చేయడం మొదలు...ఎన్నికలు, ఫలితాలు సాధించే వరకు కేటీఆర్ అన్నీ తానై వ్యవహరించనున్నారు.

మంత్రులు ఈటల రాజేందర్, కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి ఆయనకు సహకారం అందిస్తారు. సోమవారం రాజ్యసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. సమావేశానంతరం ఆ పార్టీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ మీడియాకు వివరించారు. హరీశ్‌రావుపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.

సెన్సెక్స్ ▼ 44	నిఫ్టీ ▼ 15	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)
33,307	10,226	65.16	రూ. 31,037	రూ. 40,500





కోడిగుడ్లు			
హైదరాబాద్	345	విజయవాడ	340
ఒక్కగుడ్డుకు	4.05	చెన్నై	385
వరంగల్	347	ముంబయి	390



శుక్రవారం మార్కెట్లు ముగిసేసమయానికి

బ్యాంకుల పాలనను మెరుగుపర్చండి

- ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తావో జాంగ్
- నోట్లరద్దు, జీఎస్టీతో ఏర్పడ్డ నష్టాల నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకుంటోంది..



వాషింగ్టన్ : ఆర్థిక సంస్కరణల్లో ప్రభుత్వ బ్యాంకు ల 'మొండి బకాయిల'కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బ్యాంకుల పాలనను మెరుగుపర్చాలని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తావో జాంగ్ అభిప్రాయపడ్డారు. నోట్లరద్దు, జీఎస్టీ నిర్ణయాలతో ఏర్పడ్డ నష్టాల నుంచి భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడిప్పుడే కాస్త కోలుకుంటోందని అన్నారు. ఏదేమైనప్పటికీ ఆర్థిక వ్యవస్థ కాస్త పుంజుకుందని, ప్రస్తుత త్రైమాసికంలో 7.2 శాతం వృద్ధిరేటు సాధించిందని ఆయన చెప్పారు. సంస్కరణల అమలుతో మరింత సానుకూల ఫలితాలు వస్తాయని అన్నారు. భారత పర్యటనకు రాబోతున్న ఆయన పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు మాట్లాడారు. అలాగే భారత్‌లో ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. "బ్యాంకులకు మూలధన సేకరణ, ఇతర ఆర్థిక సంస్కరణలు ఆహ్వానించదగ్గ పరిణామాలు, విస్తృతస్థాయి ప్యాకేజీ ప్రకటించటం ద్వారా, ప్రభుత్వ బ్యాంకుల 'మొండి బకాయిల' సమస్యను వేగంగా పరిష్కరించాలి. బ్యాంకింగ్ రంగంలో పాలనను మెరుగుపర్చాలి. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ పాత్రను క్రమక్రమంగా తగ్గించాలి. బ్యాంకుల రుణ సామర్థ్యాన్ని, సేవల్ని పెంచాలి"అని జాంగ్ చెప్పారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థలోని నియంత్రణా సంస్థలు తీసుకుంటున్న చర్యల్ని తాను సమర్థిస్తున్నానని చెప్పారు.

'బ్యాంకు' మోసాలకు పెద్దల సాయం

- కీలక వ్యక్తులంతా గుజరాత్ వారే !: చిదంబరం



బెంగళూరు: దేశంలో బ్యాంకులకు సంబంధించి జరుగుతున్న మోసాల్లో నిందితులకు ఓ స్థాయికి చెందిన పెద్దల సాయం ఉన్నదని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం సంచలన ఆరోపణ చేశారు. ఆయన రాసిన పుస్తకం స్పీకింగ్ ట్రూత్ టు పవర్' బెంగళూరులో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకులకు సంబంధించిన అన్ని స్కాముల్లో జ్యువెల్లరీ రంగం ప్రమేయమున్నదని తెలిపారు. దీన్ని బట్టి కుంభకోణాల్లో ప్రమేయమున్న కీలక వ్యక్తులంతా గుజరాత్‌కు చెందిన వారేనన్నారు. అయితే.. ఈ మోసాల్లో నిందితులకు ఓ స్థాయి వ్యక్తుల అండ ఉందన్న చిదంబరం.. ఎవరు సాయం చేశారు? ఎలా చేశారు? అన్న దానిపై మాత్రం తన దగ్గర సాక్ష్యాధారాలు లేవని చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) వద్ద వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ తీసుకున్న రూ.15 వేల కోట్లకు పైగా రుణాలను తిరిగి చెల్లించకుండా దేశం విడిచి పారిపోయిన సంగతి తెలిసిందే. దేశంలో బ్యాంకుల వద్ద ఖాతాదారులు రూ.1.11 లక్షల కోట్ల రుణాలను తిరిగి చెల్లించడం లేదని ఇటీవలే తేలింది. 9,340 మంది ఖాతాదారులను ఉద్దేశపూర్వక ఎగవేతదారులుగా పేర్కొంటూ ఆయా బ్యాంకుల యాజమాన్యాలు చట్టబద్ధమైన దావాలు వేశాయి.

ఓటరు గుర్తింపునకు ఆధార్ తప్పనిసరి

- సుప్రీం కోర్టుకు ఎన్నికల కమిషన్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఆధార్ నంబరును ఓటరు గుర్తింపు కార్డుకు అనుసంధా నించడంలో ఎన్నికల కమిషన్ (ఇసి) తన వైఖరిని మార్చుకుంది. ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ నంబరును అనుసంధానం చేయడాన్ని తప్పనిసరి చేయాలని కోరుతూ ఆదివారం సుప్రీం కోర్టును ఆశ్రయిం చింది. ఆధార్ నంబరును ఓటరు కార్డుకు అనుసంధానం చేయడం కేవలం స్వచ్ఛందమేనని, తప్పనిసరి కాదని ఇసి అంతకుముందు పేర్కొంది. ప్రభుత్వం ఆధార్ చట్టాన్ని ఆమోదించిన కారణంగా ఓటరు కార్డుకు అధార్ నంబరును అనుసంధానించడాన్ని తప్పనిసరి చేస్తు న్నట్లు తెలిపింది. అంతేకాకుండా ఆధార్ నంబరును అనుసంధా నించడం వల్ల ఓటింగ్ సమయంలో మోసం జరిగే అవకాశముండదని పేర్కొంది. ఆధార్ చట్టం మార్చి 2017లో ఆమోదం పొందింది. దాదాపు అన్ని అత్యవసర సేవలకు ఆధార్ నంబరును అనుసంధా నించడాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అయితే ఆధార్ రాజ్యాంగ చెల్లుబాటుపై సుప్రీంకోర్టులో ఇప్పటికే పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలై ఉన్నాయి. వీటన్నిటిపై సుప్రీం విచారణ చేపట్టింది.

వామపక్షాలపై 'కాషాయం' దుష్ప్రచారం

- రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కమ్యూనిస్టులు ధ్వంసం చేశారని అసత్య వార్తలు



అగర్తల: త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేశాక పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఆత్మరక్షణలో పడ్డ కాషాయ దళం.. వామపక్షాలపై అసత్య ఆరోపణలకు పూనుకుంది. 2008లో ఇదే రాష్ట్రంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని కమ్యూనిస్టులు ధ్వంసం చేశారని తప్పుడు వార్తలను సామాజిక మాధ్యమంలో ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ వైఖరి పై తీవ్ర ఆగ్రహంతో సమైక్యాంధ్ర ఆందోళనకారులు ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఈ విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న ఫోటో సహా సంబంధిత వార్తను డెక్కన్ క్రానికల్ పత్రిక నాడు ప్రచురించింది. కాగా ఆ ఫోటోను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేసి రాజీవ్ విగ్రహాన్ని వామపక్షాలు ధ్వంసం చేశాయని కాషాయ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న ఫోటోను వాడుకొని తాజాగా వామపక్షాలపై బురదజల్లేందుకు మితవాద సంస్థ నేతలు సామాజిక మాధ్యమంలో కుటిల యత్నానికి పాల్పడుతున్నారు. లెనిన్ విగ్రహాన్ని ధ్వంసాన్ని బీజేపీ నేతలు రామ్ మాధవ్, నలిని కోహ్లి, రాజ్యసభ సభ్యులు స్వపన్ దాస్ గుప్తా సామాజిక మాధ్యమంలో శ్లాఘించిన విషయం తెలిసిందే.

సక్సెస్ మంత్ర.. నయా మార్కెట్ తంత్రం

- షియోమీ వ్యూహానికి మొబైల్‌కంపెనీలకు షాక్
- ఆన్ లైన్, గ్రౌండ్ లెవల్లో కస్టమర్ బేస్‌తో మార్కెట్లోకి దిగిన సంస్థ
- చైనా మొబైల్స్ పై మారుతున్న ఇండియన్ యువత ధోరణి
- నాణ్యత, తక్కువ ధర, మన్నిక, అధిక ఫీచర్లే కారణం..?!
- దేశీయ మొబైల్ కంపెనీల వదిలేసిన 'మేకిన్ ఇండియా' పెద్దలు

"కొత్త మొబైల్ కొన్నావా? ఏ బ్రాండ్?? హెూ.. చైనా సరుకా.. సరే! సరే!". చైనా మొబైల్ అంటే ఇండియన్ యువతకు నిన్నటి వరకు ఉన్న అభిప్రాయం ఇదే!
మరి, నేడు..?
ఆ యువతే.. ఓ చైనా కంపెనీ తయారు చేసిన మొబైల్స్ కోసం క్యూ కడుతున్నది.

- జై





భారత మొబైల్ మార్కెట్ రంగంలో ప్రవేశించిన అతికొద్ది కాలంలోనే చైనా మొబైల్ కంపెనీ షియోమీ (గ్జియోమి) సృష్టిస్తోన్న సంచలనాలు అన్నీ ఇన్నీ కావు. ఆ కంపెనీ అనుసరిస్తోన్న వ్యాపార విస్తరణ సరళి, అమ్మకాల గిమ్మిక్కులు ప్రత్యర్థుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తేలా చేస్తున్నాయని చెప్పాల్సిందే! ఇతర బ్రాండ్ మొబైల్స్ తో పాటు భారత ఫోన్ కంపెనీలను గింగిరాలు తిప్పుతోన్న షియోమీ అనుసరిస్తోన్న నయా మార్కెట్ తంత్రంపై 'నవతెలంగాణ' స్పెషల్ ఫోకస్..

భారత స్మార్ట్ ఫోన్స్ విక్రయాలలో రారాజుగా ఉన్న దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీకి చుక్కలు చూపిస్తూ.. తక్కువ కాలంలోనే ఎక్కువ మందికి చేరిన సంస్థగా షియోమీ రికార్డులకెక్కింది. అమ్మకాల్లో సదరు కంపెనీ అనుసరించిన మార్కెట్ వ్యూహం బిజినెస్ పండితులకు సైతం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

టాప్ ప్లేస్ కి చేరువలో:

2014లో భారత మొబైల్ మార్కెట్ లోకి ప్రవేశించిన షియోమీ అనతి కాలంలోనే తన మార్కెట్ సామ్రాజ్యాన్ని విస్తృతపరుచుకొంది. గత 24 త్రైమాసికాల్లో భారత మార్కెట్లో అత్యధిక మొబైల్ అమ్మకాలను సాగించి టాప్ ప్లేస్ లో ఉన్న శాంసంగ్ కంపెనీని తోసిరాజని 2017 నాలుగో క్వార్టర్లో ఇండియాలోనే అతిపెద్ద స్మార్ట్ ఫోన్ మార్కెట్ గా ఉన్న మహారాష్ట్రలో 31.2శాతం అమ్మకాలను సాగించి షియోమీ అగ్రస్థానంలో నిలిచింది. ఇదే సమయంలో.. అక్కడ, శాంసంగ్ మొబైల్ అమ్మకాలు 15.3శాతానికి పడిపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని కెనాలిస్, కౌంటర్ పాయింట్ మరియు సైబర్ మీడియా రీసెర్చ్(సీఎంఆర్) సర్వేలు సైతం ధ్రువీకరించాయి. గత సంవత్సరం మేలో భారత మొబైల్ అమ్మకాల్లో శాంసంగ్ 29.80 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉండగా.. షియోమీ 12.90 శాతంతో రెండోస్థానంలో ఉన్నట్టు నివేదికలు తెలిపాయి. ఐతే, ప్రస్తుతం 23.5 శాతం (చెరో కంపెనీ) వాటాతో షియోమీ, శాంసంగ్ నువ్వా, నేనా అన్న రీతిన మారినట్టు అంచనా! తక్కువ ధరలో, ఎక్కువ ఫీచర్స్ ని అన్ని వర్గాల ప్రజలకు కొంగొత్త ఆఫర్స్ తో అందించడం షియోమీ వృద్ధికి ఒక కారణం కాగా, షియోమీ అనుసరించిన మార్కెట్ అడ్వర్టైజ్ మెంట్ స్ట్రాటజీ సదరు కంపెనీ సక్సెస్ కి మరో రీజన్ గా అడ్వర్టైజ్ మెంట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

అన్ని కంపెనీలకు భిన్నంగా..:

ప్రపంచంలోని అతిపెద్ద స్మార్ట్ ఫోన్ మార్కెట్లలో ఒకటిగా పేరుపొందిన ఇండియాలో.. ఇప్పటివరకూ శాంసంగ్ కంపెనీ గెలాక్సీ, గేర్ తదితర సిరీస్ ల పేరిట కొత్తకొత్త ఫోన్ మోడల్స్ ను పరిచయం చేస్తూ యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అప్పటికే, మార్కెట్లో పాతుకుపోయిన శాంసంగ్ కంపెనీని అందుకోవడం దేశీయ, అంతర్జాతీయ కంపెనీలకు కూడా కష్టంగానే మారింది. ఇతర కంపెనీల మాదిరిగా కాకుండా.. ఇండియన్ మొబైల్ మార్కెట్లో తిష్ట వేసే సంకల్పంతో .. కస్టమర్ ఫీడ్ బ్యాక్ తెలుసుకునేందుకు.. మొదటగా మూడొంతుల్లో ఒక వంతు ప్రొడక్టు అమ్మకాలను ఆన్ లైన్ ద్వారానే నిర్వహించింది షియోమీ. ఈవిధంగా రిస్క్ తగ్గించుకునే ప్రయత్నంలో షియోమీ సఫలీకృతం అయిందనే చెప్పాలి. 'అందుబాటు ధరల్లో నాణ్యమైన మొబైల్' అనే పేరు రావడంతో.. తన వ్యూహానికి మరింత పదును పెట్టింది. ఆన్ లైన్ సేల్స్ తో పాటు ఎంఐ హెూమ్, మరిన్ని షోరూంలతో జతకట్టి ఆఫ్ లైన్ సేల్స్ కు తెరలేపింది షియోమీ సంస్థ. ఆయా స్టోర్లకు వచ్చే కస్టమర్లకు.. షియోమీ మొబైల్ ని ఫస్ట్ ఆప్షన్ షోకేష్ గా ఉండేలా సదరు షోరూంలతో షియోమీ ఒప్పందం కుదుర్చుకుంది. ఇలా క్రమక్రమంగా మార్కెట్లోకి రెడ్ మీ, ఎంఐ తదితర బ్రాండ్ లను లోకల్ స్థాయిలో ప్రచారం చేసి తర్వాత దేశవ్యాప్తంగా ప్రకటనలు, సెలబ్రిటీ ప్రమోషన్లకు ప్రాధాన్యతనిచ్చింది. అన్ని కంపెనీలు మొదట ప్రకటన, ఆర్భాటాలకు పోయి చతికిలపడితే, గ్రౌండ్ లెవల్లో కస్టమర్ బేస్ ఏర్పరుచుకొని తర్వాత వ్యాపార వృద్ధిని పెంచుకోవడం షియోమీ సక్సెస్ కి కారణమని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ స్వదేశీ మొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ అధికారి పేర్కొన్నారు. ఇప్పటికే, మొబైల్ రంగంలో శాంసంగ్ కంపెనీకి షాక్ ఇస్తున్న షియోమీ.. టివి అమ్మకాల్లో సైతం తీవ్ర పోటీని ఇస్తుండటం ఆలోచించాల్సిన విషయం.

వనరుల లభ్యత, వేగవంతమైన అనుమతులు, ప్రభుత్వ సాయం వంటి అంశాలు చైనా దేశంలో నిబద్ధతతో సాగడం వల్లే షియోమీ, ఒప్పో, లెనోవో, వివో వంటి చైనా కంపెనీలు విదేశీ మార్కెట్లో గణనీయ వృద్ధిని నమోదు చేస్తున్నాయి. ఐతే, మేకిన్ ఇండియా అంటూ ప్రచారాలకే పరిమితమై, స్వదేశీ సంస్థలను పట్టించుకోని మన ప్రభుత్వ పెద్దల మూలంగా.. మైక్రోమ్యాక్స్, కార్బన్, లావా, మాక్స్, ఇంటెక్స్ వంటి భారత కంపెనీల మొబైల్ అమ్మకాలు విదేశీ కంపెనీల ముందు ఉసూరుమంటున్నాయి. త్వరలోనే, ఈ పరిస్థితిలో మార్పు వస్తుందని ఆశిద్దాం.

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రత్యేక ఆడిట్

- ఎన్‌పీఏలు 50 కోట్లు దాటితే సీబీఐకి సమాచారం

న్యూఢిల్లీ: వరస కుంభకోణాలతో గందరగోళంలో పడిపోయిన ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఆర్థిక నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక ఆడిట్ నిర్వహణను ఆర్బీఐ మొదలుపెట్టింది. ఈ ఆడిట్ నిర్వహణ వ్యాపారాలకు అందించే రుణా(ట్రేడ్ ఫైనాన్స్)నికి సంబంధించి ముఖ్యంగా లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌వోయూ)ల జారీపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నది. ఇందులో భాగంగానే జారీ చేసిన ఎల్‌వోయూల వివరాలు, ఆమోదించిన మొత్తాన్ని తెలుపాలని బ్యాంకులను ఆర్బీఐ ఆదేశించింది. ఈ వివరాలతోపాటు ముందస్తు రుణ పరిమితికి ఇచ్చిన అనుమతులు, ఇతర వివరాలనూ అడిగింది. నీరవ్‌మోడీ కుంభకోణంతోపాటు ఇటీవల వెలుగుచూసిన ఆర్థికనేరాలన్నీ ట్రేడ్ ఫైనాన్స్‌కు సంబంధించినవే కావడం గమనార్హం. అలాగే ఉద్దేశ్యపూర్వక ఎగవేతదారులు పొందిన రుణాల మూలాలు కూడా ట్రేడ్ ఫైనాన్స్ విధానంలోనే ఉన్నాయి. ట్రేడ్ ఫైనాన్స్‌లో భాగంగా ఉన్న ఎల్‌వోయూ, లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌సీ)ల జారీపై ఆర్బీఐ మరింత క్షుణ్ణంగా ఆడిట్ చేయాల్సి ఉన్నది. నీరవ్‌మోడీ కుంభకోణం ఎల్‌వోయూల జారీ ద్వారానే చోటుచేసుకున్నది. ఈ కుంభకోణం చోటుచేసుకున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాడీ హౌజ్‌లో ఆర్బీఐ ఆడిట్ చివరగా 2009లో జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. పెద్దమొత్తాల్లో వ్యక్తిగత ఖాతాలు నిర్వహిస్తున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాడీ హౌజ్ బ్రాంచీల్లాంటి వాటిలో ఏడాదికి ఒక్కసారైనా ఆర్బీఐ ఆడిట్ జరగాల్సి ఉంటుంది. ఆడిటింగ్ లోపాలను అధిగమించేందుకే ఆర్బీఐ ఈ ప్రత్యేక ఆడిట్‌ను ప్రారంభించినట్టు తెలిసింది.

నిరర్థక ఆస్తులపై నిఘా:

నిరర్థక ఆస్తులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రభుత్వం సూచించింది. 50 కోట్ల రూపాయలు దాటిన నిరర్థక ఆస్తులను పరిశీలించి ఆర్థికమోసం జరిగే సంభావ్యత ఉంటే సీబీఐకు రిపోర్ట్ చేయాలని చెప్పింది. నిర్వహణ, సాంకేతిక సమస్యలేవైన ఉంటే వాటిని ముందస్తుగా అరికట్టి జవాబుదారీతనాన్ని కాపాడుకునేందుకు సరైన ప్రణాళికలతో రెండు వారాల్లో ముందుకు రావాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వరంగ బ్యాంకులకు నిర్దేశించిన విషయం తెలిసిందే.

కమలనాథుల ఫేక్ న్యూస్

- దేశంలో నకిలీ వార్తలకు కేరాఫ్ గా మారుతోన్న బీజేపీ
- కేరళ గోవధ, సచిన్ ఆధ్యాత్మికత, గూర్ఖాలాండ్ అల్లర్లు అంటూ నేతల పైశాచికత్వం
- సోషల్ మీడియా దుష్ప్రచారాలపై కేసులు నమోదు చేస్తే, వాళ్ళదే మెజారిటీ!
- నిజాలను పక్కనబెట్టి, వదంతులు.. ప్రజల్ని రెచ్చగొట్టే పోస్టులు చేసిన ప్రముఖులు







"నిజం చెప్పులు వేసుకునేలోపే, అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందన్నది ఒక సామెత."

ప్రపంచవ్యాప్తంగా మనుషుల మధ్య దూరాన్ని చెరిపేస్తూ.. యూజర్ల అభిమానాన్ని చూరగొన్న సామాజిక మాధ్యమాలు (సోషల్ మీడియా వేదికలు) .. నేడు సంచలనాల కోసం పాకులాడుతూ.. అర్థసత్యాలతో మొదలై చివరకు అసత్యాల అడ్డాలుగా మారడం తెలిసిందే! ఈ వికృత క్రీడకు సారథ్యం వహిస్తూ.. దేశ ప్రజల భావోద్వేగాలతో ఆటలాడుకుంటున్న వాళ్ళలో పాలకవర్గం ప్రథమ స్థానంలో ఉండటం విచారకరం

నకిలీ న్యూస్ రారాజులు వాళ్ళే!:

అన్నింటికీ ఆన్‌లైన్ మాధ్యమాలే దిక్కు అన్నట్టు మారిపోయింది నేటి పరిస్థితి. దీనిని గమనించిన వివిధ పార్టీలు తమ రాజకీయ ప్రచారాలకు సామాజిక వేదికలను ఒక అస్త్రంగా మార్చుకుంటున్నాయనే చెప్పాలి. దేశ పౌరుల భావోద్వేగాలను రెచ్చగొట్టేవిధంగా అసత్య వార్తలను సృష్టిస్తూ.. పబ్బం గడుపుకోవడం కొన్ని పార్టీలకు నిత్యకృత్యమైందని ఇప్పటికే కొన్ని అధ్యయనాల్లో తేలింది. ముఖ్యంగా కాషాయమూకల సోషల్ మీడియా చిందులు మిగతావారితో పోలిస్తే మరీ పెట్రేగిపోతున్నట్టు ఇదివరకు జరిగిన ఘటనలు చూస్తే తెలుస్తోంది. గత సంవత్సరం.. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ తన తల్లి ఆధ్యాత్మికత గురించి ఇచ్చిన స్టేట్‌మెంట్‌ని.. ఎస్ గురుమూర్తి అనే న్యాయవాది బీఫ్, గోవధ, హిందూ మతం అని కొన్ని పదాలను కలుపుతూ.. ఓ మంచి నకిలీ స్టేట్‌మెంట్ తయారుచేసి రెహమాన్ అన్నాడని ట్వీట్ చెయ్యడం.. నిజానిజాలు తెలుసుకోకుండా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్.. గురుమూర్తి ట్వీట్‌ను రీ-ట్వీట్ చెయ్యడం పెద్ద దుమారమే రేపింది. కేరళ బీజేపీ లీడర్ సురేంద్రన్ ఎక్కడో బంగ్లాదేశ్ లో ఎప్పుడో జరిగిన గోవధ ఫొటోలను ఫేస్ బుక్ లో పోస్ట్ చేసి.. కేరళా వ్యాప్తంగా నడి వీధుల్లో గోవధ కర్కశంగా జరుగుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవట్లేదని పోస్ట్ చేసి విధ్వంసం సృష్టించాలనుకోవడం.. తర్వాత, నిజం బయటపడి మిన్నకుండిపోవడం విదితమే! పశ్చిమ బెంగాల్ లో హిందువులపై దాడులు జరుగుతున్నాయని.. ఓ భోజ్ పురి సినిమాలోని ఫొటోను.. అక్కడ జరుగుతున్న ఆకృత్యాలకు సాక్ష్యం అనే విధంగా ఫేస్ బుక్ వేదికగా హర్యానా బీజేపీ లీడర్ విజేత మాలిక్ షేర్ చెయ్యడం.. ఎంత రచ్చకు దారి తీసిందో ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. ఇక, 2008లో జరిగిన గూర్ఖాలాండ్ అల్లర్ల ఫొటోను 2017లో జరిగినట్టు ఏమార్చిన మేజర్ గౌరవ్ ఆర్య, 3డి నమూనా బస్ స్టాండ్ ఫొటోను నిజమైన బస్ స్టాండ్ గా పోస్ట్ చేసి గుజరాత్ అభివృద్ధి ఇలా ఉంది అని గొప్పలకు పోయి.. నెటిజన్ల చేతిలో అక్షింతలు వేయించుకున్న బాబుల్ సుప్రియో, వర్ణిక కుందు విషయంలో రేగిన పుకార్లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ లిస్టు ఎంత పెద్దదో చెప్పలేం. రాజకీయ పార్టీల స్వలాభం కోసం(ముఖ్యంగా, బీజేపీ స్వలాభం కోసం).. నేటి సోషల్ మీడియా.. అసత్య మీడియాగా మారుతుండటం నిజంగా బాధపడాల్సిన విషయం.

ఆ విషయంలో మెజారిటీ వాళ్ళదే!:

సామాజిక మాధ్యమాల్లో సాగుతోన్న అసత్య వార్తల ప్రవాహంపై ఇప్పటికే, పలు మార్లు చర్చలు జరిగాయి. సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న ఫేక్ న్యూస్ ను నియంత్రించడానికి ఐటీ చట్టంలోని కొన్ని సెక్షన్లే తప్పా.. పటిష్టమైన ప్రత్యేక చట్టం ఇప్పటివరకు మన దగ్గర లేదనే చెప్పాలి. ఐటీ చట్టం సెక్షన్ 65 సమాచార ట్యాంపరింగ్, సెక్షన్ 66 తప్పుడు సందేశాలు పంపడం, వ్యక్తిగత వివరాల చౌర్యం, సెక్షన్ 67 అసభ్య సందేశాలు పోస్ట్ చేస్తూ షేర్ చెయ్యడం, సెక్షన్ 69 ఎన్‌క్రిప్షన్, డిస్క్రిప్షన్ తదితరాల కింద సోషల్ మీడియాను దుర్వినియోగం చేసే వారిపై పోలీసులకు కేసు నమోదు చేసే హక్కు ఉన్నది. నేరం రుజువైతే, అసత్య ప్రచారంవల్ల జరిగిన నష్టాన్ని బట్టి నిందితుడికి సంవత్సరం నుండి మూడేండ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశమున్నది. ఒకవేళ, దేశంలో రాజకీయ పార్టీలు చేస్తోన్న ఈ అసత్య క్రీడల చిట్టాను బయటకి తీస్తే, నమోదయ్యే కేసుల్లో మెజారిటీ వాటా పాలకపక్షానిదేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

స్వేచ్ఛ, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కును భారత పౌరులకు రాజ్యాంగం కల్పించింది. ఐతే, అది ఇతరుల పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించేవిధంగా అబద్ధాల మాయమై ఉండకూడదు. ఇదే విషయాన్ని గుర్తుచేస్తూ.. 'సామాజిక మాధ్యమాల్లో జరిగే దుష్ప్రచారాలను నియంత్రించడానికి ప్రత్యేకంగా చట్టం రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నద'ని జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఓ సందర్భంలో గుర్తుచేసింది. మరి ఆ చట్టం రూపొందే రోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం.

సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు -- కొన్ని విశేషాలు:

నోట్ల రద్దు తర్వాత ప్రవేశపెట్టిన కొత్త 2000 నోటు యునెస్కో గుర్తింపు పొందిందట! జిపిఎస్, చిప్, రేడియో యాక్టివ్ ఇంకు తదితర అత్యాధునిక ఫీచర్లే ఈ గుర్తింపు రావడానికి కారణమట! కాషాయ కాంపౌండ్ నుండి పుట్టిన ఈ ఫేక్ వార్త ఎంత వైరల్ అయిందో చెప్పేదేముంది.

'భారత తొలి సీప్లేన్ లో ట్రావెల్ చేసిన తొలి వ్యక్తి మోడీ' అంటూ నరేంద్ర మోడీ వెబ్‌సైట్ ఆర్భాటంగా పోస్ట్ చెయ్యగా.. కాషాయ నేతలు ఆ అసత్య వార్తను సోషల్ మీడియాలో హెూరెత్తించడం విశేషం.

'టైమ్స్ నౌ' లైవ్ షోలో బీజేపీ నేత సంబిత్ పత్రా.. రెండో ప్రపంచ యుద్ధం సందర్భంగా సైనికులు ఎగరేసిన విదేశీ జెండాను మార్ఫింగ్ చేసి మన జెండాగా వీక్షకులకు చూపడం అప్పట్లో పెద్ద వివాదానికి దారితీసింది.

సామాజిక మాధ్యమాల్లో విస్తరిస్తున్న అత్యధిక ఫేక్ న్యూస్ పార్టీల సోషల్ మీడియా వింగ్స్ వల్లనే ప్రచారమవుతోందని ఓ అంచనా.

అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నిపుణులు సర్వే ప్రకారం.. నిజంగా జరిగిన వార్తల కంటే అబద్ధపు వార్తలు సుమారు 70 శాతం ఎక్కువగా సోషల్ మీడియాలో వీరవిహారం చేసినట్టు తేలింది.




వేల సంవత్సరాల భారతదేశ చరిత్రలోగానీ సాహిత్యంలోగానీ అసలు ఈ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో హిందూ అనే పదమే కనిపించదు. కాబట్టి హిందూ అన్న పదం గానీ, హిందూజాతి అన్న పదాలు గానీ పూర్తిగా కల్పితమైనవి. ఈ మనువాద రాజకీయాలకు బీజాలు 1925లోనే పడ్డాయి. ఆనాటి ఆర్ఎస్ఎస్ నాయకుడు గోల్వాల్కర్ హిందూ జాతిని, హిందూ మతాన్నీ, హిందూ సంస్కృతినీ భారతదేశంలో ఉన్నవారంతా ఖచ్చితంగా స్వీకరించాలని, అలా స్వీకరించడానికి నిరాకరించినవారు విదేశీయులుగా పరిగణించబడతారని లేదా హిందూ జాతికి తప్పకుండా లొంగి ఉండాలని ప్రకటించాడు. నాడు హిట్లర్ నాజీలను ఏ విధంగా జాతి పేరు మీద రెచ్చగొట్టి లక్షలాది యూదుల్ని నిర్దాక్షిణ్యంగా ఉచకోత కోయించాడో నేడు ఇండియా కూడా హిందూ జాతి లేక భారతజాతి పేరుమీద వైదిక ఫాసిజం చెలరేగుతూ వేలాది మంది దళితుల్ని, ఆదివాసీలను, శూద్రులను, క్రిస్టియన్లను, ముస్లింలను, హేతువాదులను చంపుతోంది. మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతోంది. నడిరోడ్లపై నగ్నంగా ఊరేగిస్తుంది. దేశవ్యాప్తంగా దళితులు, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు రోజోరోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. అంబేద్కర్ రింగ్‌టోన్ పెట్టుకున్నాడని సాగర్ అనే యువకుడిని చంపిన ఘటన మహారాష్ట్రలో చూసాం. ఒకవైపు అంబేద్కర్ ఇల్లు కొంటూ, బుద్ధగయను సందర్శిస్తూ, అంబేద్కర్ జయంతులను నిర్వహించడానికి పోటీపడుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ఒక్క రోజైనా ఈ దాడుల మీద స్పందించలేదు, పైగా అంబేద్కర్‌పై కపట ప్రేమను చూపిస్తున్నారు. ఈ చరిత్రలో మాయని గాయాలెన్నో ఉన్నవి. చుండూరు దళితులపై దాడిచేసిన హంతకులను నిర్దోషులుగా విడుదల చేయడంలో న్యాయవ్యవస్థలో కుడా ఎంత కుల వివక్ష దాగి ఉందో అర్థమవుతుంది.

ఆధునిక మనువాదులకు పతనమార్గం అంబేద్కరే

మట్టా క్రిష్ణయ్య

డిసెంబర్, 25 1927న భారతదేశ చరిత్రలో చారిత్రాత్మకమైన రోజు. మనుస్మృతిని సరిగ్గా 88 సంవత్సరాల క్రితం ఇదే రోజు బాబాసాహెబ్ అంబేద్కర్ తగులబెట్టారు. అంటరానివారికి, శూద్రులకు చదువునూ, సంపదను, సమానత్వాన్ని, హక్కులనూ నిరాకరించి బానిసత్వం, బహిష్కరణలతో మనిషిని మనిషిగా చూడని ఈ హైందవ సమాజాన్ని నిలదీస్తూ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను నిషేధించిన మనుధర్మశాస్త్రాన్ని తగులబెట్టారు. కులం చుట్టూ ఈ దేశ పరిస్థితులు ఎలా అల్లుకుని ఉంటాయో బాబాసాహెబ్ అంబేద్కర్ తన రచనలలో వివరిస్తూ, ఈ కుల వ్యవస్థలకు కారణమైన హిందూమత పునాదులను ధ్వంసం చేసే వరకూ శూద్రులు, అంటరానివాళ్ల బతుకులు మారవని అంబేద్కర్ సూచించారు.

వేల సంవత్సరాల భారతదేశ చరిత్రలోగానీ సాహిత్యంలోగానీ అసలు ఈ వేదాలు, పురాణాలు, ఇతిహాసాలలో హిందూ అనే పదమే కనిపించదు. కాబట్టి హిందూ అన్న పదం గానీ, హిందూజాతి అన్న పదాలు గానీ పూర్తిగా కల్పితమైనవి. ఈ మనువాద రాజకీయాలకు బీజాలు 1925లోనే పడ్డాయి. ఆనాటి ఆర్ఎస్ఎస్ నాయకుడు గోల్వాల్కర్ హిందూ జాతిని, హిందూ మతాన్నీ, హిందూ సంస్కృతినీ భారతదేశంలో ఉన్నవారంతా ఖచ్చితంగా స్వీకరించాలని, అలా స్వీకరించడానికి నిరాకరించినవారు విదేశీయులుగా పరిగణించబడతారని లేదా హిందూ జాతికి తప్పకుండా లొంగి ఉండాలని ప్రకటించాడు. నాడు హిట్లర్ నాజీలను ఏ విధంగా జాతి పేరు మీద రెచ్చగొట్టి లక్షలాది యూదుల్ని నిర్దాక్షిణ్యంగా ఉచకోత కోయించాడో నేడు ఇండియా కూడా హిందూ జాతి లేక భారతజాతి పేరుమీద వైదిక ఫాసిజం చెలరేగుతూ వేలాది మంది దళితుల్ని, ఆదివాసీలను, శూద్రులను, క్రిస్టియన్లను, ముస్లింలను, హేతువాదులను చంపుతోంది. మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతోంది. నడిరోడ్లపై నగ్నంగా ఉరేగిస్తుంది. దేశవ్యాప్తంగా దళితులు, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు రోజోరోజుకూ పెరుగుతూనే ఉన్నాయి. అంబేద్కర్ రింగ్‌టోన్ పెట్టుకున్నాడని సాగర్ అనే యువకుడిని చంపిన ఘటన మహారాష్ట్రలో చూసాం. ఒకవైపు అంబేద్కర్ ఇల్లు కొంటూ, బుద్ధగయను సందర్శిస్తూ, అంబేద్కర్ జయంతులను నిర్వహించడానికి పోటీపడుతున్న కొన్ని రాజకీయ పార్టీలు ఒక్క రోజైనా ఈ దాడుల మీద స్పందించలేదు, పైగా అంబేద్కర్‌పై కపట ప్రేమను చూపిస్తున్నారు. ఈ చరిత్రలో మాయని గాయాలెన్నో ఉన్నవి. చుండూరు దళితులపై దాడిచేసిన హంతకులను నిర్దోషులుగా విడుదల చేయడంలో న్యాయవ్యవస్థలో కుడా ఎంత కుల వివక్ష దాగి ఉందో అర్థమవుతుంది. హర్యానా రాష్ట్రంలో జితేందర్ అనే దళిత యువకుడిని సజీవ దహనం చేసే ఉద్దేశంతో అతడి ఇల్లు తగులబెట్టారు. ఈ ఘటనలో అతని ఇద్దరు చిన్నారులు సజీవ దహనమయ్యారు. ఈ విషయంపై మంత్రి వికె.సింగ్‌ను మీడియా ప్రశ్నించగా "కుక్కలు చనిపోతే నేను స్పందించాలా?" అని అన్నాడంటే ఈ అగ్రకుల దురహంకారం ఎంత ఉన్నదో అర్థంచేసుకోవచ్చు. కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరెలో దళిత రచయిత హుతంగి ప్రసాద్ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పుస్తకం రాసినందుకు అతనిపై దాడిచేసి చేతివేళ్లు నరకడానికి ప్రయత్నించారు. నల్లగొండ జిల్లా తుంగతుర్తిలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని కూతురిని నరికి చంపారు. ఆంధ్రప్రదేశ్ దేవరంపాడులో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూమిని దౌర్జన్యంగా అక్రమంగా అనుభవిస్తూ వారి పొలాల్లో పంటను తొక్కించడమే కాకుండా మిగిలిన పంటను కోసుకుందామని వెళ్లిన వారిపైన రెండు ట్రాక్టర్ల మనుషులతో దాడి చేయించాడు. మధ్యప్రదేశ్‌లో దళిత యువకుడు తన పెండ్లిలో గుర్రం ఎక్కాడనే కారణంతో అగ్రకులాల వాళ్లు రాళ్లతో దాడిచేశారు. చిగురుమామిడిలోని ప్రభుత్వ పాఠశాలలో దళితులు వండిన మధ్యాహ్న భోజనం తినలేమని పిల్లలు రోజు స్కూల్ నుండి వెళ్లిపోతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్లో పద్నాలుగేండ్ల దళిత బాలికపై అత్యాచారం, రోడ్డుపై వెళితే నీడ పడిందని బాలికపై దాడులు, హర్యానాలోని దౌలత్‌పూర్‌లో యువకుడి సజీవ దహనం, తమిళనాడులోని మధురైలో దళితులు గుడిలో పుజచేసారని, లక్ష్మింపేట దళితులపై భూమికోసం దాడులు ఇలా రాసుకుంటూ పోతే పేజీలు చాలవేమో. ఆ రాజ్యాంగం స్థానంలో మత గ్రంథాలను పెట్టాలనుకుంటున్న వారు ఈ దేశాన్ని హైందవీకరించాలనుకుంటున్నారు. గోవింద్ పన్సారే, దబోల్కర్, కల్బుర్గిలను ఇంకా ఇతర రచయితలను, ఉద్యమకారులను వాళ్ల వాక్ స్వాతంత్రపు హక్కును కాలరాస్తూ చంపుతున్నారు. ఇంకోవైపు తినే తిండిమీద ఆంక్షలు విధిస్తూ దాడులు చేస్తున్నారు. దాద్రిలో అఖ్లాక్ అనే వ్యక్తిని ఆవు మాంసం తిన్నాడని చంపారు. జమ్మూకాశ్మీర్‌లో రషీద్ అనే ఎమ్మెల్యేను అసెంబ్లీ సాక్షిగా కొట్టారు. హర్యానాలో ఐదుగురు దళితులను వాళ్ల వత్తిలో భాగమైన ఆవు చర్మాన్ని వలుస్తున్నారని రాళ్లతో కొట్టి, తల్వార్లతో నరికి చంపారు. "బీఫ్ తింటాను" అని ప్రకటించినందుకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దిరామయ్యను "తలనరుకుతాం" అంటూ బహిరంగంగా ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీలో దళిత బహుజనుల ఆహారమైన పెద్దకూర తింటామంటే తల్వార్లతో దాడి చేస్తామనీ, దాద్రీ ఘటన పునరావతం అమవుతుందనీ ప్రకటించిన బీజేపీ ఎమ్మెల్యేపై చట్టం చర్యలు తీసుకోకపోగా, పెద్దకూర పండగనే అడ్డుకున్నారు.



ఇక విశ్వవిద్యాలయాలపై దాడి చేస్తున్న తీరును మనం అర్థం చేసుకోవచ్చు. 2004లో హెచ్‌సీయూలో పది మంది దళిత విద్యార్థులపై నిషేధం విధించారు. ఈఎఫ్ఎల్‌యూలో ముగ్గురు విద్యార్థుల నిషేధం. మద్రాస్ ఐఐటీలోని అంబేద్కర్-పెరియార్ స్టడీ సర్కిల్‌పై నిషేధం, హెచ్‌సీయూలో అంబేద్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులపై నిషేధం విధించాయి. ఆధునిక అగ్రహారాల్లాంటి ఐఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలలో విద్యార్థులపై వివక్షను తట్టుకోలేక జరుగుతున్న ఆత్మహత్యలకు లెక్కేలేదు. ఇక ఈ మనువాదుల కండ్లు ఇప్పుడూ రిజర్వేషన్స్ మీద పడ్డాయి. ఇస్తే మాకు ఇవ్వండి లేదా అందరికీ తీసివెయ్యండని గగ్గోలుపెడుతున్నారు. ఆనాటి పటేల్ నుండి ఈనాటి పటేల్ వరకు దేశమంతా వ్యాపారరంగంలో విస్తరించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఉన్న కాస్తోకూస్తో రిజర్వేషన్స్ కూడా తీసెయ్యాలని అంటున్న ఈ అగ్రకుల పటేళ్ల స్వభావం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను బానిసలుగా మార్చడమే. ఈ దేశంలో పరిశ్రమలు, గనులు, వ్యవసాయ, కాంట్రాక్టు, వైద్యం, విద్య, రక్షణ, సైన్సు, టెక్నాలజీ మొదలైన రంగాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వాటాలు ఎంతో లెక్కతీయవలసిన అవసరం ఉంది. ఇంకా వీటిలో సమాన వాటా కోసం పోరాడవలసిన అవసరం ఉంది. ఇక రాజ్యాధికారం గురించి మాట్లాడితే ఇప్పటివరకు ఎన్నికైన దళిత నాయకులు 63 సంవత్సరాల పార్లమెంట్ చరిత్రలో దళితుల సమస్యలపై మాట్లాడింది కేవలం రెండు గంటలు మాత్రమే. అంటేవారి చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుంది. అప్పుడే పెరుగుతున్న దళిత చైతన్యం, దళిత మహాసభ, దళిత్ ఫాంథర్స్ పోరాటాలతో తమ గొంతును వినిపిస్తున్న దళితులు ఒక పక్క, ఓబీసీలకు రిజర్వేషన్స్ కల్పించాలని మండల్ కమిటీ సిఫార్సులు ఒకపక్క, ఈ రెండూ కాక ఈ దేశాన్ని ప్రయివేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ పేరు మీద ఈ దేశాన్ని ప్రపంచానికి తాకట్టు పెట్టడంతో పెల్లుబిక్కిన ఆందోళనలు ఇంకోవైపు పెరుగుతున్న ఈ చైతన్యాన్ని జీర్ణించుకోలేని ఈ అగ్రకుల పెట్టుబడిదారులు ప్రజల చైతన్యాన్ని అడ్డుకోవడానికి మతం అనే అయుధంతో అడ్డుకట్ట వేయడానికి, బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి రోజైన డిసెంబర్ 6న బాబ్రీ మసీదును కూల్చివేసి చరిత్రలో దాన్ని బ్లాక్ డేగా చేసారు. అంటే ఈ మనువాదులు ఎంత పక్కాగా వ్యక్తులపై, భావజాలాలపై దాడులు చేస్తారనేది ఈ సంఘటనతో అర్థం చేసుకోవచ్చు. రాజకీయాలను మతీకరణ చేసే ప్రయత్నాలు రోజురోజుకూ ముమ్మరమవుతున్నాయి. రాజ్యాంగమే మన పవిత్రగ్రంథం అని ఓ పక్క ప్రధాని నరేంద్రమోడీ అంటూ మరోపక్క రాజ్యాంగంలో 'లౌకిక' అన్న పదం తొలగించాలని వారి పార్టీ నేతలు అంటున్నారు.

ఈ దేశంలో ఉద్యమాల చరిత్రలో జరిగిన త్యాగాలు, రచనలు, సామాజిక, సాంస్కృతిక పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుంటూ ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ పోరాటాలను ప్రజాస్వామ్యయుతంగా చెయ్యడమే మన ముందున్న మార్గం. అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం, ఇతర రచనల ద్వారానే ప్రజాస్వామ్య లౌకికవాదులు మనువాదాన్ని ఎదిరించి ఈ దేశాన్ని పునర్నిర్మాణానికి బాటలు వేస్తుంది.

సెల్ : 9866338308

అంబేద్కర్ విగ్రహాన్ని జీర్ణించుకోలేక దాడులు

కులం పేరుతో దూషిస్తూ.... చితక బాదిన వైనం ● జడ్చర్లలో జడలు విప్పిన ఆధిపత్యం ● కేసు పెట్టినా పట్టించుకోని పోలీసులు

పరిపూర్ణం

"అంబేద్కర్ విగ్రహం ఇక్కడ పెట్టొద్దు. మీ ఇంటిదగ్గర ఏర్పాటు చేసుకోండి, ఇదేమైన మీ తాత జాగీరా, మీ ఇష్టమొచ్చిన విగ్రహాలు పెట్టడానికి. మీ జాతి మూల పురుషుడైతే పల్లకిలో ఊరేగించండి. కాని ఇక్కడికి వచ్చి మీరు విగ్రహాలు... పూలదండలంటూ... పెద్దరికం చేయకండి, మరోసారి విగ్రహం అంటూ ఇక్కడికొస్తే... బరితేపూజ చేస్తాం" అంటూ... అగ్రకులాల వారు దళితులకు హెచ్చరికలు చేస్తున్నారు. ఎదురుతిరిగితే దాడులకు పాల్పడుతున్నారు. జడ్చర్ల మండల కేంద్రంలో ఈనెల 1న జరిగిన హోళీ పండుగ రోజు దళిత యువకులపై ఆధిపత్య కులాలవారు దాడి చేశారు. ఈ ఘటనపై కేసు పెట్టినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదంటే దళితులపై పోలీసులు సైతం ఎంత వివక్ష చూపుతున్నారో మనకు తెలుస్తోంది.

దళిత జాతి ఆరాధ్య దైవమైన డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని జడ్చర్ల పట్టణంలో ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన కూడలిలో పెట్టాలని నిర్ణయం చేశారు. "మేము ప్రతి ఏటా ఇక్కడ గణేష్ విగ్రహం పెడతాం. మీరు అంబేద్కర్ విగ్రహాన్ని ఎలా పెడతారు" అని ఆధిపత్య కులాల వారు వారించారు. ఆధిపత్యవాదులు అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకరించారు. అంబేద్కర్ విగ్రహాన్ని తెచ్చి మూడు నెలల క్రితం చౌరస్తాలో పెడితే... అడ్డుకున్నారు. మంత్రికి సైతం ఆధిపత్యవాదులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన మంత్రి లక్ష్మారెడ్డి అంబేద్కర్ విగ్రహాన్ని తీసుకెళ్లాలని మున్సిపాల్టీ సిబ్బందిని ఆదేశించడంతో అధికారులు విగ్రహాన్ని అక్కడి నుండి తరలించినట్టు సమాచారం. విగ్రహం ఏర్పాటు సమస్య వచ్చినప్పుడల్లా అడ్డుకోవడంతో కొన్ని నెలలుగా విగ్రహం మున్సిపాల్టీ కార్యాలయంలో చెత్తకుండీల మధ్యనే ఉంది.



ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్న దళితులు

రెక్కాడితే గాని డొక్క నిండని నిరుపేదలు ఇక్కడి దళితులు. హోళీ పండుగ రోజు సంతోషంతో వారు రంగులతో హోళీ ఆడారు. మధ్యాహ్నం అలసిపోయిన దళిత యువకులు వచ్చి చౌరస్తాలో టీ తాగుతుండగా ఆధిపత్యవాదులు కూడా అక్కడికి చేరుకున్నారు. మీరు అంబేద్కర్ విగ్రహాన్ని పెడితే మేము కూడా మరో విగ్రహాన్ని అక్కడే పెడతామని హెచ్చరించారు. మా కాలనీకి వెళ్లే రహదారిలో మీరెలా విగ్రహాన్ని పెడతారని ప్రశ్నించడంతో దళితులపై చేయి చేసుకున్నారు. టీ కొట్టునుండి బయటకు తీసుకొచ్చి "మాదిగ కొడుకుల్లారా..' అని దుర్భాషలాడుతూ చితకబాదారు. బీసీలు అధికంగా ఉండటమేగాక హోళీ రోజు బాగా తాగి ఉన్నారు. స్థానికులు విడిపించేందుకు ప్రయత్నించినా వదలకుండా దాడి చేశారు. దళిత యువకులైన గిరిధర్, గణేష్, శివ, కృష్ణ, మహేష్‌లను చితకబాదారు. పండ్ల రాజు, పండ్ల యాదయ్య, బొర్ర శ్రీనివాసులు, శేఖర్, చిలుకూరి శ్రీను, బండ్ల హన్మంతులు కలిసి దాడి చేశారు. వీరిపై అదే రోజు కేసు పెట్టినా ఇప్పటివరకు నమోదు చేయకుండా పోలీసు అధికారులు తాత్సారం చేస్తున్నారు.





దాడిలో గాయపడిన దళిత యువకులు

దళితులపై దాడి చేస్తే... కేసు నమోదు చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావడం లేదని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సంఘటన జరిగిన రోజు కేసు పెడితే...సంఘటన జరిగిన స్థలానికి ఏఎస్ఐ వచ్చి పరిశీలించాడు కానీ ఇప్పటికీ కేసు నమోదు కాలేదు. ఎస్సీలపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయడం లేదు. కాని అదే ఎస్సీలు దాడి చేయకున్నా కౌంటర్ కేసు పేరుతో వారిపై కేసులు నమెదు చేసి జైలుకు పంపుతున్నారు. తెలకపల్లి మండలం నడిగడ్డ, కార్వంగ, తాళ్లపల్లి గ్రామాలలో దాడులు జరిగితే దళితులపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే... దళితులపైనే కౌంటర్ కేసు నమోదు చేశారు. గంట్రావుపల్లిలో దళితుడి హత్యను ప్రశ్నించినందుకు రమేష్ అనే దళిత సర్పంచును అరెస్టు చేసి జైలుకు పంపారు. జిల్లాలో నిత్యం ఇలాంటి ఘటనలు జరగుతున్నా... పోలీసులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సెల్ : 9490099324

దాడులు చేసినా పట్టించుకోవడం లేదు

హోళీ పండుగ రోజు మాపై దాడులు చేసినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కులం పేరుతో దూషిస్తూ... దాడి చేసిన వారిని ఇప్పటికీ అరెస్టు చేయలేదు. దీంతో దాడులకు పాల్పడిన వారు తిరిగి ఎప్పుడు విరుచకపడుతారోనని అందోళనగా ఉంది.

కురుమయ్య, దళితుడు, జడ్చర్ల

విడిపించడానికి వెళ్లిన నన్నూ కొట్టారు

దళితులను అగ్రకులాల వారు కొడుతుంటే నేను విడిపించడానికి పోయాను. నన్ను కూడా చితక బాదారు. కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. ఎంత వేడుకున్నా వదల్లేదు. పోలీసుల ముందు దాడులు చేసినా నివారించలేదు. వారిపై చర్యలు తీసుకోకుంటే మరోసారి దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.

గిరిధర్, జడ్చర్ల పాతబస్తీ

అడవి బిడ్డల ప్రసవాలు అడవిలోనే...

పెనుక ప్రభాకర్

ఎన్ని ప్రభుత్వాలు మారినా అడవి బిడ్డలకు కనీస సహకారం అందడం లేదు. ఓట్ల కోసం ఎన్నో హామీలు ఇచ్చే నాయకులు ఆ తర్వాత ముఖం చాటేయడమే ఇందుకు కారణం. దీంతో ఏ దిక్కూలేని జీవచ్ఛవాలుగా అడవి బిడ్డలు జీవనం సాగిస్తున్నారు. కనీసం అనారోగ్యాల బారిన పడిన సందర్భంలోనూ మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం కూడా వారికి లేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా అడవి ఆడ తల్లులు గర్భం దాల్చితే వారు నరకం అనుభవిస్తుంటారు. కనీసం సరైన రోడ్డు సదుపాయం కూడా లేకపోవడంతో ఎక్కడో 20కి.మీ. దూరంలో ఉన్న వైద్యశాలకు కాలినడకన వెళ్లాల్సిన దుర్భర స్థితి. మార్పు ఎన్నటికి వచ్చేనో అర్థం కాని పరిస్థితుల్లో గిరిజన ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.



రాష్ట్రంలో ఏజెన్సీ ఏరియాల్లో పిట్టల్లాగా బతుకుతున్న గిరిజన గర్భిణుల దీనగాథ. గుట్టల్లో గొడుగులాంటి గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న గిరిజనం దారుల్లేని దారిద్ర్యం పుణ్యమాని నెలలు నిండిన అడవి బిడ్డలకి ఇప్పటికీ వదలని పడిషం పట్టిన మంత్రసానే దిక్కు. ఒకపక్క రాష్ట్రంలో, దేశంలో నాగరిక సమాజం సింగపూర్‌లా విలసిల్లుతున్నదని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు ఇటువంటి సన్నివేశాలు ఏజెన్సీలో పునరావృతమైతే ఇది దివాలాకోరు ప్రభుత్వంగా చెప్పుకోవచ్చు. ఇవాళ భాగ్యనగరంలో మెట్రోలు తిరిగినంత మాత్రాన ఇది బంగారు తెలంగాణ అని ఎలా అనగలరు? బంగారు తెలంగాణ అంటే తెలంగాణ నాలుగున్నర కోట్ల మంది ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలి. రెండు పూటలా కడుపునిండా భోజనం చేయాలి. కాని నేడు ఏజెన్సీలో గిరిజన గర్భవతులకి తగిన పౌష్టికాహారం అందుతుందా? అడవిలో దొరికే ఆహారం తక్కువైంది. మార్కెట్లో దొరికే ఆహారం కొనాలంటే డబ్బులు కావాలి. ఈ విధంగా పౌష్టికాహార లోపం వల్ల పురిట్లోనే పిల్లలు, తల్లులు కూడా చాలామంది చనిపోతున్నారు. సేల్స్ డిపో సరుకుల కోసం 20 మైళ్ల దూరం గర్భ సంచితో నడిచి సరుకులను మోసుకొని వెళ్లాల్సి వస్తుంది. నవమాసాలు మోసి ప్రసవించే సమయంలో వైద్యం అందక, రోడ్లు సరిగా లేక అంబులెన్స్‌లు రాక కండ్ల ముందే అడవిలో అతలాకుతలమై చనిపోతుంటే మనస్సు చలించిపోయే పరిస్థితి ఇప్పటికీ కనబడుతుంది. దీనంతటికీ కారణం ఏజెన్సీలో రోడ్డు సౌకర్యం లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. ఏజెన్సీలో ఖనిజ సంపద దోచుకోవడానికి ఎంత ఖర్చు అయినా వెచ్చించి కొండలు పిండి చేసైనా దారులు వేసుకొనే ప్రభుత్వాలు ఆదివాసీ గ్రామాలకు రోడ్లు లేని పరిస్థితి చూస్తే విడ్డూరం.

ఇంకోపక్క గిరిజన స్త్రీలపై అత్యాచారాలు జరిగినా సకాలంలో ఏజెన్సీలో వైద్యం సదుపాయానికి దిక్కులేదు. జిల్లాలో హెల్త్ యూనివర్సిటీ అని గొప్పలు చెప్పుకోవడమే మిగిలింది. మరోపక్క ఏజెన్సీ ప్రాంతంలో ఐటీడీఏల ద్వారా వందల కోట్లు వైద్యానికి ఖర్చు పెడుతుందని గొప్పలు చెప్పే ప్రభుత్వాలు గూడాలలో దోమ తెరలకే దిక్కులేదు. వర్షాకాలం వ్యాధులు సంభవించినప్పుడు ఏ ఒక్కరోజూ అడవులలో ఉండే గూడాలకు వెళ్లి క్యాంపులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. గర్భవతులు ప్రసవానికి ముందు ప్రసవం తరువాత నెలవారి సూదిమందుల కోసం సుమారు 20 మైళ్ల దూరం తమ బిడ్డలను చంకలో వేసుకొని కాలి నడకన ఉదయం బయలుదేరితే సాయంత్రంకల్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి రావాల్సి వస్తుంది. కష్టమైన, నష్టమైన తప్పదని భావించి వస్తే ఆ రోజు సూదులు వేసే డాక్టరు వస్తారో? రారో? కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. వర్షాకాలంలో చుట్టూ వాగులు, వంకలు, కొండలూ, కోనల నడుమ గర్భిణుల ఆర్తనాదాలు, అప్పుడు మంత్రసానే దేవుడు. వారివి తాడు బొంగరం లాంటి జీవితాల్లా మారిపోయాయి. అటువంటి సందర్భంలో జోలెకట్టి కావడి వేసుకొని వాగుల గుండా మోసుకొచ్చిన సందర్భాలు ఎన్నో. సరైన రోడ్డు సౌకర్యం లేక ఎడ్ల బండ్ల మీద ఆరోగ్య కేంద్రానికి తరలించే క్రమంలో అడవిలో నొప్పులతో అనారోగ్యంతో ప్రసవించిన వారు ఎందరో.. ఈ విధంగా ఈనాటి ప్రభుత్వం ఏజెన్సీ గిరిజన మహిళ ల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నది. ఓట్లు వేసి గెలిపించిన నాయకులేమో ఏసీ కార్లలో తిరుగుతుంటే గిరిజన బిడ్డలేమో ఎండలో ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారు. వర్షాకాలం దోమలవల్ల మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చి గూడాలు గూడాలే మంచం పడితే ఏ ఒక్క నాడు ప్రభుత్వం చొరవచూపి వైద్య సిబ్బందిని పంపించి దోమల మందు పిచికారి చేసిన సందర్భాలు లేవు.

సెల్ : 9494283038

నిదాస్ టోర్నీలో బంగ్లాపై బోణీ చేసి ఫామ్‌లోకొచ్చింది భారత్. సీనియర్లు లేని వేళ గబ్బర్ మెరిసినా కుర్రాళ్లు తొలి పోరులో లంక చేతిలో ఓడారు. నేడు మరోసారి లంకను ఢీకొట్టనున్న భారత్.. రోహిత్ శర్మ సారథ్యంలో ఆతిథ్య జట్టును మట్టికరిపించాలనే సంకల్పంతో ఉన్నది. మరో పక్క భారత్‌పై తొలి గెలుపుతో లంక శిబిరంలో ఆనందం పెల్లుబికినా.. బంగ్లా చేతిలో ఘోరపరాజయంతో ఆ జట్టు బలహీనతలను బయటపెట్టింది. ఇక ముక్కోణంలో మూడు దేశాలు ఒక్కో విజయాన్ని మాత్రమే నమోదు చేశాయి. నేటి పోరులో రెట్టించిన ఉత్సాహంతో లంకేయులను ఎదుర్కోనున్న భారత్ రెండో విజయంపై గురిపెట్టింది.



- దూకుడు మీదున్న యువ భారత్
- ముక్కోణపు టీ20 సిరీస్

జోరు కొనసాగాలి

శ్రీలంకతో టీమ్ ఇండియా టీ20 సమరం నేడు

నవతెలంగాణ-కొలంబో

రోహిత్ సేన ముందున్నది కఠిన పరీక్షేమీ కాదు. అలాగని టీమ్ ఇండియా అద్భుత రీతిలో ఏమీ ఆడటం లేదు. కానీ సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి లభించగా యువకులకు లంక పర్యటనలో చోటు దక్కగా.. కుర్రాళ్లు ఇంకా తమ సత్తా నిరూపించుకోవాల్సి ఉన్నది. బంగ్లాపై సునాయస విజయం సాధించిన భారత్ మరోసారి అలాంటి ప్రదర్శన చేసి లంకపై తొలి గెలుపు నమోదు చేయాలి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌ల మధ్య జరుగుతోన్న ముక్కోణపు సిరీస్ నిదాస్ టోర్నీలో భాగంగా.. నాల్గో మ్యాచ్‌లో నేడు భారత్ రెండో సారి ఆతిథ్య శ్రీలంకతో తలపడనున్నది. నిషేధం కారణంగా దినేశ్ చండిమాల్ జట్టుకు దూరం కావటంతో.. తిసారా పెరీరా లంకేయులకు నాయకత్వం వహించనున్నాడు.

సాయంత్రం 7 గంటలకు డీ స్పోర్ట్స్‌లో..

రోహిత్ పుంజుకునేనా? : యువ భారత్‌ను ముందుండి నడిపించాల్సిన సారథి రోహిత్ శర్మ ఫామ్‌పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కారణం గత కొద్ది మ్యాచులుగా అతడి పేలవ ప్రదర్శన. గత పది అంతర్జాతీయ పొట్టి పోరుల్లో ఒకే ఒక్క సారి మాత్రమే రోహిత్ 30 పరుగుల మార్కు అందుకున్నాడు. ఎప్పుడో ఒకసారి మెరవటం మిగతా మ్యాచుల్లో ఘోరంగా విఫలమవ్వటం రోహిత్‌కు పరిపాటి అయింది. ఈ తరహా ప్రదర్శనలతో జట్టుకు ఒరిగేదేమీ లేదన్నది క్రికెట్ పండితుల మాట. ఇక తొలి పోరులో లంక.. భారత్‌ను ఓడించిన నేపథ్యంలో ప్రతీకారం కోసం టీమ్ ఇండియా చూస్తోన్నది. దీంతో ఈ మ్యాచులోనైనా రోహిత్ పుంజుకోవాల్సి అవసరం ఉన్నది. టీమ్ ఇండియా బ్యాట్స్‌మెన్‌ల్లో ఓపెనర్ శిఖర్ ధావన్ కొలంబోలోని ప్రేమదాస మైదానంలో చెలరేగుతున్నాడు. తొలి పోరులో లంకను దాదాపుగా శతక్కొట్టిన గబ్బర్.. బంగ్లాతో మ్యాచ్‌లోనూ కీలక అర్ధ శతకంతో రెచ్చిపోయాడు. నేటి పోరులో సైతం భారత బ్యాటింగ్ లైనప్‌లో ఓపెనర్‌గా గబ్బర్ పాత్ర కీలకం. మనీశ్ పాండే, రిషబ్ పంత్‌లు తమ సత్తా నిరూపించుకోవాల్సి ఉన్నది. బౌలర్లలో జైదేవ్ ఉనద్కత్, వాషింగ్టన్ సుందర్ కొత్త బంతితో రాణిస్తున్నా నిలకడగా బంతులేయటం అలవర్చుకోవాలి. చాహల్, విజయ్ శంకర్ ఆశించిన మేర రాణిస్తున్నారు.

చండిమాల్‌పై నిషేధం : శ్రీలంక సారథి దినేశ్ చండిమాల్ రెండు మ్యాచుల నిషేధానికి గురయ్యాడు. బంగ్లాతో శనివారం జరిగిన మ్యాచులో శ్రీలక జట్టు ఓవర్ రేటు తప్పిదం కారణంగా ఐసీసీ అతనిపై క్రమశిక్షణా చర్యకు పూనుకొన్నది. దీంతో నేటి పోరు సహా ఈ నెల 16న బంగ్లాతో జరిగే మ్యాచుకు దినేశ్ దూరం కానున్నాడు. దీంతో సారథ్య బాధ్యతలు తిసార పెరీరా మోయనున్నాడు. లంక జట్టుకు కుశాల్ పెరీరా కీలకం. భారత్‌పై తొలి టీ20లో గెలుపులో అతనే మ్యాచ్‌ను మలుపు తిప్పింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో కుశాల్ మెండిస్ సైతం అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయటంలో పూర్తిగా విఫలమైన శ్రీలంక బౌలర్లు భారత్‌తో మరోసారి అలాంటి చెత్త ప్రదర్శనే చేస్తే లంకకు ఓటమి ఖాయం.

పిచ్/వాతావరణం: వాతారణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత మెరుపులతో కూడిన వర్షం కురిసే సూచనలున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. పిచ్ బ్యాట్స్‌మెన్‌కు అనుకూలం.

తుది జట్లు (అంచనా) : భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, రిషబ్ పంత్, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, వాషింగ్టన్ సుందర్, విజయ్ శంకర్, జైదేవ్ ఉనద్కత్, యుజ్వేంద్ర చాహల్, శార్దూల్ ఠాకూర్.

శ్రీలంక : దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, దశున్ శనక, దినేశ్ చండిమాల్, ఉపుల్ తరంగ, తిసారా పెరీరా, జీవన్ మెండిస్, అఖిల ధనంజయ, దుశ్మంత చమీరా, నువాన్ ప్రదీప్.

నైపుణ్యమే నా బలం

- టీమిండియా బౌలర్ జైదేవ్ ఉనద్కత్



న్యూఢిల్లీ : నైపుణ్యమే తన బలమని టీమిండియా యువ బౌలర్ జైదేవ్ ఉనద్కత్ అన్నాడు. ప్రత్యేకించి పొట్టి ఫార్మాట్‌లో వైవిధ్యం కూడిన బౌలింగ్ వల్లే బౌలర్లు రాణించగలడని తెలిపాడు. నైపుణ్యమే టీమిండియాలో తన స్థానాన్ని పొడగిస్తుందని నమ్మక వెలిబుచ్చాడు. దేశవాళీ, ఐపీఎల్ టోర్నీల్లో రాణించి గతేడాది డిసెంబర్‌లో జాతీయ జట్టులోకి పునరాగమనం చేసిన జైదేవ్ నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుం టున్నాడు. 'టీ20లో వైవిధ్యమే బౌలర్లకు కీలకం. బ్యాట్స్‌మెన్ ఆలోచనలను పసిగట్టి బంతులు వేయాలి. పవర్‌ప్లేలో బౌలింగ్ ఎంత క్లిష్టమో అందరికీ తెలిసిందే. ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను అడ్డుకోవడమనేది మా చేతుల్లోనే ఉంటుంది. అందుకే నా బౌలింగ్‌పై నమ్మకంతో, నన్ను నేనే ప్రోత్సాహపరచుకుంటా' అని ఉనద్కత్ పేర్కొన్నాడు.



అఖిల్ అదరహో

- 50 మీటర్ల రైఫిల్ విభాగంలో స్వర్ణం
- షూటింగ్ ప్రపంచ కప్

న్యూఢిల్లీ : షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు గురి తప్పటం లేదు. యువ షూటర్ అఖిల్ షెరాన్ పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో స్వర్ణం సాధించాడు. ప్రపంచకప్‌లో అరంగేట్రంలోనే పతకం సాధించిన నాలుగో భారత షూటర్‌గా చరిత్ర సృష్టించాడు. షహజర్ రిజ్వీ, మను భాకర్, మెహూలి గోష్, అంజుమ్ మౌద్గిల్ తమ విభాగాల్లో ఇంతకు ముందే పతకాలు సాధించారు. దీంతో ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో భారత్ తొలిసారి పతకాల పట్టికలో అగ్రస్థానంపై గురిపెట్టింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఫైనల్ పోరులో షెరాన్ 455.6 పాయింట్లతో ఆస్ట్రియా ఆటగాడు బెర్నార్డ్ పికిల్ (452)ను వెనక్కి నెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. ఐఎస్ఎస్ఎఫ్‌లో 38 సార్లు పతకాలు గెలిచిన హంగేరియన్ రైఫిల్ లెజెండ్ పీటర్ సిడి, రియో కాంస్య పతక విజేత అలెక్సిక్ సహా ఎయిర్ రైఫిల్ విజేత రేనాల్డ్ (ఫ్రాన్స్), సహచర భారత షూటర్ సంజీవ్ రాజ్‌పుత్ వంటి వారిని షెరాన్ వెనక్కునెట్టి పసిడి కైవసం చేసుకున్నాడు.

నవశకానికి నాంది

- భవిష్యత్ భారత షూటర్లదేన్న బింద్రా



న్యూఢిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో అదరగొడుతున్న భారత షూటర్లపై ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అభినవ్ బింద్రా ప్రశంసల జల్లు కురిపించారు. ప్రపంచకప్‌లో తొలిసారి భారత్ పతకాల పట్టికలో అగ్రస్థానంలో నిలిచేందుకు అవకాశాలు సృష్టించుకుంది. ఇప్పటి వరకుభారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలను సాధించింది. బింద్రా మాట్లాడుతూ.. 'మెక్సికో ప్రపంచకప్‌లో భారత ప్రదర్శన దేశ షూటింగ్‌లో నవశకానికి నాంది. భారత్‌లో షూటింగ్ భవిష్యత్తు సురక్షితమైన చేతుల్లో ఉన్నది. ఒలింపిక్ పోడియంపై యువ క్రీడాకారులకు సత్తా చాటగలరని నమ్మకమున్నది. ప్రపంచకప్ విజేతలకు అభినందనలు. ఆటగాళ్లలో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అందరికీ ప్రత్యేక అభినందనలు. వారి క షి ఇవాల భారత్‌కు పతకాలు తెచ్చిపెట్టింది' అన్నారు.

నువ్వా నేనా

- మూడో రౌండ్‌లో విలియమ్స్ సిస్టర్స్ పోరు
- ఇండియన్ వెల్స్ మాస్టర్స్ టెన్నిస్



ఇండియన్ వెల్స్ (అమెరికా) : అంతర్జాతీయ టెన్నిస్‌లో అరుదుగా కనిపించే పోరుకు ఇండియన్‌వెల్స్ టోర్నీ వేదిక కానున్నది. మూడో రౌండ్లోనే విలియమ్స్ సిస్టర్స్ తలపడనున్నారు. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధ రాత్రి జరిగిన పోరులో కికీ బెర్టన్స్‌పై వరుస సెట్లలో విజయం సాధించింది సెరెనా విలియమ్స్. 29వ సీడ్ కికీ బెర్టన్స్ (నెదర్లాండ్స్)ను 7(7)-6(5), 7-5తో అన్‌సీడెడ్ సెరెనా మట్టికరిపించింది. ఇక ఎనిమిదో సీడ్ వీనస్ విలియమ్స్ 6-3, 6-4తో సొరానా కిర్‌స్టియా (రొమేనియా)ను ఓడించింది. కాగా మూడో రౌండ్లో అక్కా చెల్లెల పోరుపై అభిమానుల్లో ఆసక్తి నెలకొన్నది. ఇప్పటివరకూ విలియమ్స్ సిస్టర్స్ 28 సార్లు తలపడ్డారు. చివరగా గతేడాది ఆస్ట్రేలియా ఓపెన్ ఫైనల్లో వీరిద్దరూ తలపడగా 6-4, 6-4తో సెరెనా పైచేయి సాధించింది. 2001లో తొలిసారి విలియమ్స్ సిస్టర్స్ మధ్య సెమీస్ పోరు జరగాల్సి ఉండగా.. వీనస్ పోరు విరమించుకుని చెల్లికి వాకోవర్ ఇచ్చింది.

ఆటకోసం కలవాలి!

- పేస్, బోపన్నలకు అఖిల భారత టెన్నిస్ సంఘం సూచన



న్యూఢిల్లీ : దేశం కోసం ఆడేటపుడు వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టాలని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ఆటగాళ్లకు సూచించింది. ఎవరెన్ని చెప్పినా తమ నిర్ణయంలో మార్పు ఉండదని స్పష్టం చేసింది. లియాండర్ పేస్‌తో కలిసి ఆడేందుకు ఇష్టం లేకున్నా డేవిస్‌కప్ డబుల్స్‌కు పేస్‌కు జతగా రోహన్ బోపన్నను ఎంపిక చేసింది. ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ యుకీ బాంబ్రి, రామ్‌కుమార్ రామనాథన్, సుమిత్ నాగల్, రోహన్ బోపన్న, లియాండర్ పేస్‌లను చైనాతో డెవిస్ కప్ టై పోరుకు పంపనున్నది. జట్టులో దివిజ్ శరణ్‌ను రిజర్వు ఆటగాడిగా ఎంపిక చేసింది. త్వరలో చైనాతో జరగబోయే డెవిస్ కప్ పోరుకు రోహన్ బోపన్న విశ్రాంతి కోరుతూ జట్టు కెప్టెన్ మహేశ్ భూపతి ఏఐటీఏతో చెప్పినట్టు తెలిసింది. పేస్‌తో కలిసి ఆడేందుకు రోహన్ విముఖత తెలిపినట్టు సమాచారం. అయితే ఇవేవీ పట్టించుకోని సెలక్టర్లు ఏప్రిల్ 6, 7న తైన్‌జిన్ (చైనా)లో జరుగనున్న డెవిస్ టైకు బోపన్న, పేస్‌లను పేర్లను ఖరారు చేశారు. దీంతో బోపన్నను సంధి కుదుర్చుకోవాల్సిన బాధ్యత పేస్‌దేనని భూపతి సూచించాడు. ఏడాది పొడుగునా వ్యక్తిగతంగా ఆడతారు. మూడు సార్లు దేశం కోసం ఆడేందుకు వ్యక్తిగత విభేదాలను రెండు వారాల పాటు పక్కన పెట్టలేరా అనిఏఐటీఏ అధికారుల మాటగా తెలుస్తోంది. 2012 నుంచి రోహన్‌కు పేస్‌కు మధ్య విభేదాలు మొదలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బోపన్నతో కలిసి ఆడేందుకు తనకేమీ ఇబ్బంది లేదని పేస్ తెలిపాడు. తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకున్నందుకు సంతోషం వెలిబుచ్చాడు.

అమ్మాయిల ఆఖరు పోరు డ్రా

- కొరియాతో ఐదో మ్యాచ్‌ను 1-1తో ముగించిన భారత్



న్యూఢిల్లీ : భారత మహిళల హాకీ జట్టు దక్షిణ కొరియా పర్యటనను డ్రాతో ముగించింది. ఐదు మ్యాచుల సిరీస్‌ను ఇదివరకే 3-1తో సొంతం చేసుకున్నది భారత్. ఆదివారం జరిగిన నామమాత్రపు ఆఖరు పోరును 1-1తో డ్రా గా ముగించింది. మూడో క్వార్టర్ వరకూ హోరాహోరీగా ఇరు జట్లు పోరాడినా.. గోల్స్ సాధించలేదు. చివరి క్వార్టర్ 48వ నిమిషం వద్ద కెప్టెన్ రాణి అందించిన పాస్‌ను వందన కాటారియా నేర్పుగా గోల్ పోస్టులోకి పంపించింది. కటారియా భారత్ తరపున తొలి గోల్ కొట్టి జట్టును 1-0తో ఆధిక్యంలో నిలిపింది. అయితే రెండు నిమిషాల వ్యవధిలోనే కొరియా సైతం గోల్ నమోదు చేసింది. బోమి కిమ్ 50వ నిమిషంలో గోల్‌తో భారత్‌తో ఆఖరు మ్యాచును కొరియా డ్రా చేసుకున్నది.



చేనేత రుణమాఫీ 500 మందికే!

- జీవోనెంబరు 26లో అనేక కొర్రీలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2014 తర్వాత అప్పు తీసుకున్న వారికే వర్తింపు
- రూ.2.50కోట్ల కేడీసీసీ బాకీల మాఫీకి నిరాకరణ
- నిబంధనలు సడలించాలి : ఆప్కో మాజీ డైరెక్టర్

నవతెలంగాణ, కరీంనగర్‌టౌన్

జీవో నెంబర్ 26లోని కొర్రీలతో నేతన్నలకు చేనేత రుణమాఫీ అందకుండా పోతున్నది. 2014 తర్వాత తీసుకున్న రుణమే మాఫీ అవుతున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కేవలం 500 మందికి లబ్ది పొందుతున్నారు. రూ.2.50 కోట్ల కేడీసీసీ బాకీల మాఫీకి సర్కారు నిరాకరిస్తున్నది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 22 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు రెండు వేల మంది కార్మికులు భాగస్వాములుగా పని చేస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 20, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున సంఘాలు నడుస్తున్నాయి. ఈ సంఘాలు కేడీసీసీ బ్యాంకు ద్వారా రూ.2కోట్లా 50 లక్షలు అప్పుగా తీసుకున్నాయి. వీటి మాఫీకి ప్రభుత్వం నిరాకరించింది. మరోవైపు అనేక సహకార సంఘాలు నష్టాల బాటలో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటికి రుణమాఫీ అవుతుందని ఆశించారు. కానీ, ప్రభుత్వం ప్రకటించిన చేనేత రుణమాఫీ 2014 జనవరి1 నుంచి 2017 మార్చి 31 మధ్యలో తీసుకున్న బాకీలకే వర్తిస్తోంది. కనీసం పదేండ్ల కాలంలోని రుణాలు మాఫీ అవుతాయని ఆశలో ఉన్న కార్మికులు దీంతో నిరాశకు గురవుతున్నారు. ఇందుకు సంబంధించి 2018 ఫిబ్రవరి 23న జారీ చేసిన జీవోనెంబరు 26 అనేక కొర్రీలు పెడుతోంది. 2014 జనవరి 1 నుంచి 2017 మార్చి 31 వరకు బ్యాంకర్లు మంజూరు చేసిన కార్మికుల రుణాల్లో రూ.లక్షలోపు బాకీలనే మాఫీ చేస్తున్నట్టు ప్రకటించింది. కొంత మంది కార్మికులు బ్యాంకులకు చెల్లించిన అప్పునకు రీయింబర్స్‌మెంట్‌గా వారి ఖాతాల్లో జమ చేస్తామని చెబుతోంది. 2017 డిసెంబర్ 21న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం (ఎస్ఎల్‌బీసీ) నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.

జీవో కొర్రీలతో 500మందికే లబ్ది

చేనేత కార్మికులకు వస్త్రోత్పత్తి పెట్టుబడికి బ్యాంకర్లు రుణాలివ్వడానికి ముందుకు రారు. తనఖా లేనిదే రూపాయి అప్పు కూడా ఇవ్వరు. ఈనేపథ్యంలో స్థిర ఆస్తులు తనఖా పెట్టి చేనేత కార్మికులు అప్పులు తీసుకున్నారు. ఇలా 15 ఏండ్లుగా బ్యాంకుల్లో రుణాలను పొందుతున్నారు. ప్రభుత్వాలు ప్రోత్సాహాలు కల్పించక పోవడం, ఉపాధి కరువడం మూలంగా ఇన్నేండ్లుగా బ్యాంకులకు బాకీలు చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆయా బకాయిలు పేరుకుపోయాయి.

ఉమ్మడి రాష్ట్రంలో చేనేత కార్మికులకు 'వీవర్ క్రెడిట్ స్కీం' ద్వారా బ్యాంకుల ద్వారా అప్పటి ప్రభుత్వం రుణాలు మంజూరు చేయించింది. ఇందులో భాగంగా 2013లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1200 మంది కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.30వేల చొప్పున రుణాలు ఇచ్చారు. ఇందులో 80 శాతం మంది కడుపుమాడ్చుకుని తిరిగి బ్యాంకులకు అప్పు చెల్లించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో వల్ల 2014కంటే ముందు రుణం తీసుకున్న వారు కావడంతో రీయింబర్స్‌మెంట్ కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఏదేమైనా జీవోలోని కొర్రీలతో ఈ మూడేండ్ల కాలంలో తీసుకున్న అప్పులు పరిశీలిస్తే 500లోపు కార్మికులు లబ్దిపొందనున్నారు.

షరతుల్లేకుండా మాఫీ చేయాలి
అడిగొప్పుల సత్యనారాయణ, ఆప్కో మాజీ డైరెక్టర్

చేనేత కార్మికుల దీర్ఘకాలిక రుణాలతో పాటు సహకార సంఘాల క్యాష్ క్రెడిట్‌ను ప్రభుత్వం మాఫీ చేయాలి. ప్రస్తుతం జారీ చేసిన జీవో వల్ల కార్మికులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. చేనేత రుణమాఫీ ప్రకటనతో సంతోషపడ్డాం. జీవోలో నిబంధనలు నిరాశకు గురి చేస్తున్నాయి. 2016లో జిల్లా కేంద్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ చేనేత రుణమాఫీ ప్రకటించారు. నియోజకవర్గంలోని సంఘాల పరిస్థితులు, కార్మికుల స్థితిగతులు తెలిసిన మంత్రి పునరాలోచించాలి. రుణమాఫీ అందరికీ వర్తించే విధంగా సవరించాలి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.